PJSA115B162

కథలు - కల్పనలు

(రవీంద్రుని మాతృకకు తెనుగు)

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి




సారస్వత పరిషత్తు

: హైదరాబాద్.

కథలు - కల్పనలు

(రవీంద్రుని మాతృకకు తెనుగు)



డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి




ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్ : హైదరాబాద్.

మొదటి కూర్పు : 1976

ప్రతులు : 1000

891.4434
తెలు



వెల : రూ. 4-00

ముద్రణ :

శివాజీ ప్రెస్, సికింద్రాబాదు.

పరిచయము

వసుధైక సమాజమును, విశ్వమానవ సౌభ్రాతృత్వమును తన ఆశయములుగ గ్రహించి వానిని తన జీవితమునందును తన రచనలందును ప్రతిఫలింప జేసిన మహనీయుడు విశ్వకవి రవీంద్రనాథ టాగూర్. తన మాతృభాషయగు బెంగాలీలోనే ఆయన తన రచనలను వెలువరించినను, వాని యందలి విశ్వజనీనత వలన అవి ప్రపంచపు ప్రముఖ భాషల అన్నింటిలో అనూదితములైనవి.

ఆంధ్రులకు రవీంద్రుని రచనలతో తొలి పరిచయము, ఆ రచనల ఆంగ్లానువాదముల వలన కలిగినది; అంతట కొందరు ఆ ఆంగ్లానువాదముల సాయముననే రవీంద్రుని రచనలను తెనిగించిరి. కాని ఇట్టి పరోక్షపు అనువాదముల వలన మూలము కోని రమ్యతకు భంగము కలుగు ఆస్కారము ఉన్నది. కావున బెంగాలీని అభ్యసించి, బెంగాలీనుండియే ఆ రచనలను తెలుగున అనువదించుటకు కొందరు ధీమంతులు కృషి చేసిరి. అట్టివారిలో అగ్రశ్రేణికి చెందినవారు డా. బెజవాడ గోపాలరెడ్డి.

శాంతినికేతనమున అంతేవాసిగ అధ్యయనమును సాగించిన కాలమున డా. రెడ్డి గారికి రవీంద్రుని వ్యక్తిత్వముతోను, ఆ మహనీయుని ఆదర్శమయ జీవితముతోను సాన్నిహిత్యము లభించినది. అందులకు తోడుగ బెంగాలీ భాషయందును పరిచితి లభించి, రవీంద్రుని సాహిత్య మాధుర్యమును ఆస్వాదించు భాగ్యమును సిద్ధించినది. ఆ రసమయ సాహిత్యమును ఆంధ్రులకు అందజేయుటకై డా. రెడ్డిగారు పూనుకొనిరి.

సార్వజనిక సేవాకార్యక్రమములందు నిరంతరము వ్యాపృతులయ్యును, తీరిక లభించినపుడెల్ల ఈ అనువాద కార్యక్రమమును కొనసాగించి రవీంద్రుని నాటికలు మొదలగువాని అనువాదములను అనేకము ఇదివరలో డా. రెడ్డిగారు ప్రకటించిరి.

ఈ 'కథలు - కల్పనలు' అనుదాని బెంగాలీ మూలము రవీంద్రుని రచనలందన్నింట, వంగదేశమున, ఎక్కువ ప్రచారమును పొంది, పండితులను పామరులను సమానముగ ఆకర్షింపగలిగినది. అట్టి గ్రంథమును రెడ్డిగారు అనువదించి, దానిని

ప్రకటించు భాగ్యమును ఆంధ్ర సారస్వత పరిషత్తునకు కల్పించిరి. ఇందులకై రెడ్డి గారికి, పరిషత్తు సదా కృతజ్ఞతాబద్ధము.

వ్యవధి తక్కువగ ఉన్నను, ఈ గ్రంథ ముద్రణకు పూనుకొని సకాలమున ముద్రించి ఇచ్చిన శివాజి ప్రెస్, నికింద్రాబాదు వారికి మా కృతజ్ఞత.

హైదరాబాదు,
5-8-1976.

దేవులపల్లి రామానుజరావు.

తొలిపలుకు

శ్రీ రవీంద్రనాథుని 'కథా ఓ కాహినీ' ఆను గ్రంథమును పాఠ్య గ్రంథముగ నేను 1924 సం॥లో శాంతినికేతనమున చదువుచుండినపుడు ఎంత ఆహ్లాదమును అనుభవించితినో చెప్పలేను. రమ్యమైన ఛందోరీతులతో, అంత్యానుప్రాసములతో మధుర ముగ నడచు ఈ కథలను - గాథలను వచనమున యథా మూలకముగ అనువదించు సౌభాగ్యము నేను 1948 సం॥లో డెటినూ్యగ ఉండినపుడు దొరకినది. మొదటి 14 కథలును వెల్లూరు జైలులోను, ఆ తర్వాతవి తంజావూరు జైలులోను అనువదించితిని ఇంకొక 33 సంవత్సరముల తర్వాత వీనిని ప్రచురింపగలుగుచున్నాను.

మొదటి 24 కథలకు ఆధారములు ఏ గ్రంథమునుండియో గైకొని, తన కవితా వల్లరిపై పుష్పించునటులచేసెను రవీంద్రుడు. రెండవ భాగమైన కల్పనలు వారి స్వకపోల కల్పితములే. రవీంద్ర సాహిత్యమున ఈ గ్రంథమునకు వచ్చిన ప్రచారము గీతాంజలికి కూడ రాలేదేమో! కారణముగ ముఖ్యముగ ఉన్నతపాఠశాలలలోను, కళాశాలలలోనూ, దీనిని పాఠ్యగ్రంథముగ నిర్ణయించబట్టి. బంగ్లా దేశములోను దీని ప్రచారము మెండు.

కథలను వ్రాయుటలో సిద్ధహస్తుడు రవీంద్రుడు. వచనమున రచించిన కథలు విశ్వఖ్యాతినే కాంచినవి. వారికి సహజమగు పద్యములలో కథలు చెప్పుటయు, క్రొత్త క్రొత్త చంధస్సులతో వానిని నడిపించుటయు దీని ప్రత్యేకత. అందులో ఉదాత్త భావములతో నీతిదాయకములైన కథలు ఇవి. తన 36, 37, 38 సం॥వయస్సున రచించినవి. 1900 సం॥న గ్రంథరూపమున వెలసినది, కథల సంపుటము; 'కల్పన లతో కలిసి 1910 సం॥లో మొదటి ప్రచురణ వెలసినది. తర్వాత 40, 50 పునర్ముద్రణలు జరిగినవి. కొన్ని లక్షల ప్రతులు అమ్ముడుపోయి యుండవచ్చును.

ఇందలి 'ఋణ విమోచనము' శ్యామ పేరునను 'పూజారిణి' నటీర్ పూజా పేరుతోను నృత్యనాటికల రూపమున వెలసినవి; కేవలము నృత్తమునకు అనువగు పాటలతోనే రూపొంది ప్రదర్శితములైనవి.

మూలమును రచించిన విజ్ఞానాచార్యులును, తన దగ్గర స్నేహితులలో నొకరును నగు శ్రీ జగదీశచంద్రబోసుకు అంకితమిచ్చిరి,

'సత్యరత్నమును నీ వొసగితివి
దానికి మారుగ
కథలు - కల్పనలు మాత్రము
ఒసగుచున్నాను ఉపహారముగ'

అను పద్యముతోకూడ.

హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తు యీ గ్రంథ ముద్రణ బాధ్యతను స్వీకరించినది. ఇందుకు సారస్వత పరిషత్తుకు నా కృతజ్ఞతలు. ఈ నా చిన్న ప్రయత్నము ఆంధ్రుల ఆశీస్సుల పొందుగాత.

సుదర్శనమహల్,
నెల్లూరు.
25-2-1976.

బెజవాడ గోపాలరెడ్డి.

పీఠిక

ఆదిత్య హృదయంలో ఒక శ్లోకపాదము :

కవిర్విశ్వో మహాతేజా రక్తస్సర్వభవోద్భవః

ఈ రవిప్రశంసకు అర్థము : విశ్వకవి, తేజోమయుడు, రాగమయుడు, సకల సృజన కార్యపరుడు- అని. మహర్షి దేవేంద్రనాథ టాగూరు తన కుమారునకు ''రవీంద్రనాథ'' నామకరణము చేయుటలోని ఆశంస, ఆశీస్సు అతడు ''విశ్వకవి''గా విఖ్యాతుడు కాగలడనియే. మహర్షుల వాక్కు పొల్లువోదు. విశ్వకవియైనాడు రవి కవి ప్రాక్పశ్చిమ ఖండములలో దేదీప్యమానముగా వెలిగిపోయినది రవీంద్రుని కర ప్రసారము. నేల నాలుగు చెఱగుల రంజింపజేసినది వారి కవితాప్రచారము. ఏ ప్రాచీన కవికి గూడ తన జీవిత కాలములోనే ఇంత విశ్వవ్యాప్తమైన యశస్సు లభ్యమైయుండలేదు. వారి దర్శన భాగ్యము నాకు నలుబది నాలుగేండ్ల క్రిందట మదరాసులో లభ్యమైనది. స్వయముగా వారు ఇంగ్లీషులో బంగాళీలో Gardener, Cresent Moon నుంచి గేయములు ఆలపించగా విను భాగ్యము లభ్యమైనది. వారి సన్నిధానములో వారి నాటకము King of the dark chamber, శాంతి నికేతన బాల బాలికలు ప్రదర్శించగా చూచు భాగ్యము లభ్యమైనది. గీతాంజలి కర్తగా జగత్కవియైన రవీంద్రులవారికి అప్పుడు నేను ఘటించిన గీతాంజలి.

''కాలభిద్ధ్వజ రావముల్ మాఱుమ్రోయగ దిక్తటుల్
నిబిడ తమము హరించుచున్ విమలతేజము నించుచున్
ప్రాక్ప్రతీచీ దిశావాల్లభ్య వైభవముక్తుడై
చక్షురంతర్నిరజోన్మేష కారణ కిరణుడై
నిత్య సముదయభానుడై పూర్ణుడై సంవేద్యుడై
లోకదీపకమూర్తి క్రాల్ రవి జగత్కవికంజలుల్''

వారి రూప కంఠ సాహిత్యముల చేత ఉత్తేజితమైన అప్పటి యువజన సహస్రములో నేనొక కశ్చిత్.

ఒక శతాబ్దము గడచిపోయినది టాగూరు జన్మించి. గడచిన నూరేండ్లలో దేశదాస్య విమోచన మహోద్యమములో జాతి నిమగ్నమైయున్నపుడు, ఏదైన నిర్ణయమువల్లనో మహాపురుషులు పలువురు పుట్టుట, జాతిని ఉత్తేజితము చేయుట, జనానీకమునకు నవచైతన్యం ప్రసాదించుట జరిగినది. వారందజిలో గాంధి, నెహ్రూ, టాగూరు మూర్తిత్రయం. గాంధి, నెహ్రూలకే గాక భారత జాతి కంతటికి గురుదేవులుగా భాసించిన గౌరవము టాగూరుగారిది. ఆ విశ్వకవి స్థాపించిన విశ్వభారతిలో, ఆ గురుదేవుల సన్నిధానములో అంతేవాసిగా విద్యార్థిజీవితము గడపగలిగిన భాగ్యము మా గోపాలరెడ్డిగారిది. ఆ విశ్వభారతిలోనే యిటీవల స్నాతకోత్సవ నేతృత్వం వహించు భాగ్యము గూడ వారికి దక్కినది.

సాహిత్య ప్రక్రియలన్నిటిని స్పృశించి, అన్నిటిని మెఱుగు వెట్టిన వారేయైనను గేయము (lyric), కథానిక (short story) అను రెండు ప్రక్రియలు టాగూరు అపూర్వ ప్రతిభా ప్రకాశమునకు ఆనువైనవి. భావపటిమచేత భాషను అతిక్రమించి, అనువాదములు కూడ అత్యంతమైన ఆహ్లాదము చేకూర్చ గలిగినవి. ''కథా ఓ కాహిని'' అనే రచనా సంపుటి కథాత్మకమైన గేయములు కావుటచేత ఆ రెండు ప్రక్రియల అద్భుత సమ్మేళనమై అతి విశిష్టమై రసజ్ఞులకు సామాన్యులకు గూడ పరమాహ్లాద జనకమైనది. అందువలననే వీని ప్రచారము టాగూరుగారి ఇతర రచనలను మించిపోవుట.

ఈ గేయము లన్నియు వారు నడివయస్సులో రచించుటచేత, భావములో ఉద్వేగము, వర్ణనలో ఉత్సాహము, సన్నివేశములో చమత్కారము ప్రతి కథలో ప్రస్ఫుటముగా గోచరించుచున్నవి. అన్నిటిలో గూడ ఏదో యొక అలౌకిక స్ఫురణ అంతర్నిగూఢముగా నుండుట ఋషియైన యీ మహాకవి లక్షణము.

ప్రథమ భాగము కథలు 24 లో ఒకటి వైదికమైన ఉపనిషద్గాథ. ఏడెనిమిది కథలు బౌద్ధ వాఙ్మయములోనివి. ఒకటి కబీరునకు, ఒకటి తులసీదాసునకు, ఒకటి సనాతన గోస్వామికి, మూడు మహారాష్ట్ర చరితకు, అయిదు రాజస్థాన కథావళికి, నాలుగు శిక్కుల చరిత్రకు సంబంధించినవి.

తొలిదైన సత్యకాముడు (జాబాలి) కథ తొలి మినుకుల నాటి ప్రసక్తి ప్రశస్తమైన గాథ. తన పుట్టువురహస్యమునే నిస్సంకోచముగా సత్యము పల్కిన సార్థక నాముడు సత్యకాముడు. సత్యలక్షణము చేత బ్రాహ్మణుడుగా నిరూపితుడైనాడు. అందులో గర్భితమై యున్న పరమార్థము - బ్రహ్మవిద్య వడయుటకై గదా బాలుడు

పోయినది ఋష్యాశ్రమమునకు. బ్రహ్మపదార్థము తెలియునది గాదు; తెలియదగిన దంతయు తెలిసికొని అవాఙ్మానసగోచరమైన ఆ బ్రహ్మ పదార్థము తెలియరానిదని తెలిసి కొనుటయే బ్రహ్మ విద్య. వ్యక్తా వ్యక్త సంయోగ సంజనితమైనది జీవలోకము. స్త్రీపుంసయోగోద్భవము. వ్యక్తమైన ప్రకృతి స్త్రీ, అవ్యక్తమైన పురుషుడు ఈశ్వరుడు. ప్రకృతి ప్రత్యక్షము. పురుషుడు అప్రత్యక్షము. గుణముచేత మాత్రమే గుర్తింపదగినది కర్తృత్వము – అన్న సదుపదేశము గూడ బాలుని సత్యవాక్కుననే అందుకొన్న వాడై గురువు బాలుని 'ద్విజోత్తముడవు నాయనా' అని సంబోధింపగల్గెను.

ఇట్టి రహస్యములు నీతిబోధలు కథలన్నిట గర్భితములైయున్నవి. దైవసన్నిధానమొకటి ఆవరించియున్నది. ఆ కథల వాతావరణమునే భగవత్స్పర్శ తగులుచున్నది. అందలి పాత్రలకు పాఠకులకు, చలజీవితములో నిశ్చలాంశమేదో ద్యోతమానమగుచున్నది ఆ స్త్రీ పురుషుల సునాయాస నిశ్చయములో, ధైర్య స్థైర్య ప్రకాశనములో, ప్రాణపరిత్యాగములో, పరమకారుణ్యములో, అలౌకిక విచారములో, ఆనందానుభూతిలో.

పేదరాలు ఒంటి చీరనూడ్చి భిక్షాదానము సేయుటలోని సర్వసంగ పరిత్యాగము; అకాల పద్మమునకు వేలము పాట నివర్తి చేసిన సుదాసుడు అమృతరాసులు వర్షించు బుద్ధ భగవానుని మందస్మితము లభ్యమైనంతట 'ఏమి కోరెదవనగా' మీ చరణ రజోరేణువు' అని సంతుష్టిగా సమాధాన మిచ్చుట; ప్రాణములకు తెగించి బుద్ధదేవుని స్తూపముకడ హారతి వెలిగించి రాజభటుల కత్తికి కుత్తుకనిచ్చిన శ్రీమతి భక్త్యావేశము; అభిసారిక కథలో ''విలాసినిని భోగించుటకుగాదు, పాపపంకిలను కరుణించుటకే సన్యాసి సమాగతి'' అన్న సమన్వయము; కాశీకోసల రాజుల మధ్య స్పర్ధలో – దాన గుణమునకు ద్రవ్యము అవసరములేదు; రజస్సుచేకూర్చునది ద్రవ్యము యశస్సు చేకూర్చునది దానము, అన్నవ్యత్యాసము; కబీరు కథలో నిజమైన సాధువునకు అవమానము కూడ శిరోభూషణమే అన్న నిరూపణము; తులసీదాసు బోధలో స్త్రీకి భర్త స్వామి లక్ష్మీనారాయణుడే; ఆ స్వామిని ప్రత్యక్షములో మగని రూపమున, పరోక్షములో అంతస్వరూపమున పతివ్రత ఆరాధించును – అన్న మహోపదేశము; గోస్వామి కథలో దైవ స్పర్శకు లోకస్పర్శకు గల తారతమ్యము నిరూపించుచు ''ఏ ధనమున ధనివై, ఓ మణీ, యీ మణిని సరకు చేయకున్నావో, దానిలోని స్వల్పాంశమును నతశిరమున నేనభిలషించుచున్నాను'' అనుచు బ్రాహ్మణుడు గోస్వామిచరణ

ముల వ్రాలి స్పర్శమణిని నదీజలములలో పాఱవైచుటలో దైవమే చింతామణియన్న సిద్ధాంతము - మహనీయముగా భాసించుచున్నవి.

నాలుగువేలేండ్లు ఆర్యజాతి జీవనము దిక్ప్రదర్శనముగా రూపించిన యీ కథలలో ఎందఱు మహాపురుషులు మనకు దర్శనమిచ్చుచున్నారు : వేదర్షితో ప్రారంభమై భగవానుడు గౌతమబుద్ధుడు, సన్యాసి ఉపగుప్తుడు, భక్త కబీరు, రామ చరితమానసకర్త తులసీదాసు, బృందావనగురువు గోస్వామి, ఛత్రపతి శివాజి, శిక్కుల చరమ గురువు గోవిందసింగు - వారి చరితాపగల వలన పవిత్రమైనది భారత భూమి, రవీంద్రుని కావ్యసీమ.

రసపుత్రి గాథలు 'మానముముందు ప్రాణము తృణము' అన్న ఆ జాతి స్త్రీ పురుషుల గాఢ విశ్వాసమునకు సన్నిదర్శనలు. వీనిలో కడు రమణీయముగా చిత్రితమైనది ''హోళీ పండుగ'' కథ.

మఱి మానసీయమైనది నా చిత్తమునకు మిక్కిలి హత్తుకొన్నది గురు గోవింద సింగ్ గాథ (23, 24). శిక్కు గణమును వీరగణముగా రూపొందించినవాడు గురు గోవింద్. తన యెడ అచంచల భక్తి విశ్వాసములతో, అప్రతిమానమైన ధైర్య స్థైర్యములతో శిక్కులు మొగలాయి ప్రభుత్వమును ఎదిరించి, పోరిపోరి విజయులు కాలేకపోయిన కాలమది. ఇంత రక్తపాతము వృథాయైనదా అని గురువు సంశయించెనో లేదో, రవీంద్రుని రచనలో అది నిజమే అయియుండనోపు ననిపించుచున్నది. తానొక పఠానుని తలత్రుంచి, వాని కొడుకునే పెంచి పెద్దచేసి, తన అనుయాయిగా దగ్గర నుంచుకొని, 'పితృహంతపై ప్రతీకారము చేయవోయి' అని వానిని కవ్వించి వాని కత్తి పోటును తానుగా అహ్వానించిన సన్నివేశము అద్భుతముగ ప్రదర్శించినాడు మహాకవి. ఇందు చెప్పనిది ధ్వనితమై యున్నది శిక్కుల ఉత్తరకాల చరిత. త్యాగ జీవులగు శిక్కుల రక్తపాతము వృథాపోలేదు. మొగలాయి రాజ్యపతనము, శిక్కు రాజ్య ఆభ్యుత్థానము ఏక కాలమున ఘటిల్లినవి. శిక్కుల రక్తముతో శోణదుర్గ మేర్పడినది పశ్చిమోత్తర భారతమున ఆర్య ధర్మమునకు; 'సత్యమేవ జయతే' సార్థకమైనది.

రెండవ భాగము 'కల్పనలు' అల్పసంఖ్యవేయైనను రవీంద్రుని ప్రత్యేక ముద్రను ప్రస్ఫుటముగా గల్గియున్నవి. పురాణభృత్యుడు మఱువలేని వ్యక్తి, త్రోపాడు చున్నను వెన్నంటి వచ్చు ఆ స్వభావమునకు కారణము పూర్వజన్మ సంసర్గమేమో. ఆప్తులమని చుట్టుకొను బంధుజనము వదలిపెట్టుచున్నపుడు, అంటిపెట్టుకొని యుండుటే

గాదు తన యజమానిని. భృత్యుని పరిచర్యచే కోలుకొన్న యజమాని మఱుచి తనకు సంక్రమించగా, తనకు పరిచర్య చేయువారు లేరు సరిగదా నిశ్చింతగా ప్రాణములు వదలిన విశ్వాసపరుడు రవీంద్రుడు చిత్రించిన పురాణభృత్యుడు.

'ఒకటింపాతిక యకరా భూమి' అన్న కథలో పేదపాటకుని నోట తొణికించిన వంగసీమాభిమానము రవీంద్రునిదే.

''నమోనమః సుందరీ, మమజననీ వంగభూమిః గంగా తీరమున స్నిగ్ధ సమీరములు క్రీడలు సల్పుచుండ, జీవితమునే ఆవరించుచున్నావు, నీవు. విశాల ములగు పచ్చని పొలములు బయళ్లు గగనలలాటమున నీపద ధూళిని ముద్దిడుకొను చున్నవి. నిబిడచ్ఛాయలలో శాంతిగీతముల వలె అలరారుచున్నవి చిన్న చిన్న పల్లె టూళ్లు; సాంద్రపల్లవ ఆమ్ర కానకములు గోపబాలుర కేళీగృహము లగుచున్నవి. ఆగాధ స్తబ్ధ కాసారముల నీలాంబువులు, సానురాగములు శీతలములు అగు నిశీథములు. మధుభరిత హృదయలగు వంగ వధువులు నీరముల గృహములకు కొంపోవుచుందురు. అమ్మాయని వారిని పిలుచుటకు ప్రాణములు పొంగి పైకి ఉబుకుచుండును. ఆనందా శ్రువులు నయనముల క్రమ్ముచుండును.''

రవీంద్రుని వలన వంగసీమపై వంగసాహిత్యముపై బంగాళీలకే గాదు, ఉత్తర దక్షిణ ఖండములులోని యావద్భారత జనానీకమునకు ప్రేమభిమానము మెండుకొని యున్నది. ఆంధ్రులకు మఱింతగా ఆ యభిమానమున్నది. దేవభాషకు ఉత్తరప్రాంత మున బంగాళీ, దక్షిణ ప్రాంతమున తెలుగు అత్యంతము సన్నిహితములై నవగుట కూడ అందుకు కారణము కావచ్చును. వారును వీరును కుడి యెడమ వాసిగా హృద యోద్వేగ సదృశులు; వంగ సీమలో మహిళామహిమము ఒకపాలు అధికమేమో! పై హేతువులచే గాబోలు వంగ సాహిత్యమునకు ఆంధ్రదేశమున విచ్చువాకిళ్లు.

శ్రీ గోపాలరెడ్డిగారి నిర్విరామమైన రాజకీయ జీవితములో విరామము దొరకినది కారావాసములో. స్వాతంత్ర్య మహోద్యమములో కారాగారమనగా శ్రీకృష్ణజన్మ స్థలముగా, స్వాతంత్ర్య తపస్వుల తపోవనముగా, కర్మ యోగ దీక్షితుల యజ్ఞశాలగా భాసించినది. అక్కడ వారు తెలుగు చేసినవి గురుదేవుల యీ కథా సంపుటి. బంగాళీ మాతృక గేయరూపము; ఆంధ్రానువాదము వచన రూపము. ఐనను వాక్య సరణిలో శబ్ద ప్రయోగములో, భావచిత్రీకరణలో కవితామార్గమునే అవలంబించినారు రెడ్డి గారు. అందువల్లనే సంస్కృత శబ్ద బాహుళ్యము గూడ. బంగాళీ సాంప్రదాయము ననుసరించి కాబోలు తెలుగు రచనలో సమాస కల్పనము మానుకొని చిన్న చిన్న కూర్పు

లను కూడ విడివిడిగా విసంధి పాటించి రచించుటయైనది. ముఖ్య లక్ష్యమైన భావప్రతి బింబము ఆంధ్రులకు అందిచ్చుటలో శ్రీ గోపాలరెడ్డిగారు కృతకృత్యులై నారు

కాలము మారిపోవుకొలది సాహిత్యలోకమున క్రొత్త విలువలు రూపింపబడు చున్నవి తాత్కాలికములకు ప్రాధాన్యము, శాశ్వతములకు క్రించుదనము ప్రచార మగుచున్నది. భారత జాతికి, మానవ జాతికే శాశ్వతమైన విలువగలదై అక్షర రమ్యత (inperishable sweetness) గల టాగూరు రచనలను ఆంధ్రలోకము ముందుంచుట రెడ్డిగారు కావించిన ఆవశ్యకమైన సారస్వత సేవ, నిజమైన గురూపహారము.

ఎంతో ఔచిత్యముతో కూడి యున్నది, ఈ కృతి తిక్కవరపు రామిరెడ్డిగారికి అంకితము కావుట. గోపాలరెడ్డిగారికే బంధువుగాదు రామిరెడ్డిగారు, సాహితీ బంధువు, వదాన్యతా సింధువుగూడ. తెలుగు సాహితికి మూలకర్తలైన కవిత్రయమువారి జయంతులకు శాశ్వతనిధి కల్పించిన కవిపోషకమూర్తి ఆ కీర్తిమూర్తి. లక్ష్మీ సరస్వతులను ఏకస్థము చేసినారు మామ అల్లుడు ఉభయులు సుదర్శనమహాలులో.

నల, ఉగాది.
నెల్లూరు,
31-3-76.

గుఱ్ఱం వేంకటసుబ్రహ్మణ్యం.

అంకితము

—:o:—

గాంధిజీభక్తులై

1922 సం.న ఒక వత్సర కఠిన కారాగారశిక్షను అనుభవించి

విద్యకై, సాంఘిక సంక్షేమమునకై

భూరి విరాళముల నొసగి

వదాన్య శేఖరులై

కవిజన పోషకులై

కవిత్రయ సమారాధకులై

తిక్కన కవితావేశకులై

కీర్తికాయులైన

మామ

శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారి

(16-3-1891 : 9-12-1973)

దివ్య స్మృతికి

విషయసూచిక

1వ భాగము

1.	బ్రాహ్మణుడు	...	...	...	1
2.	శ్రేష్ఠమగు శిక్ష	...	...	...	4
3.	మూల్య ప్రాప్తి	...	...	...	7
4.	నగర లక్ష్మి	...	...	...	9
5.	పూజారిణి	...	...	...	11
6.	అభిసారము	...	...	...	14
7.	మస్తక విక్రయము	...	....	...	17
8.	ఋణ విముక్తి	...	....	...	20
9.	సామాన్య నష్టము	...	...	...	28
10.	అవమాన వరము	...	...	...	32
11.	భర్తను పొందుట	...	...	...	35
12.	స్పర్శమణి	...	...	...	37
13.	ప్రతినిధి	....	...	...	39
14.	రాజ విచారణ	...	...	...	42
15.	న్యాయాధిపతి	...	...	...	43
16.	శపథ రక్షణ	...	...	...	45
17.	కృత్రిమ దుర్గము	....	...	...	47
18.	వివాహము	....	...	...	49
19.	మానవంతుడు	...	....	...	52
20.	హోలి పండుగ	...	...	...	54
21.	ప్రార్థనాతీతమగు దానము	...	...	....	58
22.	బంది వీరుడు	...	...	...	59
23.	అంత్య శిక్షణ	...	...	...	62
24.	గురు గోవింద్	...	...	....	67

2వ భాగము

1.	గాన భంగము	...	...	...	73
2.	పురాతన భృత్యుడు	...	...	...	77
3.	ఒకటింపాతిక యకరా భూమి	...	...	...	80
4.	దేవతకు తిండి	...	...	...	83
5.	నిష్ఫల ఉపహారము	...	...	...	89
6.	దీనదానము	...	...	....	91
7.	విసర్జన	...	....	...	93
8.	పాదరక్షల కనిపెట్టుట	...	...	...	97



1వ భాగము

కథలు

15

కథలు - కల్పనలు

1

బ్రాహ్మణుడు

సరస్వతీ తీరమున వనచ్ఛాయలు దీర్ఘములై క్రమక్రమముగ మసకలు క్రమ్ముచుండ, సంధ్యాసూర్యుడు అస్తమించెను. వనాంతరములనుండి, సమిధల నేరి, శిరములపైనిడి, ఋషిబాలకులు నిశ్శబ్ద ఆశ్రమమునకు కొని తెచ్చిరి. మనోహరములై, సరళశాంతముచే ఒప్పు కన్నులు కలవియై, బడలిన హోమధేనువుల తపోవనమునందలి కోష్ఠములకు పేర్లతో పిలుచుచు మరల్చిరి. సంధ్యాస్నానముల ముగించి, కుటీరప్రాంగణమున హోమాగ్నికాంతియందు, గురుగౌతముని పరివేష్టించి తమతమ ఆసనముల అలంకరించిరి.

శూన్య అనంత గగనమున మహాశాంతియు ధ్యానమగ్నమాయెనా అను నట్లుండెను. నిశ్శబ్ద శిష్యులవలె, నక్షత్రములును బారులుతీర్చి, కుతూహల మున కదలక మెదలక కూర్చుండెనా అనునట్లుండెను. 'బిడ్డలారా, బ్రహ్మ విద్యను ఉపదేశించెదను, అవధరింపుడు' అని మహర్షిగౌతముడు పలుకు నప్పటికి, అత్యంత మౌనమున గంభీరముగ ఉన్న ఆశ్రమము చకితమై పోయెను.

అంతలో అగ్ర్యముతో అంజలి నించి, ఆ ప్రాంగణతలమున తరుణ బాలకు డొకడు ప్రవేశించెను. ఋషిచరణ కమలములకడ, ఫలపుష్పముల సమర్పించి, భక్తిభరితుడై నమస్కరించి 'భగవాన్, బ్రహ్మవిద్యా శిక్షాభిలాషిని, దీక్షకొరకై వచ్చినాడను. కుశక్షేత్రవాసిని, సత్యకాముడనబడువాడను' అని కోకిలకంఠమున, సుధాస్నిగ్ధములగు స్వరముల విన్నవించెను.

విని స్మితహాసమున "సౌమ్యుడా, కుశలముగ చిరంజీవివై ఉందువు గాత, నీ గోత్రమెద్ది ? వత్సా, బ్రహ్మవిద్యాప్రాప్తికి కేవలము బ్రాహ్మణులకే కలదు అధికారము" అని అనురాగమున శాంతమైన భాషయందు బ్రహ్మర్షి పలికెను.

"భగవాన్, గోత్రము నాకు తెలియదు, మీరు అనుమతించిన తల్లిని అడిగి తెలిసికొని రేపు వచ్చెదను" అని బాలకుడు నెమ్మదిగ విన్నవించెను. ఋషిచరణములకు తిరిగి నమస్కరించి, సత్యకాముడు దట్టమగు చీకట్లు పర్వియున్న అడవిబాటల గడచి, స్వచ్ఛ శాంత నీరములతో లోతులేక పారుచున్న సరస్వతీనదిని దాటి, ఇసుకతిన్నెలప్రక్క, నిద్రతో మౌనముగ ఉన్న గ్రామమును చేరి జననికుటీరమున ప్రవేశించెను.

కుటీరమున సాయంకాలము వెలిగింపబడిన దీపము వెలుగుచుండెను. పుత్రుని రాకకై, అతడు వచ్చు బాటవైపు ఎదురుచూచుచు, జనని జాబాల ద్వారమును ఆని వేచియుండెను. అతనిని కాంచి, వక్షమునకు అదిమి, శిరమును మూర్కొని, కుశలముల, జరిగిన ఉదంతముల అడిగెను.

"అమ్మా, చెప్పు, నా తండ్రిపేరు ఏమి ? ఏ కులమున జన్మించితిని ? గౌతమఋషికడకు దీక్షకై పోగా 'వత్సా ! బ్రహ్మవిద్యాప్రాప్తికి కేవలము బ్రాహ్మణులకే కలదు అధికారము' అని గురువు సెలవిచ్చెను. తల్లీ, మన గోత్రమేమి" అని సత్యకాముడు అడిగెను.

ఈ మాటల వినగనే, తలను వంచి 'యౌవనమున దారిద్ర్య దుఃఖమున, బహుజనుల పరిచర్యల కావించి నిన్ను కంటిని. వెండ్లికాని జాబాలికడుపున పుట్టితివి. నాయనా, మన గోత్రము నాకు తెలియదు'అని జనని గద్గదకంఠమున ఉత్తరమిచ్చెను.

మరునాడు, తపోవన తరుశిరములపై, నిర్మలమగు లేతయెండలు తళతళ మెరయుచుండెను. తాపస బాలకులు తరుణ అరుణకాంతియందు రమ్యమగు శిశిరకణములవలె, భక్తి అశ్రువులచే ధౌతమైన నవపుణ్య కాంతి పుంజములవలె ఒప్పుచుండిరి. ప్రాతఃస్నానముచే నిగనిగలాడు మూర్తులతో

తడిసి చెమ్మగనున్న జడలతో, పసిడివెలుగులు సుకుమార కోమలకాయములపై పడుచుండ, వృద్ధ వటవృక్షచ్ఛాయల గురుగౌతముని చుట్టు కూర్చుండిరి. విహంగ కాకలీకలరవములతో, మధుప గుంజన గీతికలతో, జలమంజుల తానములతో నమ్మిళితమై తరుణకంఠముల నుండి శాంతముగ వెడలు సామగీతముల ఆరోహణ అవరోహణములలో గంభీర మృదుస్వరములు వెలయుచుండినవి.

ఇంతలో, సత్యకాముడు దగ్గరకువచ్చి, ఋషిపదముల ప్రణమిల్లి, విశాల నయనముల విప్పి, నీరవముగ నిలువబడియెను. ఆచార్యులు ఆశీర్వాదముల గావించి "ప్రియదర్శనుడవగు సౌమ్యుడా, నీ గోత్రమెద్ది?"అని ప్రశ్నించెను.

శిరము ఎత్తి "భగవాన్, నా గోత్రమెద్దియో తెలియదు. తల్లిని అడిగితిని. ఆమె 'సత్యకామా, బహుజనుల పరిచర్యల కావించి, నిన్ను కంటిని. పెండ్లికాని జాబాలకడుపున పుట్టితివి. మన గోత్రము నాకు తెలియదు' అని చెప్పెను" అని బాలకుడు విన్నవించెను.

ఆ మాటల విని, తాపసబాలకులు తేనెతుట్టిపై రాతిబెడ్డ పడగా, విచ్చెత్తి ఇటునటు తిరుగులాడు తేనెటీగలమాడ్కి, మంత్రస్వరముల గునగుసలు ప్రారంభించిరి. కొందరు విస్మయమున నివ్వెరపోగా, కొందరు పరిహాసమున నవ్వసాగిరి. కొందరు సిగ్గులేని అనార్యుని అహంకారమును కాంచి దూషింప సాగిరి.

ఆసనమును వదలి, లేచివచ్చి గౌతమఋషి చేతుల చావి, బాలకుని ఆలింగనమొనర్చి 'నాయనా! నీవు అబ్రాహ్మణుడవు కావు, సత్యవచనముచే సత్యకుల సంజాతుడవు, ధర్మదృష్టియందు ద్విజోత్తముడవు' అని వచించెను.

ఫిబ్రవరి, 1895. 19-9-43.

(ఛాందోగ్యోపనిషత్ నుండి)

2

శ్రేష్ఠమగు భిక్ష

అనాథపిండదుడు బుద్ధుని ప్రధానశిష్యుడు.

"బుద్ధభగవానునికొరకై భిక్షను కోరుచున్నాను. పురవాసులారా, మేల్కొనుడు" అని అనాథపిండదుడు అంబుదనినాదమున అడుగుచుండెను.

అప్పుడే, శ్రావస్తిపురపు గగనచుంబిత ప్రాసాదములపై తరుణ అరుణుడు ఎర్రవెలుగుల లేనవ్వుకన్నుల విప్పుచుండెను.

వైతాళికులు పరుండి నిద్రించుచుండిరి. ఇంకను మంగళప్రభాతగానముల ఆరంభించలేదు. సంకోచమున కోకిలలు తియ్యని కూతల కూయసాగెను.

"నిద్రించు పురవాసులారా, నిద్రను దూరమొనర్పుడు ; నాకు భిక్ష నొసగుడు" అని భిక్షువు అరచి పలుకుచుండ, నిద్రించు పురజనులు ఆ మాటల విని ఉలికిపడి లేచుచుండిరి.

"వినుడు, మేఘములు తమ్ము నాశనమొనర్చుకొని వర్షధారల నొసగు చున్నవి. ఇలలో, సర్వధర్మములలోను త్యాగధర్మమే శ్రేష్ఠము" అని సాధువు పలుకుచుండెను.

దూర కైలాసశిఖరమునుండి తేలుచు వచ్చు భైరవుని మహాసంగీతమువలె, అతని వాణియు సుఖనిద్రారతములగు భవనముల మారుమ్రోగుచుండెను.

రాజు మేల్కొని రాజ్యము ధనము వృథాయని తలచుచున్నాడు. గృహస్థులు క్షుద్రమగు ఆయోజనములన్నియు మిథ్యలని ఎన్నుచున్నారు. బాలికలు అకారణమున కన్నీరు రాల్చుచున్నారు.

లలితసుఖముల అధీరులగు విలాసులకు, గతరాత్రి మైమరపించుచుండిన మనోహరి మాలికలు వాడి, నలిగి రాలిపోవుచుండుట మనస్సునకు తట్టుచున్నది.

గృహగృహమున వాతాయనములు తెరువబడుచుండెను. చీకట్లు పలచ బడుచుండిన బాటల. నిద్రతెలిసిన కన్నులు, వరుసగ విచ్చి, కుతూహలమున కాంచుచుండెను.

"మేల్కొనుడు, భిక్షనొసగుడు" అని అందరిని హెచ్చరించుచు, నిద్రఎరుగని తన నయనముల సుప్తసౌధములవైపు ఎత్తిచూచుచు, శూన్యమగు రాజమార్గమున ఒంటరిగ భిక్షువు వెడలుచుండెను.

శ్రీమంతులగు వర్తకశ్రేష్ఠుల యోషామణులు పిడికెళ్లతో రత్నముల మార్గమున వెదజల్లిరి. కొందరు కంఠహారముల, కొందరు శిరోభూషల దత్తముచేసిరి.

ధనవంతులు పళ్లెరముల నింపి బంగారమును కొనితెచ్చిరి. కాని సాధువు కన్నెత్తి చూడకనే, దూరదూరముగ వెడలిపోవుచు "మన ప్రభువునకై భిక్ష నిడుడు" అని కేకలిడుచునే ఉన్నాడు.

వసన భూషణములచే భూతలము క్రమ్మిపోయెను. కనకముతో రత్న ములు చెలిమితో ఆటలాడుచుండెను. ఉత్తసంచిని కైనిడి సన్యాని బిగ్గరగ ఘోషించెను.

"పురజనులారా! అవధరింపుడు, భిక్షుశ్రేష్ఠులు, బుద్ధభగవానులు, మీమీ సర్వశ్రేష్ఠ దానముల శ్రద్ధతో వారికి సమర్పింపుడు."

రాజు, వర్తకశ్రేష్ఠులు తోచనివారై మరలుచుండిరి. ప్రభువునకు తగిన బహూకరణము లభింపనందులకై విశాలనగరము సిగ్గునొంది, తలవంపులతో కలత చెందెను.

క్రమక్రమముగ సూర్యుడు ఎగప్రాకుచుండెను. ఊరంతయు మేల్కొని నివ్వెరపోవుచుండెను. మహానగరపు పథముల దాటి, పురప్రాంతపు కాననమున సాధువు ప్రవేశించెను.

తిండిలేని నగలులేని ఒక నిరుపేదరాలు పరుండిన నేలనుండి లేచివచ్చి, సాధువు చరణకమలములకడ ప్రణమిల్లెను.

అడవియందలి చెట్టుమ్రానుమరుగున ఎటులనో నిలిచి, తన ఒంటిపై నున్న చీరను విప్పి, చేతుల చావి త్రోవలో నేలపై విసరి సమర్పించుకొనెను.

ఊర్ధ్వభుజములతో జయజయనాదముల కావించుచు "ధన్యవు మాతా, ఆశీర్వాదముల గైకొనుము; మహాభిక్షుని పరమ అభిలాష ఒక్కక్షణమున పూర్తియాయెను" అని భిక్షువు వచించెను.

సన్యాసి ఆ జీర్ణవస్త్రమును శిరముపైనిడి బుద్ధభగవానుని చరణకాంతికడ సమర్పించుటకై వడివడిగ వెడలిపోయెను.

అక్టోబరు, 1897 20-9-1943.

[అవదాన శతకము నుండి]

3

మూల్య ప్రాప్తి

మార్గశిరపు చలిరాత్రులలో తీవ్రమైన మంచుదెబ్బలచే పద్మములు చెడి చచ్చినవి. తోటమాలి సుదాసుని తోటకొలనులో ఎటులనో ఒక పద్మము పూచెను. కోసి తీసుకొని అమ్ముటకై రాజమహల్ వైపు వెళ్ళి రాజదర్శనమునకై వేచియుండెను.

ఇంతలో పుష్పమును కాంచి ఆనందమున పులకాకులుడై ఒక బాటసారి 'అకాలమున వికసించిన నీ ఈ పద్మమును నేను కొని తీసికొందును. దీనికై ఎంత విలువ కోరెదవు ? బుద్ధభగవానులు నేడు పురమునకు వేంచేసియున్నారు. వారి పాదములకడ కానుకగ సమర్పించెద'నని వచించెను.

'పరకతులము బంగారమును పొంద డెందమున కోర్కె కలుగుచున్నది' అని మాలి చెప్ప బాటసారి ఒప్పి యియ్యకోరుచుండెను. ఇంతలో వైభవమున, బహుపూజార్హ్య ద్రవ్యముల ఎత్తించుకొని, నృపతి బయల్వెడలి అచ్చటికి రా తటస్థించెను.

రాజేంద్రప్రసేనజిత్తు మంగళగీతముల పాడుచు బుద్ధభగవానుని దర్శనార్థమై చనుచు ఆ అకాలప్రసూనమును తిలకించి 'ఎంత మూల్యము ? కొని ప్రభుచరణముల అర్పించెదను' అని అడిగెను.

'మహారాజా ! పరకతులము బంగారమునకు ఒప్పి ఈ అయ్యగారు కొన్నారు' అని మాలి విన్నవించెను. 'ఒక తులము నేనిచ్చెద'నని ఆ మహీపతి పలుకగా 'రెండు తులముల నేనొసగెద'నని బాటసారి అనెను. 'నాకొసగుము, నాకొసగుము' అని ఒకరిమీద ఒకరు పోటీగా నిలిచియుండ, ఎవరును ఓటమిని ఒప్పనేరక అతిశయించుచున్న ఉత్సాహముతో అభిలషించుచుండ, క్రమక్రమముగ వెల హెచ్చసాగెను.

ఎవరికొరకై వీరిద్దరును ఈ పద్మమువిషయమై వివాదము పడు చున్నారో, వారికే స్వయముగ నేనొసగిన మరెంత పొందెదనో అని ఊహించి, చేతులు జోడించి 'దయయుంచి క్షమింపుడు. ఈ పుష్పమును అమ్మ మనమాడకున్నది' అని చెప్పి, బుద్ధదేవుడు కాననమును ఉజ్జ్వలపరచుచు ఉపవనించియున్న ప్రదేశమునకు పరుగెత్తిపోయెను.

నిరంజన ఆనందమూర్తి ప్రసన్న ప్రశాంత మనమున పద్మాసనమున నిషణ్ణుడై యుండెను. అతని స్నిగ్ధ దృక్కులనుండి కాంతిపూరములు వెలువడు చుండెను. అధరములపై కరుణంపు అమృతము ఒలుకు లేనవ్వువెలుగులు నటించుచుండెను.

సుదాసుడు నిలిచి కండ్లార కాంచుచుండెను. నయన నిమేషముల మరచి నివ్వెరపోయి చూచుచుండెను. నోట మాట ఆడకున్నది. తటాలున భూతలమున ప్రణమిల్లి, ప్రభు పాదపద్మములకడ ఆ పద్మమును అణకువతో ఉంచెను.

అమృతరాసుల వర్షించు, మందస్మితము కావించి 'వత్సా! ఎద్ది నీప్రార్థన, చెప్పుము' అని బుద్ధభగవానులు ప్రశ్నింప, 'ప్రభూ! మరేమియు వలదు. తమ చరణరజములోని ఒక కణము' అని కనుకొనలు చెమ్మగిలుచుండ, వ్యాకుల సుదాసుడు విన్నవించుకొనెను.

సెప్టెంబరు, 1899. 20-9-43.

[అవదాన శతకము నుండి]

4

నగర లక్ష్మి

దుర్భిక్షచే శ్రావస్తిపురమున హాహారవములు చెలరేగుచున్న సమయమున, బుద్ధభగవానులు నిజభక్తగణముల చేర్చి 'ఆకలికొన్న నిరుపేదల అన్నదానసేవ మీలో ఎవరు గైకొని నిర్వహించెదరో చెప్పుడు' అని అందరిని అడిగిరి.

రత్నాకరశ్రేష్ఠి అది విని తలను వంచి మిన్నకుండెను. కడకు కరముల జోడించి 'ఈ విశాలపురము క్షుధార్తమై యున్నది. ఇంతమంది ఆకలిని తీర్చ గల సామర్థ్యము నాకడ లేదు, స్వామీ' అనెను.

సామంతుడు జయసేనుడు 'ప్రభువు ఒసగిన ఆదేశమును నా వక్షస్థలము చీల్చి, అందలి రక్తముతో నెరవేర్చు కార్యమేయ్యెయుండిన, శిరసా నిర్వహించెడి వాడను. నేడు నాయింట అన్నము ఎక్కడిది' అని పలికెను.

ధర్మపాలుడు నిట్టూర్పుల విడచుచు 'నా దురదృష్టపు నాసటివ్రాత, ఏమని చెప్పుదును - నా బంగారుపొలముల పండనియ్యక ఏవో పుట్టుకలేని దయ్యములు ఎండవేసినవి. ప్రభుత్వపు పన్నుల చెల్లించుటయే, మహాకఠిన సాధ్యమగు కార్యము. ఇంతటి సామర్థ్యములేని దీనుడను, హీనుడను' అని విన్నవించెను.

అందరును ఒకరి ముఖముల ఒకరు పరికించుచు, ఎవరును ఎట్టి ప్రత్యుత్తరమును ఇయ్యజాలక ఊరకుండిరి. ఆ సభాగృహము నిశ్శబ్దమైపోయెను. ఆకటిబాధచే కడకట పడుచున్న ఆ నగరిపై, బుద్ధభగవానుని కరుణనేత్ర యుగళము, సంధ్యా తారలమాడ్కి ప్రస్ఫుటించి, చూడ్కిల పరపెను.

అట్టితరి, మెల్లమెల్లగ లేచి, సిగ్గుచే కందవారిన ముఖమును వంచినదై, వేదనచే చెక్కిళ్లపై కన్నీరు దొరలుచుండ, అనాథపిండదుని సుత బుద్ధునికి

నమస్కరించి, చరణరేణువుల శిరముపైనిడి, గొంతు సవరించుకొని సవినయముగ పలికెను.

''భిక్షుకి అధమ సుప్రియ మీ ఆజ్ఞ వహింపగలదు. తిన తిండిలేక ఏడ్చువారు నాబిడ్డలు. ఈ నగరమున అన్నము పంచిపెట్టు భారమును నేడు నేను గైకొనుచున్నాను''. అనగా విని అందరును విస్మితులైరి.

'భిక్షుకుని కన్యవు. నీవును భిక్షుకివి, ఏ అహంకారపు మదము తలకెక్క, ఇంతటి గురుతర కఠిన కార్యభారమును శిరముపై ఎత్తికొంటివి? నేడు నీవద్ద ఉన్నదేదియో చెప్పుము' అని కోపమున అడిగిరి.

అందరికిని నమస్కరించి 'ఈ భిక్షాపాత్రము మాత్రము కలదు. నేను దీనురాలగు నారిని; శక్తిసామర్థ్యముల అందరికన్న తక్కువైనదానను. అందుననే మీ అందరి దయలకు పాత్రురాలనై ప్రభుని ఆజ్ఞను జయప్రదమొనర్చెదను."

'నా భాండారము మీమీ అందరి ఇండ్లలో నిండియున్నది. మీరందరు కోరిన, ఈపాత్ర అక్షయముగ ఒప్పగలదు. భిక్షాన్నముతో వసుధను ప్రతిక్రింపగలను. దుర్భిక్షపు క్షుధను తీర్చగలను' అని విన్నవించెను.

సెప్టెంబరు, 1899. 21-9-43.

[కల్పద్రుమావదానము నుండి]

5

పూజారిణి

నృపతి బింబిసారుడు బుద్ధునికి నమస్కరించి, అతని పాదనఖ కణమును కోరి గైకొనెను. తన ప్రశాంత కాననమున స్థాపించి, దానిపై శిల్పశోభాసారము ప్రతిఫలించునట్టి అత్యంత అపురూపమైన శిలాస్తూపమును అతియత్నమున నిర్మించెను.

సంధ్యావేళల శుభ్రవస్త్రముల ధరించి, మహారాణియు రాజకన్యలును, పూలపళ్లెరము పూలతో నింపుకొని వచ్చి స్తూపపదభాగమున స్వర్ణదీపస్తంభములపై అమర్చియున్న కనకపు దీపమాలల స్వయముగ వెలిగించి పోయెడి వారలు.

అజాతశత్రువు రాజై పితృసింహాసనముపై అధిష్ఠించినపిదప, పితృ ధర్మమును శోణితస్రోతముల ప్రవహింపజేసి రాజపురినుండి తుడిచివేసెను. బౌద్ధశాస్త్రరాసుల యజ్ఞానలమున భస్మమొనర్చెను.

అజాతశత్రువు రాజపురమునందలి స్త్రీలనందరిని పిలిపించి "వేదములు, బ్రాహ్మణులు, రాజు తప్ప పుడమిలో మరెవ్వరును పూజింప నర్హులు లేరు. ఈ కొద్దిమాటల మీరు డెందముల జాగరూకతతో ఉంచుకొనవలయును; లేకున్న ప్రమాదము సుమా" అని హెచ్చరించెను.

అది శరదృతువు కడపటి దివసము. శ్రీమతి అనెడి దాసి, పుణ్యశీతల సలిలముల స్నానమాచరించి, పుష్పముల ప్రదీపముల పళ్లెరమున గైకొని, వచ్చి రాజమహిషిచరణముల వైపు చూచుచు నీరవముగ నిలువబడియెను.

దేవేరి భయమున కంపించి "ఈమాట జ్ఞప్తిలేదా? 'స్తూపముకడ అర్ఘ్యముల సమర్పించువారిని శూలములపై చిత్రవధ కావించెదను; లేకున్న

యావజ్జీవ నిర్వాసనా దండమును విధించెదను'అని అజాతశత్రువు చాటింపించిన మాటలు మరచితివి కాబోలు" అని చెప్పి అనివెను

అచ్చటనుండి మరలి వధువు అమిత ప్రాసాదమునకై మెల్లగ వెడలెను. సమ్ముఖమున స్వర్ణముకురమును ఉంచి దీర్ఘచికురముల దువ్వి జడలల్లుచుండెను. పాపటపై మిక్కిలి జాగరూకతతో కుంకుమమును చక్కగ దిద్దుచుండెను.

శ్రీమతిని కాంచగానే, ఆమె చేతులు గజగజవణకి, దిద్దుచుండిన రేఖ వంకరపోయెను. 'మూర్ఖురాలా : ఎట్టి సాహసముతో ఈ పూజాద్రవ్యముల కొనితెచ్చితివి. ఎవరు ఎక్కడ చూచినను, విషమ విపద ఘటిల్లగలదు, తోడనే వెడలిపొమ్ము' అను బెదరుమాటల పలికెను.

అస్తాద్రిని అలంకరించుచున్న రవిరశ్మి కాంతియందు, తెరచిన వాతాయనముప్రక్క, కూర్చుని ఒంటరిగ కుమారి శుక్లాదేవి కావ్యగాథల పఠించుటలో నిరతయై ఉండెను. అందియల చప్పుడుల విని, ఉలికిపడి, ద్వారమువైపు పరికించెను.

శ్రీమతిని కాంచి, కావ్యమును భూమిపైనిడి, వడివడిగ లేచి దగ్గరకు వెళ్ళి, మిక్కుటమగు మెలకువతో 'రాజు ఆనతి నేడు ఎవరికి తెలియకున్నది? ఇటుల చావునోట చొచ్చుటకై పరుగిడుట లగ్గగు పని కాదు' అని ఆమెచెవిలో గుసగుసలతో మందలించెను.

అర్ఘ్యపు పళ్ళెరమును చేనిడి, ద్వారద్వారమునకు శ్రీమతి వెడలెను. 'పురవాసినులారా, ప్రభుపూజా సమయమాయెను' ఆని ఇంటింట ముత్తైదువుల, కన్యల పిలిచెను. ఈ మాటల విని ఇండ్లలో కొందరు భయపడిరి; మరికొందరు తిట్టి పంపించిరి.

నగర సౌధములపై దివసపు కడపటి వెలుగు మాయమాయెను. చీకట్లు దట్టములై క్రమ్ముచుండ, నగరపు కోలాహలములు సన్నగిలుచుండ, రాచ బాటలు నిర్మానుష్యమగుచుండ, ప్రాచీనమగు రాజదేవాలయమున హారతి ఘంటలు మ్రోగసాగెను.

నిర్మలమగు శారదనిశీథపు తిమిరమున అసంఖ్యాకములగు నక్షత్ర ములు ప్రకాశించుచుండెను. సింహద్వారముల బాకాల నూదిరి. వందిమాగధులు సంధ్యాగీతముల పఠింపసాగిరి. 'కొలువుకూటమి ముగిసెను' అని ద్వార పాలకులు కేకలిడుచుండిరి.

ఇంతలో, రాజు విజన కాననమున, స్తూపపద ప్రాంతమున చిమ్మచీకట్లను గిలిగింతలు పెట్టుచు, బారులు తీరిచి ప్రదీపమాలలు వెలుగుచుండుట మహల్ కాపరులు కాంచి చకితులై పోయిరి.

ముక్తకృపాణములతో పురరక్షకులు వెంటనే పరుగిడిపోయి 'ఎవరా దుర్మతి, మరణ సంసిద్ధయై ఆరతి నొసగుచున్నది' అని అడుగ 'బుద్ధదేవుని దాసిని, శ్రీమతిని' అను పలుకులు మధురకంఠమున వెలువడ వినిరి.

ఆనాడు శుభ్ర పాషాణ ఫలకములపై రక్తముచింది తెలియరాని అక్షర ముల లిఖించెను. ఆనాడు శారద శుభ్ర నిశీథమున, ప్రాసాద కాననమున, స్తూపపద ప్రాంతమున ప్రశాంత ఏకాంతతయందు, నిమేషకాలమున తుది ఆరతి శిఖలు ఆరిపోయినవి.

అక్టోబరు, 1899 22-9-43.

[అవదాన శతకము నుండి]

6

అభిసారము

సన్యాసి ఉపగుప్త ఒకతూరి మధురాపురి ప్రాకారతలమున నిద్రించు చుండెను. నగర దీపములు గాలిచే ఆరిపోవుచుండినవి పురభవనముల ద్వార ములు మూయబడియుండెను. శ్రావణ గగనమున నిశీథతారలు ఘనమేఘము లచే ముసుగుపడి యుండినవి.

హఠాత్తుగ కడియాల గజ్జెలచే ప్రోగుచుండిన ఎవరి పాదములో అతని వక్షమునకు తగిలినవి. సన్యాసిశ్రేష్ఠుడు ఉలికిపడి లేచెను. ఒక్క క్షణమున అతని స్వప్నజడిమ దూరమాయెను. దీపపు మొరటి వెలుతురు క్షమించు సుందర నయనములపెపడి కొటినటాయెను.

యౌవన మదమున మత్తత చెందిన నగరనటి అభిసారమున వెడలు చుండెను. ఒడలిపై నీలవర్ణపు చీర, గలగల ధ్వనించు ఆభరణములు అలంకరింపబడి యుండినవి. సన్యాసిదేహముపై చరణములు పడగనే వాసవ దత్త ఆగిపోయెను.

దీపమును పట్టి అతని నిగనిగలాడు గౌరకాంతిని కాంచెను. సౌమ్య స్మిత తరుణవదనము, కరుణా కిరణములతో వెలయు వికసిత నయనములు చంద్రతుల్యములై, విశాల లలాటమున స్నిగ్ధకాంతుల వెదజిమ్ముచుండెను.

నయనముల లజ్జ క్రమ్ముచుండ, లలిత కంఠముతో 'సన్యాసి కిశోరా, నన్ను క్షమింపుము. అనుగ్రహించి నా గృహమునకు రమ్ము. ఈ ధరణీ తలము అత్యంతము కఠినము, కఠోరమును అయియున్నది. నీవు పరుండు టకు తగని ప్రదేశము' అని విన్నవించుకొనెను.

'లావణ్యరాశీ, ఇంకను నా సమయము ఆసన్నము కాలేదు. తరుణీ, నీవు వెడలుచుండిన ప్రదేశమునకే వెడలుము. సమయమైన దినము నేనే

నీ గృహమునకు వచ్చెదను' అని కరుణ ఒలుకు వచనములతో సన్యాని పలికెను.

♦ ♦ ♦

హఠాత్తుగ విద్యుత్ శిఖల వెదజిమ్ముచు ఝంఝ తన విపుల వదన గహ్వారమును తెరచెనా యనునట్లుండెను. మారుతములలో ప్రళయ శంఖములు ప్రేగుచుండినవి. ఆకసమున విడుగులు ఘోర పరిహాసమున అట్టహాసముల చేయుచుండ రమణి భయమున కంపించిపోయెను.

వర్షము అప్పటికిని సమాప్తము కాలేదు. అది చైత్ర సంధ్యాకాలము. దక్షిణ సమీరములు ఆకులములై ఇటనట వీచుచుండినవి. పథతరు శాఖలు ముకుళముల తాల్చినవి; రాజ ఉద్యానవనముల వకుళ కింశుక రజనీ గంధ ములు వికసించి అందచందములతో అలరారుచుండినవి.

దూరమునుండి మురళీరవములు మంద్రస్థాయిలో ఉత్సాహపు పొంగును పుట్టించుచు వచ్చుచుండెను. పురము జనరహితము. మధువనమున జరుగుచున్న పుష్ప ఉత్సవమునకై పురవాసులందరును వెడలిరి. శూన్యనగరిని తిలకించి నీరవముగ పూర్ణచంద్రుడు నవ్వుచుండెను.

నిర్జన పథమున, చల్లని వెన్నెలలో సన్యాని ఒంటరిగా చనుచుండెను. తలపై, వరుసగా నిలచియున్న వృక్షముల నుండి కోకిల మాటి మాటికి కూయ చుండెను. ఇన్ని దినముల పిదప నేడు అతని అభిసారరాత్రి ఏతెంచె నాయని తోచుచుండెను.

నగరమును వదలి ఆ దండధారి, బయటి ప్రహరీగోడవైపుకు చని, కందకపు అంచుకు వచ్చి నిలిచెను. మామిడితోపు నీడల చీకట్లలో ఒకవైపున తన కాళ్లదగ్గర పడియున్న ఆ రమణి ఎవతెయై యుండవచ్చును.

భయంకర రోగము ఒడలంతయు చీముబొబ్బలతో సందులేక క్రమ్మి యుండెను. రోగముచే దేహము కాటుక పూసినట్లు నల్లబడిపోయెను. ఆమె స్పర్శే విషతుల్యమని ఊరివారు తీసుకవెళ్లి నగరపు కందకముప్రక్క పారవేసిరి.

సన్యాసి కూర్చుని, మొద్దుబారిన తలను తన తొడపై ఎత్తి ఉంచుకొనెను. ఎండి వాడువారిన పెదవులపై నీటి చుక్కల చల్లెను. మంత్రించి భస్మమును శిరముపై రాచెను. నిజకరములతో శీతల చందన పంకమును ఒడలంతయు అలమెను.

మామిడిపూత రాలి పడుచుండెను. కోకిల కూనిరాగముల తీయుచునే ఉండెను. యామిని జ్యోత్స్నామత్తయై యుండెను. 'దయామయా, ఎవరు మీరు దయయుంచి వచ్చితిరి?' అని రమణి గద్గద స్వరముతో అడుగ 'నేటి రాత్రి సమయ మేతెంచెను. వాసవదత్తా, వచ్చితిని, ఉపగుప్తను' అని సన్యాసి ప్రత్యుత్తరమిచ్చెను.

అక్టోబరు, 1899 22-9-43.

[బోధిసత్త్వావదాన కల్పలత నుండి]

7 17

మస్తకవిక్రయము

కోసల నృపతి తులలేని సద్గుణ గరిష్ఠుడు. అతని యశోగాథలు జగత్ప్రసిద్ధములు. బీదలకు అతను సదా శరణాశ్రయుడు, దీనులకు అతను తల్లియు తండ్రి అను మాటల కాశీరాజు విని ఈర్ష్యా భరితుడై మండిపోవు చుండెను. 'నా ప్రజలు నాకన్న అతనినే ఎక్కువ ఆదరములతో చూచు చున్నారా ? సిరి సంపదలలో నా కన్న తక్కువవాడై, దానములలో ఎక్కువ వాడగుచున్నాడా ? ధర్మము దయామయ కార్యము సర్వము మిథ్యలై, నామీద ద్వేషభావముతో డాంబిక వర్తనమున కావింపబడుచున్నవి'అని ఎంచెను.

'సేనాపతీ, కృపాణము చేబూనుము, సకల సైన్యముల ఆయత్త పరచుము. నాకన్న అధికమగు పుణ్యవంతుడు కావలెననెడి స్పర్ధ అతనిని ఆవహించియున్నది' అని ఆనతిచ్చెను. యుద్ధ పరికరములతో కాశీరాజు దండెత్తి చనెను. కోసలరాజు రణమున పరాభూతుడై, రాజ్యమును వదలి. లజ్జచే పీడితుడై దూరవనములకు పారిపోయెను. తన సభాసదుల మధ్య కాశీ రాజు కూర్చుండి, సంతసమున నవ్వుచు 'ధనమును సంరక్షింప సామర్థ్యము కలవారే, దాతలగుట తగును ; అన్యులకు అది కూడనిపని' అని తన కడుపు మంటను ఆర్పుకొనెను.

అందరును హాహాకారముల కావించుచు క్రూర రాహువు ఇట్టి శీతల మయూఖుని కూడ గ్రసించుటయా ? లక్ష్మి బలవంతుల బాహువులనే అన్వే షించును; ధర్మము వైపు క్రీగంటనైన కాంచద'ని విలపించుచుండిరి. 'మనము తండ్రిని కోల్పోయిన వారమైతిమి' అని దశదిక్కులు పలుకుచుండి నట్లుండెను. 'పుడమిలో అందరికి ఇష్టుడై, నేస్తునివలెనున్న వాని శత్రువులపై ధిక్కారము' అని ఆక్రోశము ప్రకటించుచుండిరి.

విని కాశీరాజు కనలి 'నగరమున ఏల ఇంత శోకము? నేను ఉండ గనే, ఎవరి కొరకు ఈ ప్రజలు ఏడ్చిఏడ్చి చచ్చుచున్నారు? నా బాహు బలమున ఓడియు అతను నన్ను గెలుచుచున్నాడా? అరిశేషము ఎన్నడును కూడదని శాస్త్రములు ఘోషించుచున్నవి. మంత్రీ, కోసలరాజును పట్టి తెచ్చు వారికి శత స్వర్ణదీనారముల నొసగెదమని నగరమున చాటింపుము; నల్లడల ప్రకటింపుము' అని ఉత్తరువు చేసెను. రాజదూతలు దారిడొంకల క్రుమ్మరి, పగలనక రాత్రియనక చాటింపుల కావించిరి. విన్న వారందరును కండ్లు మూసికొని, చేతులతో చెవులు మూసికొని, వణకిపోవుచుండిరి.

రాజ్యమును పోగొట్టుకొన్న రాజు దీనవేషమున, మలిన వసనములతో గహన కాననముల తిరుగుచుండెను. ఒకతూరి అశ్రునీరములతో పథికుడొకడు వచ్చి "వనవాసీ, ఈ అరణ్యపు తుది ఎచ్చట? కోసల రాజ్యమునకు పోవు మార్గమెద్ది"అని అడిగెను. విని 'దౌర్భాగ్యపు దేశము, ఏ దుఃఖమున అచ్చటికి వెడలతలచితివి' అని రాజు అడుగ, పథికుడు 'నేను వైశ్యవంశజుడను, నా పదవలన్నియు మునిగిపోయెను. ఇప్పుడు కడప కడపకడ చేతులు చాచి, ఆసువుల నిలుపుకొనుట ఎట్లో తెలియరాకున్నది. కోసలపతి, కరుణా పారావారమని, వారి యశశ్చంద్రికలు ఎల్లదిశల పర్వుచున్నవని వింటిని. ఆ అనాథనాథుని, ఆ దీనశరణ్యుని వేడుకొన అతని ద్వారముకడకు దీనుడనై పోపుచున్నాను' అని జాలిగొలుపు చందమున చెప్పెను.

వినుచుండిన కోసలరాజు చిరునవ్వు నవ్వి కన్నీరును వారించుకొని, నిరవముగ క్షణకాలము చింతించి, చివరకు నిట్టూర్పు విడిచి 'పాంథా! నీ కోర్కెలు తీరు ప్రదేశమునకు, నేనే వచ్చి త్రోవచూపెదను. బహుదూరము నుండి బహు దుఃఖముల సహించి వచ్చితివి. నీ మనోరథము నెరవేరుగాక' అను ఓదార్పు మాటల వచించెను.

సభా మధ్యమున కాశీరాజు ఉపవిష్టుడై యుండెను. జటధారి వచ్చి ఎదుట నిలిచెను 'ఇచ్చటికి ఏ కార్యార్థమై వచ్చితిరి!' అని నవ్వుచు రాజు అడిగెను 'వనమున వసించుచుండిన కోసలరాజును నేను నన్నుపట్టి, తెచ్చిన,

ఇచ్చెదనన్న ధనమును, నాతో వచ్చిన ఇతనికి ఇమ్ము అని గంభీరముగ వన వాని పలికెను. సభాసదులందరును విస్మయమున చకితులై లేచిరి. సభా తలము నిస్తబ్ధమాయెను. కవచధారులగు ద్వారపాలకుల నయన కోణముల అశ్రుబిందువులు మెరసిపోయెను.

క్షణకాలము మౌనముగా ఉండి, కాశీరాజు నవ్వుచు "ఓహో, బందీ, మరణించియు నాపై విజయివికా పన్నుగడ పన్నితివా! ఆ నీ ఆశను వజ్రా యుధముచే తునిమెదను. నేటి రణమున నేనే విజయము పొందెదను. మహా రాజా, రాజ్యమును తిరిగి నీకు అర్పించెదను, దానితో నా హృదయమును దత్త మొనర్చెద" అని పలికి జీర్ణ వస్త్రధారియగు ఆ వనవాసిని సింహాసనముపై కూర్చుండ పెట్టి, మలిన శిరమును ముకుటముతో అలంకరించెను. పురజనులు ధన్యవాదముల కావించిరి.

నవంబరు, 1897 23-9-43

[మహావస్త్వవదానము నుండి]

8

ఋణ విముక్తి

'రాజకోశమునుండి చౌర్యము. చోరుని పట్టితెండు. లేకున్న నగరపాలులారా, మీరు బ్రతికి యుండరు. మొండెమునుండి తల ఎగిరిపోగలదు' అని చేయబడిన రాజశాసనమున కాపరులు బాటబాటన, ఇంట ఇంటా, దొంగకై వెదకుచుండిరి. పట్టణమునకు వెలుపల పాడువడిన ఆలయమున విదేశ వణిజుడు, పాంథుడు వజ్రసేనుడు, తక్షశిలావాని పరుండి ఉండెను. కాశీ పురమునకు అశ్వముల విక్రయించుటకు వచ్చి, దారిదోపిడివారి చేచిక్కి, ఉన్న ధనమంతయు పోగొట్టుకొని, హతాశుడై తన దేశమునకు తిరిగి వెడలుచుండెను. అతనిని దొంగ అని పట్టి, హస్తముల పాదముల లోహశృంఖలముల తగిలించి బందిశాలకు కొనిపోవుచుండిరి.

ఆ క్షణమున అతి సౌందర్యవతి శ్యామ గవాక్షమున కూర్చుండి తన అలసత్వపు కౌతుకమున పథప్రవాహమును కాంచుచు కాలము పుచ్చుచుండెను. కండ్ల ఎదుట లోకుల రాకపోకలు కలమాడ్కి తోచుచుండెను. "ఆహా, అయ్యో, అదేమి! మహేంద్రగిరిని తలదన్ను ధవళత, అందచందముల మిగుల రూపరి అగు వానిని కఠిన శృంఖలముల బంధించి చోరునివలె కొనిపోవుచున్నారు! చెలీ, వేగమున వెళ్లి, నగరపాలుర 'మిమ్ము శ్యామ పిలుచుచున్నది' అని నా పేరు చెప్పి పిలచిరమ్ము. 'బందిని వెంటగైకొని ఒకమారు దయయుంచి ఈ భవనమునకు రమ్మ'నుము" అని అనిపెను.

శ్యామ నామపు మంత్రబలమున నగరపాలురు ఉత్సాహితులై, ఎదురు చూడని ఆహ్వానమును పొంది రోమాంచితులైరి. లజ్జచే నతశిరుడై, కపోలముల రక్తిమ అతిశయించుచుండ బంది వజ్రసేనుడు వెనుక అనుసరించుచుండ, కాపరులు గృహమున సత్వరముగ ప్రవేశించిరి. హాసభరితులై, 'అత్యంత

అనమయమున ఈ దీనులపై ఈ అయాచిత అనుగ్రహమేల ? ప్రస్తుతము రాజ కార్యమున వెడలుచున్నాము, సుందరీ, అనుమతి ఇమ్ము' అని వారు చెప్పిరి. వజ్రసేనుడు శిరమెత్తి, 'ఇదెట్టిలీల, యువతీ, ఇది నీకు పాడియా ? ఏ కుతూహలమున దారిపోవు వారిని ఇంటవిలివించి, అవమానమున దుఃఖపడు నిర్దోష ప్రవాసిని మరింత అవమానపరచుచున్నావు?' అని తటాలున అడిగెను.

విని శ్యామ, 'ఆయ్యో, విదేశపాంథుడా, ఇది కుతూహలము కాదు. నా దేహముపై గల సమస్త స్వర్ణాలంకారముల సమర్పించి, వానికి మారు నీ శృంఖలముల నాదేహముపై వహింపగలను. నీ అవమానమున నా అంతరాత్మ నేడు అవమానముచే తపించుచున్నది.' అని దీనముగ వచించెను. ఆ పలుకులతోబాటు, తన తడిసిన కనురెప్పల జంటతో, ఆ విదేశీయుని అంగములనుండి సమస్త నిందాకళంకములను తుడిచి వేసెనా అనునట్లుండెను. 'నాకుగల వన్నియు గైకొని, ఈ నిర్దోషి బందిని విడిపింపుడు' అని కాపరుల వేడికొనెను. 'సుందరీ, నీ అనునయమును నేడు మేము తిరస్కరింపవలసి యున్నది. రాజకోశమునుండి దొంగతనము. ఎవరో ఒకరి తలనరికినకాని రాజు కోపపుమంటలు చల్లారవు. ఇది కానిపని' అని కాపరులు ప్రత్యుత్తర మొసగిరి. 'కేవలము, రెండురాత్రులు ఇతనిని సురక్షితముగ నుంచుడు, ఇదే నాప్రార్థన' అని కాపలావారి చేతులపట్టి ప్రతిమాలుకొనెను శ్యామ. 'అటులనే చేసెదము' అని కాపరులు చెప్పి వెడలిరి.

రెండుఝాములు దాటినవిదప, బందిశాలను తెరచి వెలుగుచున్న దీపమును చేనిడి, శ్యామ, లోహశృంఖలముల కట్టబడి, మృత్యుప్రభాతమును నిరీక్షించుచు, వజ్రసేనుడు మౌనముగ భగవన్నామ సంకీర్తనమును జపించు చుండిన గదిలోనికి ప్రవేశించెను. నెలత క్రీగంటిసైగచే కాపరివచ్చి శృంఖలముల ఒకక్షణములో విప్పి వేసెను. విస్మయపు విహ్వలత ముప్పరికొనుచున్న నయనములతో, శుభ్రసుకోమలము, అపురూపమైన ఆ వికసిత వదనారవిందను బంది తిలకించెను. 'భీషణ దుస్స్వప్నలయితమగు వికృతరజని చివరన శుక్రతార భుజముపై చేయినిడి అరుగుదెంచిన ఉషోదేవినమముగ లేచి, నా కారా

A C No.....

కళ్యమునకు, ముమూర్షుని ప్రాణరూపిణివిగ, ముక్తరూపిణివిగ, నిష్ఠూర నగరమున దయామయి లక్ష్మివలె ఏతెంచిన ఎవ్వతెవు నీవు' అని గద్గద స్వరమున వజ్రసేనుడు అడిగెను.

"నేనా దయామయిని" అని ఉచ్చహాసమున రమణిపలుక, భయంకర కారాగారము నవభయత్రాసములతో చకితమైపోయెను. ఉన్మత్తగర్వంపు హాస ముల నవ్వుచు నవ్వుచు, శోకాశ్రురాశిలో కూలబడిపోయెను. 'ఈ నగరపు మార్గములలోగల శిలలును శ్యామవలె కఠినములైనవి కావు' అని ఏడ్చుచు చెప్పి, దృఢబలమున అతని హస్తముల పట్టి, వజ్రసేనుని కారాగారము వెలుపలకు కొనిపోయెను.

వరుణాతీరమున పూర్వదిశపు వనాంతరాళమున ఉషస్సు అప్పుడప్పుడే మేల్కొనుచుండెను. రేవునందు పడవ కట్టబడియుండెను. నౌకపై నిలిచి "విదేశీయుడా! రమ్ము! రమ్ము! ప్రియుడా! సకలబంధనముల ఛేదించి ఏకస్రోతమున నేను నీతో తేలిపోకోరుచున్నాను' అను ఒక్కవిషయమును, హృదయేశ్వరా! జీవన మరణ ప్రభూ! స్మరణయందుంచుకొనుము" అని ఆ పడతి పిలుచుచు అనెను. నౌక కదలసాగెను. రెండుతీరముల వనవృక్ష ములపై శకుంతములు ఆనంద ఉత్సవ గానములు ఆలాపించుచుండినవి. ప్రేయసివదనమును రెండు చేతుల ఎత్తి, తన వక్షమునకు అదుముకొని "ప్రేయసీ! వచింపుము. ఎంత సంపదనొసగి, నన్ను విముక్తుని గావించితివి? ఈ దీన దరిద్రుడు నీకడ ఎంత ఋణమునకు ఋణి యాయెనో పూర్ణముగ తెలిసికొన కోరుచున్నాను. పరదేశపు ప్రాణప్రియా! వివరించి నాకు తెలుపుము"అని వజ్రసేనుడు అడుగ దృఢతరమగు ఆశ్లేషమొనర్చి 'ఆ సంగతి ఇప్పుడు కాదు' అనెను యువతి.

పూర్ణవాయు భరితమై ప్రవాహ వేగమున నౌక వడిగా పోవుచుండెను. మధ్యగగనమున ప్రచండ మార్తాండుడు విరాజిల్లుచుండెను. గ్రామవధువులు స్నానముల పూర్తిచేసికొని, సిక్త వస్త్రములతో కాంస్యఘటముల గంగా జలముల కొని గృహములకు మరలుచుండిరి. ప్రొద్దుటి సంత పూర్తికాగా, జనులు చెదరిపోయిరి. రెండు తీరముల కోలాహలములు సన్నగిల్లెను.

ఊరిదారుల డొంకల బాటసారుల రాకపోకలు లేవు. రాతిరేవునందు మర్రిచెట్టు నీడలో, స్నానాహారముల కొరకై పడవవాడు పడవను ఆపెను. దట్టంపు వటశాఖలలో, పక్షినీడములు నీడలతో నిండి చప్పుడులు లేక ఉండినవి ; తుమ్మెదలు మాత్రము పొడుగగు దినమంతయు సోమరితనమున గుంజనము చేయుచుండెను. పక్వసస్యముల గంధముల హరించి, మధ్యాహ్న వాయువులు వీచుచుండ, అకస్మాత్తుగ శ్యామ మేలిముసుగు సడలి జారిపోగా, నిండైన ప్రణయవేదన వ్యథితవ్యాకుల వక్షమున పొటమరించుచుండ, ఉల్లాసము కంఠమును అణచి అడ్డగించుచుండ 'క్షణికాలముల శృంఖలముల నుండి నన్ను విడిపించి, శాశ్వత శృంఖములలో బంధించితివి. ఈ దుస్సాధ్య మగు కార్యమును ఎటుల సాధించితివో తెలియపరచుము. నా కొరకై ఎంతటి ఉపకారము చేసితివో, తెలిసికొని, ప్రేయసీ, దానికి మారుగ ఈ జీవితముతో ఆ ఋణమును తీర్చుకొందునని శపథము పట్టితిని. చెప్పుము ?' అని వ్రజసేనుడు శ్యామ చెవిలో గుసగుసలతో అడిగెను. వస్త్రమును ముఖమువై లాగికొని 'ఆ సంగతి ఇప్పుడు కాదు' అనెను సుందరి.

బంగారు తెరచాపల ఎత్తి, సంధ్యాకాంతితరణి దూర అస్తాచల ఘట్టమునకు నీరవముగ చేరగా, మందపవనముల సాగుచుండిన శ్యామ నౌక తీర ఉపవనముకడ ఆగెను. శుక్లచవితినాటి చంద్రుడు అస్తమింప ఉద్యుక్తుడగుచుండెను - నిస్తరంగ శాంత జలములపై అతని క్షీణకాంతి దీర్ఘ రేఖలద్వారా మినుకు మినుకు మనుచుండెను. చెట్లమొదళ్ల క్రమ్మియుండిన మిడతల కీచురాళ్ల చప్పుడులచే చీకట్లు, మంద్రస్వరమున వీణా తంత్రులవలె, కంపించిపోవుచుండెను. దీపమును ఆర్పి, తరణి వాతాయనము కడ, దక్షిణ సమీరములతో ఘన నిశ్వాసముల మేళవించుచు యువకుని భుజస్కంధముపై తన శిరమును వాల్చి శ్యామ కూర్చునెను. ఆపె ఉన్ముక్త సుగంధ కేశరాశి, కోమల వీచికలతో కూడిన తిమిరస్రవంతుల అతిక్రమించి, నిబిడతంద్రాజాలముల రీతి, నిరాఘాటమున వ్రజసేనుని వక్షస్థలమున పడుచుండెను. 'ప్రియతముడా! నీ కొరకై నేనొనర్చిన పని చాల కఠినమైనది. దానికన్న ఆ విషయమును

నీతో చెప్పుట మరింత కఠినమైన పని. సంక్షేపముగ చెప్పెదను. ఒకతూరి విన్నతోడనే నీ మనస్సు నుండి ఆ సంగతిని తుడిచి వేయవలయును.

''యువకిశోరుడు, ఉత్తీయుడు అతని నామము. నన్ను వ్యర్థముగ ప్రేమించి ఉన్మత్తుడు అధీరుడగునుండెడివాడు. అతను నా అనునయమున నీ చౌర్య అపవాదమును తన స్కంధములపై ఎత్తికొని, తన ప్రాణముల నొసగెను. సర్వోత్తమా, నా ఈ జీవితమున నా సర్వాధిక పాపము నీకొరకై ఒనర్చితి ననుటయే నాకు గౌరవమగు విషయము'' అని అస్ఫుటకంఠమున శ్యామ చెప్పెను.

క్షీణచంద్రుడు అస్తమించెను. అరణ్య వృక్షములు మౌనముగ శత శత నిద్రిత విహంగముల శిరములపై వహించి కదలక మెదలక నిలిచి యుండినవి. రమణి నడుమునుండి ప్రియబాహు బంధనములు మెల్లమెల్లగ శిథిలములై జారిపోయినవి. కఠోర విచ్ఛేదము నిశ్శబ్దముగ ఇద్దరి మధ్య కూర్చుండినట్లుండెను. వాక్య రహితుడగు వజ్రసేనుడు చైతన్యము లేని పాషాణ మూర్తివలె చూచుచు నిలిచిపోయెను. ఆలింగనచ్యుతయై, భిన్నలత వోలె శ్యామ అతని పాదములకడ శిరమునుంచి నేలపై పడిపోయెను. కాటుకవలె నల్లనగు నదీనీరములలో, తీరపు తిమిరపుంజములు చేరి మరింత నల్లపరచుచుండినవి.

తటాలున యువకుని జానువుల బాహుపాశములతో బలమున బంధించి, కన్నీరు ఇంకిపోగా, ఎండిన కంఠముతో విలపించు నారి 'నాథా, క్షమించుము. ఈ పాపమునకు రాదగిన శిక్ష దారుణ తరములగు విధాత్రని హస్తముల నుండియే జారిపడనిమ్ము. నీ కొరకై చేయబడిన దానిని, నీవు క్షమించుము' అని మొరపెట్టుకొనసాగెను. చరణముల విదలించుకొని, ఆమెవైపు తేరి చూచుచు 'నా ఈ ప్రాణముతో నీకేమిపని? ఈ జన్మమంతయు, నీ పాప మూల్యముచే కొనబడిన మహాపాప భాగినైతిని ఈ జీవితమునే నీవు పరిహసించి, కలుషపరచితివి. కళంకినీ, ఛీ ఛీ, నా ప్రతి నిశ్వాసమును నీకడ ఋణి యాయెనే - ఛీ ఛీ, నా ప్రతి నిమేషపాతమును ప్రతి నిమిషమున నీకడ

ఋణియాయెనే' అని వజ్రసేనుడు బిగ్గరగ అరచి, చివుక్కున లేచి, నౌకను వదలి నిరుద్దేశముగ తీరమునకు, వనమునకు అంధకారములోనికి వెడలిపోయెను.

ఘనకుంజ గాధములు ముసురుకొనుచుండ, గాలియు రిచ్చవడి నిలిచియుండ, వనతలమున అతని పదభారమున శుష్కపత్రరాశి శబ్దించుచు అనుక్షణము అరణ్యమును చకితపరచుచుండెను. తరుకాండములు, నాలుగు వైపుల వంకరటింకరలగు నానా శాఖల ఎత్తి, అంధకారమున అసంఖ్యాకము లగు వికృత విరూప ఆకారముల వహించియుండెను. చీకట్లు నలువైపుల ముట్టడి వేసినటులుండెను. లతా శృంఖలిత వనము, నిస్తబ్ధ నిషేధమున వలె, కరముల ఎత్తి చాచుచుండెను. శ్రాంత దేహమున పథికుడు భూమిపై కూర్చుండెను. అతని వెనుక ఉపచ్ఛాయవలె నిలిచినది ఎవరు ? వెంట వెంట అడుగడుగున అతనిని అనుసరించుచు, రక్తసిక్త చరణములతో అనుచరియై దీర్ఘ పథమును కడచి వచ్చెను ఆమె. రెండు పిడికిళ్ళ బిగించి, 'ఇంకను నన్ను వదలవా ?' అని పథికుడు గర్జించెను.

రమణి విద్యుత్ వేగమున పరుగిడి, ప్రవాహతరంగములవలె అతనిని ఆవరించి, ఆలింగనములతో, విడిన కేశపాశములతో, కదలిపోవు వేష వసనములతో, ఆఘ్రాణముల, చుంబనముల, స్పర్శల, ఘననిశ్వాసములచే అతని సర్వాంగముల ఒక్కమ్మడిగ కప్పివేసెను. కంఠము గద్గదప్రాయమై యుండ, ఆర్ద్ర విలాపవచనములతో, 'వదలను, వదలను' అని పలుమారులు పలికి 'నాథా, నీ కొరకై కావింపబడిన పాపమునకై, నీవే నాకు శిక్ష నొసగుము, నా గుండెను పొడిచి వేయుము. నాకియ్యవలసిన శిక్షాబహూ కరణమును ఇచ్చివేయుము' అని విన్నవించెను. గ్రహతారా రహితమగు ఆ అరణ్యపు అంధకారము అంధభావమున ఏదో దుఃస్వప్నముచే పీడింపబడు చుండెనా అనునట్లుండెను. లక్షలకొలది చెట్లవేరులు భయముతో మట్టిలోనే వణకిపోయినట్లుండెను. గొంతు పిసుకుటచే అడ్డగింపబడిన నిట్టూర్పుల నడుమ, కడపటి అరుపుచప్పుడు ఒకతూరి వినబడెను. మరుక్షణమే స్పృహ తప్పి ఎవరది భూమిపై పడిపోయినది !

వజ్రసేనుడు, వనమునుండి మరలునప్పటికి, జాహ్నవీతీరమున, మందిర శిఖరత్రిశూలము ప్రథమ ఉషాకరములచే విద్యుత్ వర్ణమున తళ తళ మెరయుచుండెను. నదిగట్టుల ఇసుక తిన్నెలపై ఉదయమంతయు మైమరచిన పిచ్చివాని వలె క్రుమ్మరెను. మధ్యాహ్నపు మండుచున్న సూర్యుడు అతని సర్వాంగములపై నిప్పుల కొరడాలతో కొట్టుచున్నట్లాయెను. నడుముకడవల పల్లెటూరి పడుచులు అతని దశను కాంచి కరుణకంఠమున 'అయ్యో, ఇల్లు విడిచిన బాటసారీ, మా ఇంటికి రమ్ము, సేద తీర్చుకొనుము' అని పిలిచినను వినిపించుకొనకనే వెడలుచుండెను. దప్పికచే గుండె బ్రద్దలగుచుండెను కాని ఎదురుగనే పారుచుండిన ఏటినుండి ఒక్క నీటిచుక్కనైన తాకిన పాపమున పోలేదు.

దినశేషమున, జ్వరముచే కాగిపోవుచుండిన దేహముతో పడవవైపు వెడలి, అగ్నిని చూచి శలభము ఉగ్ర ఉత్సాహమున భరితమై, వేగముగ చనురీతి, అందు ప్రవేశించెను. శయ్యయందు ఒక నూపురము పడియుండుట కాంచెను. అనేక తూరులు దానిని వక్షమునకు అదుముకొనెను. దాని ఝుంకారములు శతముఖ మేఘమునుండివలె అతని హృదయముపై శబ్దబిందువుల వర్షింపసాగెను. ఒకవైపు ఆమె నీలిరంగు చీర పడియుండెను. దానిని ఉండచుట్టి, దానిపైన ముఖమును ఉంచి పరుండియుండెను. తృప్తినొందని ఆవేశముతో ఆ చీరను వ్యాపించియున్న ఆపె సుకుమారదేహ గంధమును తన ఊర్పులతో ఎగవీల్చి మాటిమాటికి మూర్కొనుచుండెను. శుక్లపంచమి శశి, అస్తాచలగామియై, సప్తవర్ణ తరుశిరముల దిగి, శాఖల మరుగున పడిపోవుచుండెను. రెండు బాహువుల ప్రసారించి 'ప్రేయసీ, రమ్ము రమ్ము' అని అరణ్యము వైపు చూచుచు వజ్రసేనుడు పిలుచుచుండెను. ఇంతలో గట్టు ఇసుక తిన్నెలనుండి, ఘనకృష్ణములగు వనతిమిరములలో ఉపచ్ఛాయాసమముగ ఎవరి మూర్తి కాన్పించెను :

'ప్రేయసీ, రమ్ము రమ్ము' 'ప్రాణేశ్వరా, వచ్చితిని. క్షమింపుము, నన్ను క్షమింపుము. నీకరుణా భరిత కరములలో నాకఠిన మగు ప్రాణము

పోలేదే' అని శ్యామ అతని చరణములపై పడెను. క్షణకాలము మాత్రము వజ్రసేనుడు ఆమె ముఖమువైపు కాంచి, ఆలింగనము కొరకై బాహువుల క్షణమున చాపి, తటాలున చేతుల లాగికొని, ఉలికిపడి లేచి, ఆమెను దూరముగ నెట్టివేసి 'ఏలవచ్చితివి, మరల ఏల వచ్చితివి?' అని గర్జించెను. వక్షమునుండి సూపురమును గైకొని, కడగ పారవైచెను. మండుచున్న అగ్ని కణములను వలె, నీలాంబరమును చరణములనుండి దూరముగ తన్నివేసెను. శయ్య అగ్నిశయ్యయై కాలిమడిమలనుండి అతనిని దహింప సాగినట్లాయెను. ముఖమును త్రిప్పి, కన్నుల మూసి 'తిరిగి వెడలి పొమ్ము, నన్ను వదలి వెడలి పొమ్ము' అని బిగ్గరగ పలికెను.

నతశిరమున నారి క్షణకాలము నీరవముగ నిలిచియుండెను. మరు క్షణమున భూతలమున జానువులవంచి, యువకుని చరణములకడ ప్రణమిల్లి, నదీతీరమునకు దిగిపోయి, అంధకారవన పథమున మెల్లగ వెడలి పోయెను. క్షణికపు అపూర్వ స్వప్నము నిద్రాభంగమున నిశితిమిరములలో కలిసి మాయమగుచందమున.

అక్టోబరు, 1899 26-9-43

9

సామాన్య నష్టము

మాఘమాసమున శీతల వాయువులు వీచుచుండెను, స్వచ్ఛ సలిల వరుణానది ప్రవహించుచుండెను. కాశీరాణి కరుణ, పురినుండి దూరపు నిర్జన గ్రామమునకు శిలాఘట్టముతో ఒనరిన చంపకవనమునకు వందలాది సఖీ జనములతో స్నానమునకై వెడలెను.

రాజశాసనమున ఆ మార్గము, ఆ రేవు ఆనాటి ప్రభాతమున జనరహిత మాయెను. దగ్గరనున్న కుటీరపు ప్రజలును వదలి మరెచ్చటికో చనిరి. అందుచే నదీపారము స్తబ్ధము గంభీరముగ అలరారుచుండెను. పక్షుల కూజితములు మాత్రము కాననమున చెలరేగుచుండెను.

నేడు మత్తిల్లి సంచరించు ఉత్తరవాయువులచే నదియు కదలిపోవు చుండెను. స్వర్ణకాంతి జలముల పడుచుండ, పులకమున పొంగి అలలు ఎగురుచు దుముకుచుండ, లక్ష మాణిక్యములతో తళతళలాడు కొంగుతో, నర్తకి నృత్య మొనర్చు వెడలుచుండినట్లుండెను.

నేడు నారీకంఠపు కాకలీధ్వనులు నదీ కలకల్లోలముల సిగ్గుపరచు చుండెను. మృణాలభుజలగు ఆ స్త్రీల లలిత విలాసములచే చంచలమగు నది ఉల్లాసమున మత్తిల్లి పోవుచుండెను. ఆలాప ప్రలాపములచే పొంగుచున్న నవ్వుల అలలచే ఆకసము ఆకులమై పోవుచుండెను.

స్నానము పూర్తిచేసి, రమణులందరును ఒడ్డునకు లేచి రాగా 'ఉహూ, చలిచే చచ్చుచున్నాను, నా ఒడలంతయు వణకిపోవుచున్నది. సఖులారా, నిప్పును మంట వేయుడు, చలికాచు కొనెదము' అని రాణి ఆనతిచ్చెను.

చెలియలందరును చిదుగుల ఏరి తెచ్చుటకై కుసుమ కాననము వైపు చనిరి. పిచ్చి ఉల్లాసమున, కౌతుక రసము చిందుచుండ, శాఖల పట్టి, ఈడ్చి,

ఇటునటు లాగుచు గంతులిడుచుండ, హఠాత్తుగ రాణి అందరిని పిలిచి నవ్వు చున్న ముఖముతో చెప్పెను.

'చెలియలారా, ఇటురండు రండు, అవిగో దగ్గరలో ఎవరివో గుడి సెలు కనబడుచున్నవి. వానికి మీరు నిప్పు అంటించిన చేతులు కాళ్లు కాచి కొనెదను 'అని రాణి తన యుక్తికి తనే విహ్వలయై మధురముగ కిలకిల నవ్వెను.

'ఇదేమి పరిహాసము, తల్లీ ? నిప్పు అంటించి వీనిని నాశనము చేయు టేల ? ఇవి ఏ సాధు సన్యాసుల కుటీరములో, ఏ దీనజనులు, ఏ పరదేశ వాసులు నిర్మించుకొన్నవో మనకు తెలియదు, రాణిగారు !' అని అతివినయ మున సకరుణముగ దాసి మాలతి అనెను.

'ఈ దీనదయామయిని దూరముగ గెంటివేయుడు' అని రోషమున పలికెను రాణి. అత్యంత దుర్దామమగు కౌతుకమున నిరతులును, యౌవన మదమున నిష్ఠురలును అగు ఆ యువతులందరును కలిసి పిచ్చివారివలె పరుగెత్తుకొని పోయి, ఆ కుటీరములకు నిప్పు అంటించిరి.

దట్టమగు భయంకరమగు పొగలు తిరుగుచు తిరుగుచు, ఉబుకుచు ఉబుకుచు లేచి పర్వెను. చూచుచు చూచుచుండగనే, ఉస్, ఉయ్ అను హుంకారములతో, ఎగయుచున్న మంటలతోకూడా విస్ఫులింగముల వెళ్ల గ్రక్కుచు, శతశతములగు లోలజిహ్వాలు ప్రసారించుచు, వహ్ని ఆకసమును పరచివేసెను.

పాతాళము బ్రద్దలై, జ్వాలామయములగు నాగినులన్నియు ఒక్కమ్మడిగ బయటపడెనా ! గర్జనగానమున మిన్నుల్లి గగనమువైపు ఫణముల నృత్య మొనర్చుచు లేచినవా ! ప్రళయమత్తత కొన్న రమణీకర్ణముల ఉద్దీపకరాగిణులు ధ్వనితమాయెను.

ప్రభాతశకుంతముల ఆనందగానములు భయవిలాపములతో మాయ మాయెను. దళదళములుగ కాకములు చేరి కూయుచు సవ్వడి చేయసాగెను.

ఉత్తరవాయువులు ప్రబలమగుచుండ కుటీరమునకు అగ్నిజ్వాలలు ఎగిరెగిరి పరుగిడుచుండెను.

ప్రళయప్రలోభ రసనలు క్షుద్రగ్రామమును లేహన మొనర్చివేసెను. మాఘమాసప్రభాతమున, జనశూన్యపథమున, ప్రమోదక్లాంతులగు శతసఖుల తోడి, దీప్త అరుణవసనముధరించి, కువలయమును చేపూని రాణి మరలివెడలెను.

అప్పుడు సభయందు న్యాయాసనమున భూపతి కూర్చుండియుండెను. గృహముల పోగొట్టుకొన్న ప్రజలు గుంపులు గుంపులుగ వచ్చి, చరణముల ప్రణమిల్లినవారై, సందేహమున కంపితమగు గద్గదస్వరములతో సంకోచమున, త్రాసమున తమ దుఃఖముల నివేదించిరి.

లజ్జచే ఎర్రపడిన ముఖముతో రాజు న్యాయాసమును వీడి వెడలెను. అకాలమున రాణీవాసముప్రవేశించి 'మహిషీ, ఇదెట్టి వ్యవహారము? నిరుపేదలగు ప్రజల గృహములు కాల్పించివేసితివే; ఇది ఏ రాజధర్మము' అని అడిగెను.

'ఏ అర్థమున అవి గృహములాయెనో చెప్పుడు. కొలది జీర్ణకుటీరములు పోవుటచే, ఆ ప్రజలకు ఎంత నష్టము వాటిల్లగలదు? రాజమహిషి ప్రమోదము నకై ఒకరూమువో ఎంతెంత ధనము వ్యయమగుటలేదు' అని రోషమున దేవేరి పలికెను.

'నీవు రాణివిగ అంతఃపురమున ఉన్నంతకాలము, దీన కుటీర వినాశముచే దీనులకు ఎంత నష్టమో, నీవు తెలిసికొనజాలవని నాకు తెలియును; కాన దానిని నీకు నిర్దయతో తెలుపగలను' అని మండుచున్న డెందమున పొంగుచున్న రోషమును అణచికొని రాజు చెప్పెను.

రాజు ఆదేశమున సేవికలు వచ్చి ఆమెభూషణముల వలిచివేసిరి. అరుణవర్ణ అంబరమును మమతలేని హస్తములతో పెరికివైచిరి. భిక్షుకనారికి తగిన వస్త్రమును తెచ్చి రాణిదేహమున కట్టబెట్టిరి.

వీథిలోనికి ఆమెను తీసుకవెళ్ళి, రాజు 'ద్వార ద్వారమునకు వెళ్ళి, అడుక్కొని జీవింపుము. నీవు నీ రూములీలకై ధ్వంసమొనర్చిన ఆ కొలది

కుటీరముల, తిరిగి ఎన్నిదినములలో కట్టించి ఇచ్చెదవో చూచెదనుగాక' అని పంపివేసెను.

'ఒక ఏడు గడువు ఓసగుచున్నాను. అటుపై తిరిగివచ్చి. సభా మధ్యమున నిలిచి ప్రణమిల్లి, జీర్ణకుటీరముల వినాశముచే జగత్తున ఎంతనష్టము వాటిల్లెనో అందరి సమ్ముఖమున, యువతీ, తెలుపుదువుగాత'అని చెప్పెను.

అక్టోబరు, 1899 27-9-43

[దివ్యావదానమాల నుండి]

10

అవమాన వరము

భక్తకబీరు సిద్ధపురుషుడు అను ఖ్యాతి దేశమంతటను వ్యాపించెను. లక్షలకొలది నరనారులు వచ్చి, వాని కుటీరముచుట్టు చేరి మూగుచుండిరి. కొందరు కొందరు 'మారోగముల దూరమొనర్పు మంత్రముల పఠింపుము' అనెడి వారలు. వంధ్యావనితలు కొందరు ఏతెంచి సంతానముకొరకై రోదన కావించెడి వారలు. 'నీ దైవశక్తి మా కండ్లార చూపింపుము' అని కొందరు అడుగ, 'విశ్వమున భగవానుడు కలడనుటకు ప్రమాణములచూవి, మాకు బోధ పరుపుము' అని మరికొందరు అడిగెడివారలు.

కాతరమున విలపించుచు, భగవానునికి రెండుచేతుల నమస్కరించి 'హరీ! నీచ యవనుని గృహమున దయయుంచి జన్మనొసగితివి. నీ అపార కృపచే ఎవరును సమీపమునకు రారని తలచితిని. అందరి కండ్లమరుగున, కేవలము నీవును నేనును ఉండగలమని ఊహించితిని. మాయావీ! ఇదెట్టి కౌశల లీల నీది? నన్ను ఏమార్చుచున్నావు. ప్రపంచపు ప్రజల నా ఇంటికి పిలుచుకొని వచ్చి నీవుమాత్రము పరుగెత్తికొని పోవుచున్నావా?' అని కబీరు వేడుకొన సాగెను.

'తురక నేతగాని చరణధూళిని పొందిన ప్రజలను పట్టరాకున్నది' అని నగరమునగల బ్రాహ్మణులందరును తీవ్రమగు కోపమున మండుచుండిరి. 'పాపభారముతో నిండి నాలుగు కాళ్లతో కలికాలము వచ్చుచున్నది. దీనికి ప్రతీకారము చేయకున్న పుడమికి పుట్టగతులు ఉండనేర'వని నిశ్చయించిరి.

బ్రాహ్మణమండలి, ఒక భ్రష్టనారితో సంప్రదించి ఒక యుక్తిని పన్నిరి. స్వర్ణముద్రల చేతికిచ్చి, రహస్యముగ కుతంత్రముల నేర్పిరి. ఒకమారు వస్త్రముల అమ్ముటకై, సంతసమయమునకు కబీరు రాగా, హఠాత్తుగ ఆ కామిని

అందరి ఎదుట ఏడ్చుచు, అతని చేతినిపట్టి 'ఒరే మోసగాడా ! కపటుడా, క్రూరుడా ! నేను ఎవరికిని చెప్పలేదని, ఇటుల అమాయకమగు నారినగు నన్ను మోసగించెదవా ? ఎట్టి తప్పిదము నెరుగని దానను, నన్ను వదలిపెట్టి, మంచి సాధువేషమునే తాల్చితివి. తినకూడు, కట్టగుడ్డ లేక నా ఒడలంతయు నల్లబడి పోయెను' అని పెద్దగొంతుతో అరవసాగెను.

దగ్గర పొంచుకొని యుండిన బ్రాహ్మణబళము కపట కోపమును ప్రదర్శించుచు 'దొంగ సన్యాసీ! ధర్మము పేరుతో ధర్మమును చెడగొట్టెదవా? నీవు నిశ్చింతగ కూర్చుని, మంచివారి కండ్లలో దుమ్ము కొట్టెదవా ? తప్పు లేని గతిలేని ఈ రమణి అన్నశోకమున దారిదొంకల, అయ్యో, తిరుగుచు కాలము గడుపుచున్నదే' అని ఆమె పక్షమును గైకొనిరి. కబీరు 'నేను అపరాధిని, నారీ, నా ఇంటికి రమ్ము. నాకు అన్నము ఉండగా, నీవేల ఉపవాస ముండవలెను' అని పలికెను.

దుష్టయగు నారిని ఇంటికి విలుచుక వచ్చి, వినయ ఆదరముల కావించి 'దీనుని గృహమునకు హరియే నిన్ను పంపించెను' అని కబీరు పలుక, లజ్జా భయ పరితాపములు అతిశయించుచుండ 'లోభమునకు వశనై పాపము చేసితిని, సాధుశాపము నాకు తగులగలదు' అని ఏడ్చుచు యువతి చెప్పెను. 'తల్లీ, భయపడవలదు. నేను ఇది అపరాధముగా భావించుటలేదు. అవమానములు అపవాదములను శిరోభూషణముల నీవు నా కొరకై కొని తెచ్చితివి' అని కబీరు ఆపె మనోవికారముల రూపుమాపి, చైతన్యము నొసగి, ఆమె మధురకంఠమునకు హరినామ గుణగానమును నేర్పించెను.

'కపట కబీరు సన్యాసము సర్వఅబద్ధము' అని దేశమంతయు చాటింప బడుచుండ, కబీరు విని నతశిరమున 'నేను అందరికన్న నీచుడను. ఒడ్డునకు చేరగలిగితినేని, గర్వపు తరణిని ఉంచుటకు ఏ మాత్రమును నేను కోరుట లేదు. దయ ఉంచి నీవు నాపై ఉన్నయెడల, అందరికన్న అడుగునననే నేను ఉండగలను' అని హరిని సంబోధించెడివాడు.

సాధుని గాథను వినుటకై రాజచిత్తమున కౌతుకము ఒడమెను. దూతలు వచ్చి పిలిచినప్పుడు, సన్యాసి తల ఆడించి, 'అందరికన్న దూరముగ నా హైన్యతల మధ్య నివసించువాడను. నావంటి అభాగ్యుడు రాజసభకు తగడు' అని చెప్పెను. 'నీవు రాకున్న మాకు ప్రమాదము సంభవింపగలదు. నీ యశమును విని రాజునకు నిన్ను కాంచ కోర్కె-పుట్టెను.' అని దూతలు చెప్పిరి.

సభాపరిషదులతో కొలువు తీర్చి. సభలో రాజు కూర్చుని ఉండ నారిని వెంట నిడుకొని కబీరు అచ్చటికి వచ్చి లోన ప్రవేశించెను. కొందరు నవ్విరి; కొందరు ముఖము చిట్లించి కనుబొమల ముడిచిరి. కొందరు సిగ్గుచే తలవంచిరి. రాజు 'వీడెట్టి సిగ్గులేనివాడు; స్త్రీని వెంటనిడి తిరుగుచున్నాడు' అని తలచి సంజ్ఞ చేయగా, ద్వారపాలకులు సాధువును సభనుండి బయటికి గెంటివేసిరి. వినయముగ నారిని వెంటబెట్టుకొని కబీరు, తన కుటీరమునకు వెడలుచుండ, దారిలో బ్రాహ్మణదళము కుతూహలమున నవ్వసాగెను. కఠిన మగు భాషలో పరిహాస వాక్యముల పలికి పలికి వినిపింప తొడగెను.

అప్పుడు రమణి ఏడ్చుచు, సాధుచరణములకడ పడి 'పాపపంకము నుండి నన్ను ఎత్తి ఏల గైకొంటివి. ఏల అధమనారిని ఇంటనుంచుకొని అవ మానముల పాల్పడి సహించుచున్నావు' అని విలపింప 'జననీ, నీవేకదా నా ప్రభువుచే నొసగబడిన దానవు' అనెను కబీరు.

అక్టోబరు. 1899. 27-9-43.

[భక్తమాల నుండి]

11 వ కథ

భర్తను పొందుట

ఒకనాడు జాహ్నవీతీరమున నిర్జన శ్మశానమున తులసీదాసు నిజ గానముల పరవశుడై సంధ్యా సమయమున, మనమున ఏదో తలపోయుచు ఒంటరిగ తిరుగుచుండెను మరణించిన పతి చరణములకడ కూర్చుని, ఏక చితానలమున అతనితోడి మరణించుటకు సంసిద్ధయై యున్న ఒక సతిని కాంచెను. మధ్య మధ్య ఆమె స్నేహితురాండ్రు ఆనంద కోలాహలమున జయనాదముల కావించుచుండిరి. నాలుగు వైపుల చుట్టి బ్రాహ్మణ పురోహితులు సాధువాదముల పాడుచుండిరి.

హఠాత్తుగ, నారి సాధువును సమ్ముఖమున కాంచి ప్రణమిల్లి 'ప్రభూ! తమ శ్రీముఖముతో అనుమతి ఒసగుడు' అని వినయమున పలికెను. 'మాతా! ఎచ్చటికి పోవుటకై ఇన్ని ఏర్పాట్లు?' అని తులసీదాసు అడుగ, 'పతితోడి స్వర్గమునకు వెడలుటకు నిశ్చయించితిని' అని సతి చెప్పెను. 'నారీ, ధరణిని వదలి, స్వర్గమును ఏల కోరుచున్నావు, జననీ! స్వర్గము ఎవరిదో ధరణియు వారిది కాదా' అని చిరునవ్వు నవ్వి సాధువు అడిగెను.

నారి ఆ మాటలు తెలిసికొనజాలక, విస్మయమున నిరుత్తరయై ఊరక చూచుచు నిలుచుండెను. కడకు కరముల జోడించి 'భర్తను పొందగలిగిన, స్వర్గము ఏమైనను సరియే' అనెను. 'ఇంటికి మరలి వెడలుము. నేను చెప్పుచున్నాను. నేటినుండి ఒక మాసములోపల నీ స్వామిని నీవు తిరిగి పొందగలవు' అని నవ్వుచు తులసీదాసు పలికెను.

రమణి ఆశకు లోనై, శ్మశానమును వదలి, గృహమునకు తిరిగిచనెను. జాహ్నవీతీరమున నిస్తబ్ధ నిశియందు తులసీదాసు మేల్కొనియే యుండెను.

శుద్ధచిత్తముతో నిర్జన భవనమున నారి వసించుచుండెను. తులసీదాసు అనుదినమున ఆమెకు ఏ మంత్రము నొసంగుచుండెనో. ఆమె ఏకాగ్ర చిత్తముతో దానిని రాత్రింబవలు ధ్యానించుచుండెను.

మాసము పూర్తికాగానే, ఇరుగు పొరుగు అమ్మలక్కలు ద్వారముకడకు వచ్చి 'స్వామిని పొందగలిగితివా?' అని అడుగ 'అతనిని పొందగలిగితిని' అని నవ్వుచు నారి పలుక 'ఎచ్చట ఏ గదిలో ఉన్నారో చూపుము, చూపుము' అని వారు వ్యగ్రభావమున అడుగ 'నా అంతరమున ప్రభువు అహర్నిశము వసించు చున్నాడు' అని మారుచెప్పెను.

అక్టోబరు, 1899. 28-9-43.

[భక్తమాల నుండి]

12

స్పర్శమణి

బృందావనమున, నదీతీరమున సనాతనుడు ఏకమనమున హరినామమును జపించుచుండెను. ఇంతలో దీనవేషమున బ్రాహ్మణుడొకడు వచ్చి, చరణములకడ ప్రణమిల్లెను. 'ఎచ్చటనుండి తమ ఆగమనము ? తమ పేరేమి ? స్వామీ !' అని సనాతనుడు అడిగెను.

"ఏమి చెప్పుదు. బహుదూరము తిరిగి తిరిగి రాగా మీ దర్శనమును పొందగలిగితిని. నా నామము జీవనుడు ; నా వాసము వర్ధమాన జిల్లా మానకర గ్రామమున కలదు. నావలె ఇంత పెద్ద దురదృష్టములకు లోనైన దీన హీనుడు మరెచ్చట ఉండజాలడు. తొలుత ఆస్తిపాస్తి కొద్దో గొప్పో ఉండెను. ఇంతో అంతో దానినుండి ఆదాయము వచ్చుచుండెను. క్రియా కర్మ, యజ్ఞ యాగములచే అప్పుడు వేరుప్రతిష్ఠలతో బ్రతుకుచుంటిమి. నేడు ఏమియు లేదు. తల వంచి బ్రతుకుదల చూచుకొనవలసి యున్నది.

"నా ఉన్నతికొరకై, శివుని వరముల కోరుచు ఆరాధనల నిరతము కావించుచున్నాను. ఒక దినము వేకువన స్వప్నమున దేవుడు కాన్పించి 'కోరిక నెరవేరగలదు. యమునాతీరమునకు వెళ్ళి, సనాతన గోస్వామి పాద ద్వయమును పట్టుము. అతనే పిత, గురువని అంగీకరించుము. ధన ఉపాయము అతని హస్తములలో ఉన్నదని తెలిసికొనుము' అని చెప్పి తిరోహితుడాయెను" అని విప్రుడు వచించెను.

ఆ మాటల విని సనాతనుడు ఆకులుడై 'నావద్ద ఏమి యున్నది ? ఉన్నదంతయు వదలివేసి వచ్చితిని. భిక్షాపాత్రము మాత్రము కలదు.' అని భావించి, అంతలోనే మరపు దూరముకాగా 'అవును, అవును, నిజమే ; ఒక దినము నదీతటమున స్పర్శమణి ఒకటి నాకు దొరకినది. ఎప్పుడైనా, ఎవరి

కైనా ఇచ్చుటకు పనికి రాగలదని తలచి, అదో అచ్చట ఇసుకలో పూడ్చి పెట్టితిని. దానిని అంటిఅంటక మునుపే నీ దుఃఖములు దూరమగును. దానిని తీసుకపొమ్ము, స్వామీ' అని సాధువు బిగ్గరగ చెప్పెను.

విప్రుడు త్వరత్వరగా వెళ్ళి, ఇసుకను త్రవ్వి ఆ మణిని పొందెను. దానిని తాకగనే, చేతనుండిన ఇనుప మురుగులు రెండును బంగారమెపోయెను. ఆ బ్రాహ్మణుడు ఇసుకలపై చతికిలపడి, విస్మయమున తనలో తాను ఆలోచింపతొడగెను. యమున కల్లోలగానముల ద్వారా ఆ చింతితుని కర్ణముల ఏమేమి చెప్పుచున్నదో ! నదీపారమున, దినాంతపు క్లాంతరవి రక్తబింబము అస్తాచలమున క్రుంగిపోయెను.

అప్పుడు బ్రాహ్మణుడు లేచి, సాధుచరణముల పడి, అశ్రుజలములతో 'ఏ ధనమున ధనివై, ఓ మణీ, ఈ మణిని సరకు చేయకున్నావో, దానిలోని స్వల్ప అంశమును నతశిరమున నేను అభిలషించుచున్నాను' అని పలికి నదీతీరములలో మాణిక్యమును పారవై చెను.

అక్టోబరు, 1899. 28-9-43.

[భక్తమాల నుండి]

13

ప్రతినిధి

సాతారాదుర్గ శిఖరమున ఒకనాటి ప్రభాత కాలమున కూర్చుని శివాజి తన గురువు రామదాసు అన్నహీనుడై ద్వారద్వారమున భిక్షార్థియై తిరుగు చుండుట కాంచెను.

'ఇదేమి విపరీతము! ఎవరి ఇంట ఎట్టి దైన్యలేశమును లేదో, అన్నియు హస్తగత మొనర్చుకొన్న రాజేశ్వరుడే ఎవరి పదానతుడో, అట్టి గురుజీ భిక్షా భాండమును పట్టి తిరుగుటయా! అతనికిని కోర్కెల తుది లేదా!' అని తలచెను.

'ఇది కేవలము పగిలిన కుండలో రేయింబవలు నీళుపోయుటయే - దప్పిక తీర్చుటకై కానిప్రయత్నము మాత్రమే. ఎంత ఇచ్చిన ఒక్క తూరిగ ఈ భిక్షాపాత్రము నిండగలదో చూడవలసియున్నది' అని తోడనే పేనాను తెప్పించి, ఏదో వ్రాసి, శివాజి బాలాజీని పిలిపించి 'గురువు భిక్షా టనకై దుర్గప్రాంతమునకు వచ్చినప్పుడు, ఈ ఉత్తరమును అతని పాదముల చేర్పింపుము' అని చెప్పెను.

గురువు పాడుచు బయలు దేరెను. సమ్ముఖమున పెక్కురు పాంథులు, అనేక అశ్వరథములు ఇటునటు పరుగెత్తుచు పోవుచుండినవి. 'ఓ భవేశ, ఓ శంకర, అందరికిని గృహముల నొసగితివి, నాకు త్రోవ మాత్రము చూపితివి. అన్నపూర్ణ నా తల్లి, విశ్వభారమును, తను గైకొన, సమస్త చరాచరములును సుఖముగ నున్నవి. ఓ ఆదిభిక్షూ! నన్ను తల్లినుండి లాగివేసి, నీ అనుచరు డనుగ చేసివేసితివి.' అని పాడసాగెను.

పాటను పూర్తిచేసి, మధ్యాహ్న స్నానమును కావించి, దుర్గ ద్వారము నకు రాగా, బాలాజి అతనికి నమస్కరించి, పాదములకడ ఉత్తరమును ఉంచి,

ప్రక్కగ నిలువబడియెను. గురువు కౌతూహల భరితుడై, చేతగైకొని ఉత్తర మును చదువుకొనెను. 'పాదపద్మముల నమస్కరించి, శివాజి తన రాజ్యమును రాజధానిని నేడే అర్పించుచున్నాడు' అని వ్రాయబడియున్నది.

మరునాడు రామదాసు రాజువద్దకు వెళ్ళి 'పుత్రా! రాజ్యమును నాకిచ్చి వేసిన, ఏ పనిచేసి బ్రతికెదవు? గుణవాన్, నీకెట్టి శక్తి గలదో చెప్పుము? వినెదను'అని అడిగెను. 'నీ దాసత్వమున ప్రాణము ఆనందమున గడుపగలను.' అని అతనికి నమస్కరించి శివాజి పలికెను. 'అటులైన ఈ సంచిని భుజముపై ఎత్తికొనుము. నేడు భిక్షాటనకై పోదము రమ్ము' అని గురువు చెప్పెను.

శివాజి గురువుతోడి, భిక్షాపాత్రమును చేతనిడి, పురమున ద్వార ద్వారమునకు తిరుగ బయలుదేరెను. నృపతిని కాంచి, బాలురు బాలికలు భయమున ఇంటిలోనికి పరుగెత్తుకొని వెళ్ళి, తల్లితండ్రుల పిలుచుక వచ్చెడివారు. అతులైశ్వర్యముల తులతూగుచుండిన అతను భిక్షుకవ్రతమును వహించి తిరుగు చుండ చూచి జలముల శిలలు కూడా తేలగలవని తలచుచుండిరి. సిగ్గు బిడి యములతో భిక్ష నివ్వరాగా, గజగజ చేతులు వణకిపోయెడివి. 'ఇవి గొప్పవారి లీలలు' అని తలచుచుండిరి.

దుర్గమున రెండు ఝాముల గంట మ్రోగ, కార్యముల ముగించుకొని పురవాసులు విశ్రమించుచుండిరి. ఆనందమున నయనజలములు కారుచుండ, ఏకతారన గొంతుక విప్పి, రామదాసు పాడ ఆరంభించెను. "ఓ త్రిభువన పతీ! నీ భావముల మేము ఎరుగజాలము. నీకు ఎట్టిదియు కొరత లేదు. అయినను అందరి సర్వస్వ ధనమును కోరుచు, హృదయ హృదయమున భిక్షను అర్థించుచు తిరుగుచుందువు, ప్రభూ!"

కడకు, దివసాంతమున, నగరపు ఒక ప్రాంతమున నదీతీరమున సంధ్యాస్నానము పూర్తిచేసి, భిక్షాన్నమును సుఖముగ వంటచేసి, గురువు కొంత భుజింప, అతని శిష్యుడును కొంత ప్రసాదమును పొందెను. రాజు నవ్వుచు, 'నృపతి గర్వమును నాశన మొనర్చి, త్రోవయందలి భిక్షుకునిగ నొనర్చితివి. దాసుడు మీ అభిలాషల నన్నిటిని నిర్వహింప సంసిద్ధుడు. గురువువద్ద గురు దుఃఖముల శిక్షణ పొందుచున్నాడు' అని పలికెను.

'అటులైన వినుము కఠిన శపథమునే చేసితివి. దానికి అనుగుణమగు భారమునే వహింపవలసి యున్నది. ఇదో, చెప్పుచున్నాను. నా పేరున నా వాడవై రాజ్యమును తిరిగి గైకొనుము. విధి నిన్ను భిక్షుకుల ప్రతినిధిగ, రాజేశ్వరుడవయ్యు అల్పదీనుని సమానముగ చేసెను. ఏ రాజ్యధర్మముల నిర్వహించెదవో, అవి నా పనులనే ఎరుగుము. రాజ్యమును గైకొని రాజ్య రహితుడవుగనే ఉండుము' అని గురువు ఆనతిచ్చెను.

మరియు 'వత్సా, నా ఆశీర్వచనములతోపాటు, నా కాషాయ వస్త్రమును గైకొనుము. విరాగిఉత్తరీయమును పతాకము చేసి తీసికొనుము' అని గురు రామదాసు చెప్పనృపతిశిష్యుడు చింతారాశి లలాటమున దట్టమై, క్రమ్మకొను చుండ నతశిరమున నదీతీరమున కూర్చునియే ఉండెను. గొల్లవాని పిల్లనగ్రోవి ఆగిపోయెను. బయలునుండి ధేనువులు తిరిగిపోవుచుండెను. ఆవలిగట్టున సూర్యబింబము అస్తమించిపోయెను.

పూరబిరాగమున కంఠమెత్తి ఏకాగ్రచిత్తముతో రామదాసు పాడ ఆరంభించెను. ''నన్ను రాజవేషమున ప్రపంచమున కూర్చుండబెట్టి, ఎవరవు నీవు మరుగున నివసించున్నావు? రాజా! నీ పాదుకల సింహాసనమున ఉంచి, నేను పాదపీఠ తలమున కూర్చుని ఉన్నాను. అదో, సంధ్య యైవచ్చెను. మరి ఎంతకాలము ఇచ్చట ఆగి ఉండగలను? నీ రాజ్యమునకు నీవు వచ్చివేయుము."

1898. 29-9-43.

[ఆక్‌వర్తుదొర ప్రచురించిన మరాఠీ కథలనుండి]

14

రాజ విచారణ

'నా రమణి పరుండిన ఇంటిలోనికి రాత్రి ధర్మనాశనమునకై దొంగ ప్రవేశించెను. అతనిని కట్టి తెచ్చితిని. చెప్పుము, ఇప్పుడు అతనికి ఎట్టి శిక్ష నొసగమనెదవో' అని విప్రుడు అడిగెను.

'మృత్యువు' అని మాత్రము చెప్పెను, రత్నరావురాజా.

'ఆ చోరుడు యువరాజు. రాత్రి విప్రుడు అతనిని బంధించి ఉదయమునసే వధించెను. ఆ బ్రాహ్మణుని పట్టి తెచ్చితిమి. అతనికి ఎట్టిశిక్ష నొసగమనెదరు?' అని దూతలు పరుగెత్తుకవచ్చి అడిగిరి.

'వదలుడు' అని మాత్రము చెప్పెను రత్నరావురాజా.

వెల్లూరు.
29-9-43.

15

న్యాయాధిపతి

పూనా నగరమున, నృపతివంశ శిరోమణి అగు రఘునాథరావు పీష్వా సింహాసనమునుండి లేచి 'పృథ్వీభారమును హరించి తగ్గించెదను. మైసూరునవాబు హైదరాలి దర్పమును ధ్వంసమొనర్చెద' అని వీరులను ఉద్దేశించి పలికెను.

చూచుచు చూచుచుండగనే, సైనికుల వేలకొలది కరవాలములతో నిండి పత్తనమంతయు తళతళలాడుచుండెను. నానా దిక్కు-లనుండి దారిడొంకల నుండి, ఎడతెంపు లేని శ్రావణస్రోతమువలె మహారాష్ట్రిపు గిరిదరులనుండి వీరగణములు పరుగెత్తుక వచ్చిరి.

విజయ పతాకములు గగనమును శోభిల చేసెను. నూరకొలది శంఖములు మ్రోగెను. అంగనలందరును చేరి, ఉత్సాహ పూరిత మంగళ గానములు పాడుచుండిరి. ఉండి ఉండి ప్రళయరవమున భైరవధంక మోషించుచుండెను. గర్వోత్సాహమున మహారాష్ట్రిల రాజధాని కంపించి పోవుచుండెను.

ధ్వజారణ్యమున ఎగయుచున్న ధూళుల చాటున ప్రభాతభానుడు మరుగుపడిపోయెను. జయ కోలాహలముల ఆకసము బధిరమగుచుండెను. రఘునాథరావు ఎత్తరి గుత్తరము నెక్కి విజయోత్సవముల మధ్య విరాజిల్లు చుండెను. హఠాత్తుగ మంత్రబలమునవలె, రణతూర్యములు ఆగి మౌనమును తాల్చినవి.

ఎవరి చరణములకడ భూపతి తటాలున పరమ నమ్రతను ప్రకటించెను: సమరోన్మాదులై గంతులిడుచున్న సాయుధ పాణులగు వేల కొలది సైనికులు సింహద్వారమున ఒక్క నిమిసములో ఒక్కుమ్మడిగ ఎవరి సంజ్ఞచే నివ్వెరపోయి నిలచిపోయిరి:

విప్రుడు న్యాయాధీశ రామశాస్త్రి వచ్చి, సమ్ముఖమున నిలిచెను. బాహు ద్వయమును పైకి ఎత్తి 'రఘునాథరావు, చేసిన పాపమునకు తగిన శిక్షను పొందక, నగరమును వదలి ఎచ్చటికి ఏగుచున్నావు ?'అని బిగ్గరగా పలికెను.

జయకోలాహలములు నీరవములై పోయినవి. సమర వాద్యములు శాంతించెను. రఘునాథరావు 'ప్రభూ, నేడేల ? యవనుల పడగొట్టి, యమునికి తిండిని చేకూర్చుటకై వెడలుచున్న ఆ సమయమున నన్ను మార్గమధ్యమున హఠాత్తుగ నిరోధించుట ఏల ?' అని నుడివెను.

'నీవు నీ సోదరుని పుత్రుని వధించితివి దాని విచారణ కానంతవరకు నీవు స్వతంత్రుడవు కావు. అమోఘమును, కఠినమును అగు న్యాయవిధాన సూత్రముల బందివైతివి' అని శాస్త్రి ప్రత్యుత్తర మొసగెను.

రోషమున రఘునాథరావు పకపక నవ్వి 'నృపతి, దేని బంధనములు నరకుచేయనివాడు, దీప్త ముక్త కృపాణమున విజయలక్ష్మిని వరింప వెడలుచుండ, మార్గమధ్యమున న్యాయవిధాన భాష్యముల వినకోరుట లేదు'అని చెప్పెను.

'రఘునాథరావు, పోయి యుద్ధము చేయుము. నేనును న్యాయదండమును వదలి, నా గ్రామమునకు పోయెదను. విచారణశాల అనెడు క్రీడాగృహమున బంధింపబడి ఉండజాలను' అని శాస్త్రి నుడివెను.

శంఖములు తిరుగ ప్రోగెను. ఢంకాలు ఘోషించెను. సైనికులు ఉన్మత్తులై అగ్రసరులైరి. గౌరవపదమును విడనాడి, సర్వసంపదల దూరముగ నెట్టి, మరలి తన గ్రామమునందలి కుటీరమునకు దీన దరిద్ర విప్రుడు వెడలి పోయెను.

విజయదశమి :
నవంబరు, 1899. తంజావూరు 8-10-43.

[పండిత శంభుచంద్ర విద్యారత్నులచే రచింపబడిన చరితమాల నుండి]

16

శపథ రక్షణ

'మరాఠా దస్యులు, అదో వచ్చుచున్నారు. మీ మీ వేషముల ధరించి సిద్ధముగ నుండుడు' అని కేకలు వేయుచు ఆజమీరుకోటలో దుర్గాధిపతి దుమరాజు చెప్పెను. మధ్యాహ్నవేళ వారి వారి గదులలో వారు జొన్నరొట్టెల కాల్చుకొనుచుండిరి. దుర్గద్వారమున నగారా మ్రోగగనే, వెలుపలికి వేగముగ వచ్చివేసిరి. బురుజుపై నెక్కి చూడగా, దక్షిణమున బహుదూరమున మరాఠా అశ్వఖురములచే, ఆకసమును వ్యాపించుచు లేచుచున్న ధూళిని కాంచిరి. 'మన కృపాణ అనలమున నేడు మరాఠాలు మిడతలవలె దుమికిపడి, తిరిగి పోజాలరు' అని గర్జించెను దుర్గాధిపతి దుమరాజు.

మార్వారునుండి దూత ఏతెంచి 'ఈ సైనిక వేషములు వృథ. ఇదో, ప్రభువుని ఆదేశ పత్రమును చూడుము. దుర్గాధిపతి దుమరాజా, ఫిరంగిసేనా పతిని వెంటనిడుకొని సింధియా వచ్చుచున్నాడు. ఆదరమున వారికి దుర్గమును వదలివేయుమని నిన్ను అజ్ఞాపించుచున్నారు. విజయసింహుని ఎడల విజయ లక్ష్మి విముఖయై యున్నది. సంగ్రామము లేకనే, ఆజమీరుకోటను మరాఠాల వశముచేయుము' అని చెప్పెను. నిట్టూర్పుల విడిచి, కాతరస్వరమున 'ప్రభు ఆదేశమునకును వీరుని ధర్మమునకును నేడు విరోధము ఘటించుచున్నది' అనెను దుర్గాధిపతి దుమరాజు.

'రణవేషముల వదలుడు, వదలుడు' అని మార్వారుదూత చాటించెను. పాషాణమూర్తివలె ఉండిపోయెను దుర్గాధిపతి దుమరాజు. కాలము గడచిపోవు చుండెను. మైదానము విశాలముగ కనుచూపుమేరకు చెట్లుచేమలు లేక పడి యుండెను. దూరమున ధేనువులు మేయుచుండెను. గొల్లవాని వేణువు చెట్టు నీడన సకరుణ స్వరమున మ్రోగుచుండెను. "ఆజమీరుకోట నా వశముచేయ

బడినపుడు, 'ప్రభుని దుర్గమును నేను జీవించియుండ శత్రుకరముల స్వాధీనము చేయను' అని మనస్సున శపథము చేసితిని ప్రభు ఆదేశమున, అయ్యో, ఆ నా నిశ్చయమును నేడు వ్యర్థపరపవలసి యున్నది" అని తలచి నిట్టూర్పుల విడచెను దుర్గాధిపతి దుమరాజు.

రాజపుత్రులు కోపమున, లజ్జన రణవేషముల వదలివేసిరి. దుర్గ ద్వారమున మౌనముగ నిలిచియుండెను దుర్గాధిపతి దుమరాజు. పడమటివైపున, బయలుకు ఆవైపు. కాషాయవస్త్రయై సంధ్య దిగుచుండెను. దుమ్ముల ఎగజిమ్ముచు వచ్చి మరాఠా సైన్యములు కోటగుమ్మమున ఆగిరి. 'ద్వారముకడ ఎవరది పరుండియున్నది! లేలెమ్ము! ద్వారముల తెరవుము' అని గర్జింప ఎవరును వినిపించకొనలేదు. ప్రత్యుత్తర మొసగలేదు. ప్రాణముపోయిన దేహము మాత్రము పడియుండెను. ప్రభుని ఆదేశమునకును, వీరుని ధర్మమునకు నేడు ఘటిల్లిన విరోధమును మాన్పను, దుర్గద్వారమున ప్రాణముల త్యజించెను దుర్గాధిపతి దుమరాజు.

నవంబరు, 1889. 8-10-43.

17
కృత్రిమ దుర్గము

'బుందికోట నేలపైనున్నంతవరకు జలస్పర్శ చేయనని' చిత్తోరురాణా శపథము పట్టెను. 'అయ్యో, మహారాజా! ఎట్టి ప్రతిజ్ఞ! మానవులకు అసాధ్యమగు కార్యమును నేడు ఎటుల సాధింపగలము?' అని మంత్రులు నుడివిరి. 'సాధ్యముకాకున్న, నా శపథము నేను నిర్వహించెదను' అనెను రాణా.

బుందికోట చిత్తోరునుండి మూడు యోజనముల దూరమున్నది. అచ్చో, హారా వంశీయులు అందరును మహాశూరులు పరిపాలన చేయుచున్నారు. హామురాజా వారిని సంరక్షించుచుండ, వారికి ఎట్టి భయమును లేక నిశ్చింతతో నుండిరి. చాని ప్రమాణములు చిత్తోరురాణాకు పూర్తిగ తెలిసియే యుండెను. హారావంశీయుల బుందికోట మూడు యోజనముల దూరము.

మంత్రులు యోచించి, యుక్తి పన్ని 'నేటి రాత్రియంతయు పనిచేసి మట్టితో బుందికోటరీతియే కృత్రిమ దుర్గమును నిర్మించెదము. రాణా ఏతెంచి తన కరములతోనే నేలపై కూలత్రోయవచ్చును లేకున్న కేవలము ఒక్క-మాటనిమిత్తమై ఆత్మహత్య కావించుకొన్న వారగుదురు' అని మంత్రులు ఒక నకలుకోటను చిత్తోరులో కట్టించిరి.

హారావంశి వీరుడు కుంభ చిత్తోరురాణానౌకరిలో ఉండెను. జింకను వేటాడి భుజముపై ధనుస్సును అంబులపొదిని తగిలించుకొని తిరిగి వచ్చు చుండెను. కృత్రిమ దుర్గపు వార్తను విని 'ఎవరది బుంది నకలుకోటను కూలత్రోసి, హారావంశి రాజపుత్రుల తలవంపుల చేయదలచినది? హారావంశి వీరుడ నగు నేను ఆ బుంది నకలుకోటను సంరక్షించెదను' అని అనుకొనెను.

మట్టికోటను కూలత్రోయ, మహారాణా రాగా 'దూరముగ పొమ్ము' అని విడుగు గర్జించినటుల కుంభ అరచెను. 'బుందిపేరుతో కావింపబడు ఆటల,

ఎగతాళుల సహించువాడను కాను. నకలుకోట యొక్క మట్టిముద్దల నేడు నేను కాపాడెదను' అని 'మహారాణా! దూరముగ పొమ్ము' అని మరల ఒకసారి చెప్పెను.

నేలపై మోకాళ్ళ ఊని, విల్లున అంబుల ఎక్కించి ఒంటరిగనే కుంభ, నకలు బుందికోటను సంరక్షింప సన్నద్ధుడాయెను. రాణాసేనలు అతనిని పరివేష్టించి, కరవాలమున శిరమును నరుకగా, మట్టికోట సింహద్వారమున తల ఎగిరిపడెను. అతని రక్తముచే కృత్రిమ బుందిదుర్గము ధన్యమాయెను.

అక్టోబరు, 1899. 9-10-43.

18

వి వా హ ము

ఒక ఝాము రాత్రి. శంఖధ్వనులు నలువైపుల చెలరేగుచుండెను. వధూవరులు ప్రతిమా మూర్తులవలె చక్కగ నుండిరి. కొంగు కొంగునకు ముడివేయబడి యుండ, క్రిందిచూపులతో పెండ్లికూతురు నిలిచియుండెను. పురాంగనలు కిటికీల తెరచి మేలిముసుగుల కొద్దిగ సడలించి, చూచుచుండిరి. వర్షా శర్వరియందు మేఘములు ధమధమ గర్జించుచుండెను. దానికి అనుగుణ్యముగ ఉద్వాహ శంఖములును ప్రోగుచుండెను.

ఈశాన్య దిశయందు వాయువు నిశ్చలమై యుండెను. పొరలు పొరలుగ మబ్బులు ఆకసమును ఆవరించియుండెను. సభా మంటపమున వెలుగుచున్న వేలకొలది దీపకాంతులలో మణిహారములు కన్నుల మిఱుమిట్లు గొల్పుచుండెను. బాహిర ద్వారమున భేరి ప్రోగుచుండ, సభామధ్యమున హఠాత్తుగ ఎవరో వచ్చిరి. సభలో నున్న ప్రజలందరును చకితులై లేచి వధూవరుల చుట్టు నిలిచిరి.

బాషికములు ధరించియున్న మేత్రిరాకుమారునితో మార్వారుదూత 'విద్రోహులతోడ సమరము ప్రారంభము కాగా రామసింగురాణా రణమునకు వెడలెను. బ్రతికియున్న రాజపుత్రు లందరును రావలసినదని వారి పిలుపు' అని చెప్పి, 'జై రాణా రామసింగునకు జై' అని గర్జననినాదమున కేక వేసెను.

'జై రాణా రామసింగునకు జై' అని ఉచ్చస్వరమున మేత్రిపతియు పలికెను. వధువువక్షము భయమున కంపించిపోయెను. రెండు కన్నులును చెమ్మతో కదలిపోవుచుండెను. వరునివెంట వచ్చిన బంధువులును పెద్ద

గొంతులతో 'జై రాణా రామసింగునకు జై' అని కేకలిడిరి. 'మేత్రిరాజకుమారా, సమయము లేదు' అని మహారాణాదూత బిగ్గరగ చెప్పెను.

మంగళగీతములు ఏల వృథాగా పాడబడుచున్నవి ! శంఖధ్వనులు ఏల వృథాగా అతిశయించుచున్నవి ! వరుడు కట్టబడిన కొంగును విప్పెను ఇద్దరును ఒక క్షణము ఒకరి ముఖముల ఒకరు చూచుకొనిరి 'ప్రాణేశ్వరీ! మృత్యుసభనుండి ఆహ్వానము ఏతెంచినది. నేను వెడలుచున్నాను.' అని వరుడు చెప్పెను. మంగళ కోలాహలమంతయు నిరుపయోగమాయెనా ఏమి !

వరుని వేషముననే, నొసట బాషికములతోనే, అశ్వమునెక్కి రాజ కుమారుడు ప్రయాణము సాగించెను. మ్లాన ముఖముతో, నమ్రనత శిరముతో, అంతఃపురమునకు వధువు తిరిగిపోయెను. నెమ్మది నెమ్మదిగ వేలకొలది దీపములు ఆరిపోగా, కళ్యాణమంటప మంతయు చీకట్లు క్రమ్మిపోయెను. మెడలో హారమును, నొసట బాషికములును కదలిపోవుచుండ, అశ్వమునెక్కి రాకుమారుడు వెడలిపోయెను.

తల్లి ఏడ్చుచు, 'దురదృష్టురాలా, వధువు వేషమును వదలి పార వేయుము' అని చెప్ప, శాంతముఖముతో కన్య 'అమ్మా! ఏడ్వకుము. నీ కాళ్లపైబడి వేడుచున్నాను. నా పెండ్లివేషము నా ఒంటిమీదనే ఉండనిమ్ము. వారికొరకై మేత్రిపురమునకు వెడలెదను.' అని తల్లితో చెప్పెను. విని తల్లి నొసటను చేతితో కొట్టుకొని ఏడ్చుచు 'అయ్యో, దురదృష్టురాలా' అని మాటి మాటికి అనుచుండెను.

ఎట్టి అమంగళమును సంభవింపకుండ విప్రులు ఆశీర్వచనముల నుడివి, అక్షతల ఆమె శిరముపై నిడిరి. పురనారులు శుభగానముల పాడుచుండ, రంగురంగు బట్టల ధరించిన దాస దాసీజనములు పంక్తులు పంక్తులుగ వెంట వచ్చుచుండ, కన్య పల్లకి ఎక్కెను. తల్లి వచ్చి ముఖమున ముద్దిడెను. తండ్రి శిరముపై హస్తమునుంచి ఆశీస్సుల నొసగెను.

అర్ధరాత్రమున దివిటీలతో ఆకసమును ధగధగలాడించుచు మేత్రిపుర ద్వారమునకు వచ్చినదెవరు ! 'వేణునాదముల ఆపివేయుడు, ఆపివేయుడు.

దాసదాసీ జనములారా! పల్లకిని దించివేయుడు. మేత్రిరాజు యుద్ధమున వీర స్వర్గము పొంద, మేత్రిపురవాసుల మందరమును దహన సంస్కారమునకై చితిని పేర్చుచున్నాము. ఇట్టి దుస్సమయమున పురము ప్రవేశింప తగదు' అను కేకలు వినబడెను.

'మురళీగానము ప్రమోగింపుడు, ఒరే మురళీగానముల ముగింపకుడు' అని పల్లకినుండి కన్య ఆనతిచ్చెను. 'ఈతూది లగ్నము దాటిపోదు. ఇక కొంగుముళ్లు విడిపోవు. శ్మశానసభయొక్క దీప్త చితానలమున అంత్య మంత్రముల ఉచ్చరింపుడు. మంగళ మేళముల వాయింపుడు' అనెను పల్లకి నుండి కన్య.

వరుని వేషమున, నొసట బాషికములతో, కంఠమున పుష్పహారముతో, మేత్రిపతి చితిపై పరుండి యుండెను పల్లకినుండి దిగి వచ్చెను కన్య. అతని రక్తవస్త్రములతో తన చీరచెరగును ముడివేసెను. శిరోభాగమున కూర్చొని అతని శిరమును తన తొడపై ఉంచెను. అర్ధరాత్రమున వివాహ అలం కారముల వహించి, మేత్రిపతి చితిపై పరుండి యుండెను.

గుంపులు గుంపులు పురాంగనలు చేరి నాలుగు వైపులనుండియు మంగళగానముల పాడసాగిరి. 'సుచరితా! ధన్యవు' అని వందిమాగధులు కొని యాడుచుండిరి. కన్య యోగాసనమున కూర్చొనియుండ ధగధగ మండు చుండెను చితాగ్నులు. మంగళ గానముల మధ్యమధ్య జయజయ నాదములు చెలరేగెను.

తంజావూరు.
అక్టోబరు, 1899.

10-9-43.

[రాజస్థాన్ నుండి]
సుందరయ్య గ్రంథాలయము
A C No.....
హైదరాబాద్ - 500 044.

19
మానవంతుడు

ఔరంగజేబు భరతఖండమును ఖండఖండ మొనర్చుచున్నప్పుడు, మార్వారుపతి ఏతెంచి 'ప్రభూ, అవధరింపుము : గోపనముగ రాత్రి అచలగడము నుండి ప్రహరులు పట్టితెచ్చినతను, నికోహపతి, నా ఇంట బందియై యున్నాడు. అతనిని ఏమి చేయ అభిలాషయో, నాకు ఆదేశము నొసగుడు' అనెను.

విని 'ఏమి, ఏమి, ఎట్టి అద్భుతమగు వార్త వినుచున్నాను. పిడుగును గర్భమున దాల్చిన మెరుపు ఇన్నాళ్లకు చేచిక్కెనా ? కొన్ని వందల కొండ జాతుల గైకొని, కొండలు అడవుల క్రుమ్మరుచు, ఎడారులయందలి ఎండమావుల వలె రాజపుత్రులు స్వతంత్రులై యుండిరి. అతనిని చూడ కోరికగ నున్నది. పిలిచి తెచ్చుటకై ఏదో ఒక రాజదూతను అనుపుము' అని ఔరంగజేబు చెప్పెను.

మార్వారురాజు యశోవంతుడు హస్తముల జోడించి, 'నా గృహమున యున్నది క్షత్రికుల సింహ శాబకము. బాదుషా అతనిని చూడదలచియున్న, అతనిఎడల ఎట్టి అవమర్యాదయు, ఈషన్మాత్రమైన జరుగబడదని తొలుత వాగ్దాన మొసగవలెను. అప్పుడు నేను ఉచితమగు ఆదరమున అతనిని సభలోనికి తీసుకవచ్చెదను' అనెను.

ఔరంగజేబు నవ్వుచు 'మార్వారుపతి మహారాజా, నేడు ఎట్టి మాటను పలుకుచున్నావు ? ప్రవీణుడవై, ప్రబల వీరుడవయ్యు ఇట్టి మాటలా ? నీనోట ఇట్టిమాటల విన మనమున సిగ్గగుచున్నది. మానవంతుని మానమునకు హాని కల్పించు కార్యము మానవంతునికి శోభ నొసగునా ? ఇదో, వాగ్దాన మొసగు చున్నాను. ఎట్టి సందేహము లేక అతనిని సభలోనికి తీసుకరమ్ము' అని నుడివెను.

ఉచ్చశిరమును ఉన్నతముగ నుంచి, సమ్ముఖమున దృష్టి నిగుడ్చి, మార్వారురాజాను వెంటనిడుకొని, సిరోహిపతి సభలోనికి ఏతెంచెను. 'బాదుషా జాదాకు సలాము చేయుము' అని అందరును బిగ్గరగ అరవ, యశోవంతుడు స్కంధముపై కొద్దిగ వంగి 'గురుజనుల చరణములకు తప్ప, మరెవ్వరికి ప్రణమిల్లువాడను కాను' అని ధీరమగు స్వరమున సిరోహిపతి పలికెను.

రోషమున రక్తవర్ణమును తాల్చుచున్న చక్షువులతో, 'భూమిపై తల ఎటుల దొర్లి పడగలదో నేర్పగలము' అని బాదుషా అనుచరులు చెప్పిరి. నవ్వుచు, సిరోహిపతి 'ఎవరికైన భయపడి తల వంచువాడను అను అభిప్రాయమును దూర మొనర్పుడు. భయభీతులు నేను ఎరుగను' అని పలికి కృపాణముపై చేయినిడి నిలిచెను సిరోహిపతి.

బాదుషా రాజును చేయిపట్టి, తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొనెను. 'వీరుడా, భరతఖండమున ఏ దేశముపై నీకు అభిలాషయో తెలుపుము' అని బాదుషా అడుగ 'పృథ్వియందు దేశములలో అచలగడమే శ్రేష్ఠమైనది' అని రాజా పలికెను. సభలో నీరవముగ పరస్పర పరిహాసములు క్రమ్ముచుండ 'అచలుడవై అచలగడమున నివసించి పరిపాలింపుము' అనెను బాదుషా.

అక్టోబరు, 1899. 10-9-43.

20

హోలిపండుగ

భూనాగరాజు భార్య కేతునగ్రామమునుండి పఠాన్ కేసరఖానుకు 'మియా! పోరు సలుపవలెననెడి ఆశ నశించెను. కండ్లమీదుగ వసంతము గడచిపోవుచున్నది. నీ పఠాన్ సైన్యముల వెంటబెట్టుకొని రమ్ము, మీరును రాజపుత్ర స్త్రీలమగు మేమును హోలి ఆటలు అడెదము' అని ఉత్తరము పంపెను. యుద్ధమున ఓడి, భవనముల పట్టణమును వదలి, కేతున గ్రామము నుండి రాణి వార్త నంపెను.

ఉత్తరమును చదువుకొని, చిరునవ్వుల నవ్వుచు, మనోల్లాసమున మీసముల మెలివేయసాగెను కేసరఖాన్. మంచి రంగురంగుల పగిడిని ఏరి తీసికొని, శిరమున వహించి, కనురెప్పలకు సుర్మాను చక్కగ దిద్ది, అత్తరుతో గుమగుమ లాడుచున్న రుమాలును చేతనిడి, వేయితూరులు దాడీని విదలించి దువ్వి చక్కగా తీర్చెను. పఠాన్లతో రాణి హోలి ఆటల ఆడునను తలంపున, చిరునవ్వులు నవ్వుచు, మీసముల మెలివేయసాగెను కేసరఖాన్.

ఫాల్గుణ మాసమున దక్షిణ సమీరములు మత్తిల్లి వకులవనములోనికి వచ్చి పడుచుండెను. పూతవేసినవి మామిడి తోపులు. ఎవరు ఎవరి మాటలు వినెదరు అను చందమున భ్రమరములు, తమలో తాము గుంయ్ గుంయ్ అను చప్పుడులు చేయుచు, ఇటునటు తిరుగుచు గందరగోళముగ ఎగురు చుండినవి. కేతునపురమునకు నేడు దళదళములుగ పఠాన్ సేనలు హోలి ఆడుటకు ఏతెంచెను.

ప్రొద్దు క్రుంకు సమయము. కేతునపురమున రాజోపవనమున పఠాను లందరును వచ్చి నిలిచిరి. ముల్తాని రాగమున మురళులు మ్రోగుచుండెను. అప్పుడు రాణి, దాసీలు, రాజపుత్ర స్త్రీలు నూరుమంది హోలి ఆటలు ఆడు

టకు విచ్చేసిరి. భానుడు ఎఱ్ఱని వన్నెలచే అలమగడియుండెను; పడమటి సముద్రమున దిగ ఉద్యుక్తుడగుచుండెను.

అడుగడుగున పావడలు ఊగుచు కదలుచుండినవి. వసంత సమీరముల మేలిముసుగులు ఎగిరి సడలుచుండినవి. దక్షిణ హస్తముల గులాబితో నిండిన పళ్ళెరముల పూని, విచికారులు మొలలో వ్రేలాడుచుండ, వామహస్తముల పన్నీరు బుడ్లనిడి బారులు బారులుగ రాజపుత్ర రమణులు వచ్చిరి. అడుగడుగున పావడలు ఊగుచు కదలుచుండినవి. వసంతసమీరముల మేలిముసుగులు ఎగిరి సడలుచుండినవి.

క్రిగంట చూడ్కుల నిగిడించుచు, చతురములగు చిరునవ్వుల నవ్వుచు కేసరఖాను దగ్గరకు వచ్చి 'అనేక యుద్ధములలో తప్పించుకొని బ్రతికి బయట పడితిని; కాని నేడు అసువులుండగనే హాయిగ చచ్చుచున్నట్లు తోచుచున్నది.' అనుచు తన ఆనందమును పట్టజాలక పలుకగ, రాణి శతసహచారిణులు అందరును ఒక్కసారి కిలకిల యని బిగ్గరగ నవ్వసాగిరి. రంగుల పగిడీని కొద్దిగ ఏటవాలుగ త్రిప్పి, విలాసయుక్త భంగిమములతో వంగి వంగి సలాములు చేసెను.

హోలిఆటల నిషా ప్రారంభమాయెను. రక్త సంధ్యాకాశమున గులాబి వెదజిమ్మ బడుచుండెను. పొగడపువ్వులు క్రొత్త గంగుల దాల్చినవి. రాజపుత్ర రమణుల ఉచ్చోపహాసములచే, భీతిల్లి పక్షులు కూజితముల మరచిపోయినవి అరుణవర్ణ సంధ్యాకాశమున క్రమ్ముచున్న కెంపు పొగమంచులు ఎక్కడివా యనివించుచుండెను.

కన్నుల రమ్యమగు నిషా ఏల ఎక్కుటలేదని లోలోన తలచుచుండెను కేసరఖాన్. డెందము లేల ఉప్పొంగి కంపించుటలేదు? రమణుల పాదముల నున్న వంకరఅందియలు అపస్వరముల పలుకుచున్నవా ఏమి? వానికి అనుగుణ్యముగ కంకణములు మ్రోగుటలేదే! ఈ ఆటకు తగిన కైపు కన్నులకు ఎక్కుట లేదే అని లోలోన తలచుచుండెను కేసరఖాన్.

'రాజపుత్ర రమణుల దేహమున ఎచ్చటను ఎట్టి కోమలతయు లేదా ఏమి ? బాహుయుగళము మృణాలముల వలె లేవే ? కంఠస్వరమున లాలిత్యము లేదుకదా, మీదుమిక్కిలి విడుగులనే సిగ్గుపరచుచున్నవే ! మరుభూముల మంజరీరహితమగు వృక్షములపోలె, మిగుల కఠినము శుష్కములై యున్నారే కాని, మార్దవమన్న మాటయే లేదే? దేహమునకాని, మనస్సునకాని, రాజపుత్ర రమణులకు కోమలతయే లేదా?' అని పఠానులు తలచుచు అనుకొనుచుండిరి.

యమునాకళ్యాణి, భూపాలి రాగస్వరముల పూని, ద్రుతతాళమున వేణువులు మ్రోగసాగెను. మౌక్తిక మాలలు చెవులలోని కమ్మలను తాకుచు ఎగురుచుండినవి. కఠిన హస్తముల మొరటగు బంగారుమురుగులు గలగల శబ్దము చేయుచుండినవి. అంతలో గులాబీ పళ్ళెరముల దాసీలు వెంటకొని వచ్చుచుండ, ఉద్యానవనమునకు రాణి ఏతెంచెను. సంగీత జంత్రములన్నియు యమునాకళ్యాణి భూపాలి రాగస్వరముల పూని, ద్రుతతాళమున మ్రోగసాగెను.

'నీపు వచ్చు త్రోవను ఎదురు చూచిచూచి, నా రెండు కన్నులును గ్రుడ్డియై పోయినని' అని కేసరఖాన్ విలాసముతో పలుక, 'నాస్థితియు అట్టిదే' అనెను రాణి. వివశలై నూర్గురు చెలికత్తెయలును పకపక నవ్వుచుండ, హఠాత్తుగ కంచుపళ్ళెరము నొకదానిని కేసరఖాన్ ముఖమువైపు విసరెను రాణి. రక్తధారలు వేగముగ కారుచుండ, కేసరఖాన్ రెండు కన్నులును గ్రుడ్డియై పోయినవి.

మబ్బులు లేకనే విడుగుల చప్పుడులతో నగారా, దుందుభులు మ్రోగసాగెను. జ్యోత్స్నాకాశమున శశియు చకితుడై పోవునటుల, పెళపెళ ధ్వనులతో, తళతళ మెరుపులతో ఆడసాగినవి కరవాలములు. ద్వారమున కూర్చొనియున్న సన్నాయివారు గభీరస్వరమున కానడారాగమును పట్టిరి. కుంజవనమున తరుతలముల నగారా దుందుభులు మ్రోగినవి.

వీచుచున్నగాలిలో, మేలి ముసుగుల వదలివేసిరి. వేసికొన్న పావడాలన్నియు విప్పివేసిరి. మంత్రబలమున ఎచ్చటనుండియో వచ్చినటుల, నారీ

వేషముల ఆవల త్రోసి, పుష్పములనుండి వెలువడిన సర్పముల వోలె, వంద మంది వీరులు నిజవేషములతో బయటపడి, పఠానుల చుట్టుముట్టిరి. స్వప్నమున వలె మేలి ముసుగులు పావడాలు మాయమై నిజరూపముల వీరులు బయట పడిరి.

వచ్చిన త్రోవన ఒక్క పఠానుడైనను మరలిపోలేక పోయెను. ఫాల్గుణ రాత్రమున కుంజవితానమున మత్తకోకిల విరామము నెరుగక కూయసాగెను. కేతునగ్రామమున వకుళవనమున కేసరఖానుని హోళి ఆటలు సమాప్త మాయెను. వచ్చిన త్రోవన ఒక్క పఠానుడైనను బ్రతికి పోలేకపోయెను.

అక్టోబరు, 1899. 11 అక్టోబరు, 1943.

[రాజస్థాన్ నుండి]

21

ప్రార్థనాతీతమగు దానము

పట్టుబడిన శిక్కులు దళముల పఠానులు బంధించి తెచ్చినపుడు, సుహిద్‌గంజ్ గ్రామమున ధరణీతలము రుధిరవర్ణముతో నిండిపోయెను.

'విసుము, తరుసింగ్, నన్ను క్షమింప కోరుచున్నాను' అని నవాబు పలుకగా 'నన్నేల ఇంతటి పరిహాసమునకు పాల్పడచేసెదవు' అని తరుసింగ్ ప్రత్యుత్తర మిచ్చెను.

'మహావీరుడవు నీవు. నీపై నాకెట్టి క్రోధమును లేదు. వేణిలో ఒక పాయను కోసి నా కొసగుము, ఇదే నా ప్రార్థన' అనెను నవాబు.

'నీ కరుణ నా హృదయమున నాటి అల్లుకొనిపోయెను. నీవు కోరిన దానికన్న మరికొంత ఎక్కువగానే ఒసగెదను. వేణితో కూడ శిరమును' అని తరుసింగ్ నిర్భయముగ పలికెను.

[శిక్కులకు వేణీచ్ఛేదన, ధర్మపరిత్యాగము వలెనే, దూషణీయము]

అక్టోబరు, 1899. 11-10-1943.

22

బందివీరుడు

పంచనదుల తీరమున, వేణిచుట్టి శిరమున, చూచుచు చూచుచుండగనే గురుమంత్రమున ఆత్మత్యాగులును, భయరహితులు నగు శిక్కులు కార్యోత్సాహులై సిద్ధమైరి. సహస్రకంఠములు 'గురుజీకి జై' యను నినాదము లిడ, దిక్కులు మారుమ్రోగుచుండెను. నూతనముగ దీక్ష వహించిన శిక్కులు, నవీన ఉదయసూర్యుని వైపు నిర్నిమేషులై చూచుచు, తమ స్థిర సంకల్పమును ప్రకటించుచుండిరి.

'అలఖ నిరంజన్' అను మహారవములు ఎగయుచుండ బంధనములు విచ్చి, భయభంజన మగుచుండెను వక్షపార్శ్వమున ఘన ఉల్లాసమున కృపాణములు ఝణఝణమని శబ్దించుచుండెను. 'అలఖ నిరంజన్' అని పంజాబు నేడు గర్జించుచుండెను. లక్షప్రాణముల శంక నెరుగని, ఎట్టి ఋణ భారమును తెలియని అట్టి సుదివసము ఏతెంచెను. జీవన మరణముల కాలికడ దాసులను వలె చూచు చిత్తములు ఎట్టి జంకుకొంకులకు లోనుగాకుండెడి సుదివసము పంచనదుల దశతీరముల చుట్టి ఏతెంచెను.

దిల్లీప్రాసాద కూటముల జారుషాజాదాల తంత్రభయమున మాటిమాటికి దూరమగుచుండెను. ఎవరి కంఠములచే గగనమే మంథితమై, నిబిడ నిశీథముల పలాయన మొనర్చుచున్నారు ! ఎవరి కాగడాలచే, ఆకసపు నొసటను అగ్ని ప్రజ్వలితమై లేచుచుండెను ? పంచనదుల తీరమున, భక్తదేహుల రక్తలహరులు ముక్తమాయెనా ఏమి ! లక్షవక్షముల చీల్చుకొని, పక్షులవలె ప్రాణములు గుంపులుగుంపులుగ నిజధామమగు స్వర్గమునకు వెడలుచున్నవా ఏమి ! పంచనదుల తీరమున, వీరగణములు జననీలలాటమున రక్తతిలకముల దిద్దనున్నారా !

మొగలుల శిక్కు-ల రణమున, మరణ ఆలింగనముల, ఒకరినొకరు కంఠముల పట్టి ఒడవేసికొనుచుండిరి. కరవబడిన గాయపడిన శ్యేనవిహంగము భుజంగముతో యుద్ధము సల్పుచుండినటు లుండెను. ఆనాటి కఠిన రణమున, సుగభీర నిస్వనముల 'జై గురుజీ'అని శిక్కు-వీరులు కేకలిడుచుండ, 'దీన్ దీన్' అని రక్తపిపాసులగు మత మొగలులు గరించుచుండిరి.

గురుదాస పురమునందలి కోటలో, తురుష్క- సేనల చేతిలో 'బందా' పట్టువడగా, సింహమునువలె శృంఖలముల బంధించి, పట్టి దిల్లీనగరమునకు కొంపోయిరి. 'బందా' సమరమున బంది యాయెను గురుదాసపుర దుర్గమున.

సమ్ముఖమున మొగలుసైన్యములు మార్గంపు ధూళుల ఎగురగొట్టుచు, నరకబడిన శిక్కు-ల తలల ఈటెలపై ఎత్తి వెడలుచుండిరి. ఏడునూర్ల శిక్కు-లు వెనుక అనుసరించుచుండ, వారి దేహములవైనున్న శృంఖలములు గలగల శబ్దము చేయుచుండెను. ప్రజలు రాజపథముల పట్టరైరి. వాతాయనముల తెరచి వీక్షించుచుండిరి. ప్రాణభయముల విస్మరించి 'గురుజీకి జై' అని శిక్కు-లు గర్జించుచుండిరి. మొగలుల శిక్కు-ల కాలినడకలచే, దిల్లి పథధూళులు ఎగయుచుండినవి.

ఎవరు ముందు ప్రాణదాన మొసగవలెనను విషయమున ఒకరిమీద ఒకరు పోటీలు పడి, వడివడిగ ముందుకు రాజొచ్చిరి. దినము సమాప్తము కాగా, ఉదయమున కారులు తీర్చి బందీలు నిలిచియుండ 'జై గురుజీ' అని వలుకుచు శతవీరులు శతశిరముల ఘాతకుల హస్తముల సమర్పించుచుండిరి.

సప్తాహ కాలమున ఏడునూర్ల ప్రాణములు నిశ్శేషములై పోయెను. కాజి బందాబిడ్డను బందాఒడి లోనికి ఎత్తి ఇచ్చి, ఇతనిని నిజహస్తములతో సునాయాసముగ వధించవలెనని చెప్పి, చేతులు కట్టబడియున్న బందాబిడ్డ యగు కిశోరకుమారుని, అతని ఒడిలోనికి ఎత్తివేసిరి.

కొంచెము కాలము ఊరకయుండి, బందా మెల్లగ ఆ పసిబిడ్డను వక్షమునకు లాగికొనెను. క్షణకాలము దక్షిణ హస్తముమ అతని శిరముపై నుంచి,

అతని రంగు తలపాగాను ఒకతూరి ముద్దిడెను. అటుపై, నెమ్మదిగ మొల నుండి కత్తిని పైకితీసి, బాలకుని ముఖమును కన్నుఆర్పక చూచుచు 'గురుజీకి జై, పుత్రా భయమువలదు' అని చెవిలో చెప్పెను. నవీన వదనమున అభయ కిరణములు ఉత్సాహమున వెలుగుచుండ కిశోరకంఠమున సభాతలము కంపించి పోవునటుల 'గురుజీకి జై, ఎట్టి భయమునులేదు' అని తండ్రియగు బందా ముఖమువైపు చూచుచు, బాలకుడు కేకలిడసాగెను.

ఆప్పుడు బందా తన ఎడమచేతితో బాలకుని కంఠమును పట్టి, కుడి చేతితో బాలకుని వక్షమున బలముగ కత్తిని దింపెను. 'గురుజీకి జై' అనుచు బాలకుడు ధరణిపై దొర్లిపడెను.

సభ నిస్తబ్ధమాయెను. బందాదేహముపై ఘాతకులు ఎర్రగ కాలిన ఇనుప కడ్డీలతో వాతలు వేసిరి. ఎట్టి కాతరశబ్దములు పలుకకనే, స్థిరముగ వీరుడు మరణించెను. ప్రేక్షకులు చక్షువుల మూసిరి. నిస్తబ్ధమాయెను సభ.

నవంబరు, 1899 (1306). 12-10-43.

23

అంత్య శిక్షణ

ఒకదినమున శిక్కు-వులగురువు గోవింద్ నిర్జనమున తన జీవితపు విషయముల ఒంటరిగ మనమున తలపోయుచుండెను. ఏ సంకల్పరేఖలు అఖండ సంపూర్ణ రూపమున యౌవన స్వర్ణపటమున కాన్పించినవో, ఏ ఆశలు ఒకనాడు భారత వర్షమునంతయు పరివ్యాపించినవిగా ఉండెనో, అవి నేడు నూరు వ్రక్క-లైనవాయెను. అవి నేడు సంకీర్ణములై, శీర్ణములైనవి ; అవి నేడు సంశయ సంకులము లైనవి, సంకట మగ్నములును ఆయెను. అటులైన ఆ తొలి సంకల్పములు ఆశలు తప్పిదములా ? అటులైన ఈ జీవితమంతయు వ్యర్థమాయెనా ? ఇట్టి తలంపుల, ఎన్నో దారుణ సంశయముల యందు పడి, బడలిన ఒడలితో, కలతచెందిన డెందముతో, ఇరులు అలముచున్న సంధ్యా కాలమున గురుగోవింద్ భావన చేయుచుండెను.

ఇంతలో ఒక పఠానుడు దగ్గరకు వచ్చి, 'నా దేశమునకు వెడలు చున్నాను ; నావద్ద కొన్న గుర్రముల విలువ నాకిచ్చివేయుము' అని అతనిని అడుగ 'సలాములు, షేఖ్-జీ, ఆ పైకమును రేపు ఇచ్చెదను, నేటికి తిరిగిపొమ్ము' అని గురుగోవింద్ చెప్పెను. 'వానిధర నేడే కావలయును' అని రోషమున పఠానుడు పలుకుచు, అతని రెండుచేతుల గట్టిగ పట్టి 'దొంగవు, అప్పు ఎగవేయువాడవు' అని తిట్టసాగెను. చిని విసిగి తటాలున విద్యుద్వేగమున, గురుగోవింద్ తన కృపాణమును ఒరనుండి పైకిలాగి, ఒక్క-వెట్టున పఠానుని తల క్రిందపడునటుల విసరెను. నేలపై నెత్తుటి కాల్వలు పారెను. తన కార్యమును చూచి తల పంకించి 'నా సమయము దాటిపోయినదని నేడు తెలిసికొంటిని. పాప కరవాలము నిరర్థక రక్తపాతమున తన లక్ష్యమును నేడు మీరిపోయెను. ఈ బాహువుపై విశ్వాసము శాశ్వతముగ నాశనమాయెను.

ఈ పాపమును ఈ లజ్జను కడిగి తుడిచివేయ వలసియున్నది. నేటినుండి నా జీవితమున ఇదియే అంత్యకార్యము కాగలదు' అని గురుగోవింద్ తనలో అనుకొనెను.

అల్పవయస్కుడగు పుత్రుడొకడు పఠానునికి ఉండెను. గురుగోవింద్ అతనిని పిలిపించి తనవద్ద నుంచుకొనెను. రాత్రిందినములు అతనిని తన కంటిముందే ఉంచుకొని బిడ్డవలె పాలింపతొడగెను. శాస్త్రముల, తన సమస్త అస్త్రవిద్యలను అతనికి నేర్పెను. ఆ బాలకునితోడి వృద్ధుడగు ఆ వీరగురువు ఉదయము సాయంత్రమును పసిబిడ్డవలె ఆడుచుండెను. భక్తులు చూచి, గురువ్రకడకు ఏతెంచి 'ప్రభూ, ఇది ఏమి ? ఎట్టి విపరీతము ! మాకు శంక పొడముచున్నది. వ్యాఘ్రశాబకమును ఎంత యత్నించి పాలించినను, దాని స్వభావము మారగలదా? అది పెద్దదైనపుడు, గురుదేవా! జ్ఞప్తి యుంచుకొనుము, దీని నఖరములు ప్రఖరములే యగును' అని విన్నవించిరి. 'అదే నేనును కోరుచున్నాను. పులికూనను పులిని చేయకున్న, దానికి నేర్పినదంతయు వృథా యగును' అని గురువు నవ్వుచు చెప్పెను.

గురువు చేతులలో, చూచుచు చూచుచుండగనే, బాలకుడు యువ కుడాయెను. ఛాయవలె గురువువెంట తిరుగుచుండెను. పుత్రుని మాడ్క అతని సేవల కావించుచుండెను. తన ప్రాణమురీతియే ప్రేమించుచుండెను. దక్షిణ హస్తమును పోలె, సదా జాగరూకుడై పార్శ్వమున వసించుచుండెను. సమరమున శిక్కులగురువగు గోవిందుని పుత్రులందరును మరణించిరి. నేడు అతని ప్రౌఢకాలమున గురుజీయొక్క ఆ శూన్యహృదయమును పఠానుని తనయుడు అనురాగమున వ్యాపించివేసెను. విడుగుచే కాల్చబడిన మ్రి చెట్టు బెజ్జములో బయటనుండి గాలిచే తేలుచు వచ్చిన విత్తనములు పడగా, పెరిగి పెరిగి ప్రౌనై, వృద్ధ వటవృక్షమును శాఖోపశాఖలతో పెంచి కప్పి వేసి అదుముచున్నట్లుండెను.

ఒకతూరి పఠాను గురుపాదముల ప్రొక్కి 'తమ చరణకృపచే నా శిక్షణ పూర్తియాయెను. ఇప్పుడు తమ అనుమతియైన, వెళ్లి రాజసైన్య

దళమునచేరి, నిజ భుజబలమున ఉపార్జించి బ్రతుకగలను' అని విన్నవించు కొనెను. గురుగోవిందు అతని వీపుపై చేతినుంచి 'నీ పౌరుషమునకు తగిన శిక్షణ మరొకటి మిగిలియున్నది.' అని మాత్రము చెప్పి పంపెను. మరు దినము వేళదాటి గురుగోవిందు ఒంటరిగ బయలుదేరెను. పఠానుని పిలిచి 'అస్త్రము చేతనిడి నా వెంటరమ్ము' అనెను. భక్తులు 'మేమును వెంట వచ్చెదము, వచ్చెదము' అని కోలాహలము చేయగా 'మీరందరును వెనుకకు మరలుడు" అని గురువు ఆనతిచ్చెను.

ఇద్దరును నోట మాటలేక, మెల్లగ వనమున, నదీతీరమున నడచు చుండిరి. చక్కగా అమర్చబడిన గట్టుల, వర్షజలధారలు వేయి వ్రేళ్లతో ఎర్ర మట్టిని గీకివేసి నటులుండెను. బారులుతీర్చి, విశాల సాలవృక్షములు కాన్పించు చుండెను. వాని నీడల ఆకసపు అంశమును పొందుటకు కాబోలు చిన్న చిన్న మొక్కలు గుంపులు గుంపులుగ ఒకదాని నొకటి నెట్టుకొనుచుండినవి. ఒకవైపు కాషాయ రంగుగల ఇసుకఅంచున, మోకాటి లోతున పారుచున్న నదీనీరములు స్ఫటికముల వలె స్వచ్ఛమై యుండెను. నదిప్రక్క, గురువు సంజ్ఞ చేయగా, పఠాను నిలిచెను. ఆరిపోవుచున్న దివసపు మెరయు రక్తవర్ణ కాంతులు, కొండగబ్బిలముల రెక్కలవలె దీర్ఘచ్ఛాయల సేకరించి, పశ్చిమ ప్రాంతమునకు ఆవల, నిశ్శబ్ద ఆకాశమున ఎగిరి పోవుచుండెను.

పఠానునితో గురువు 'మామూద్, ఇటురమ్ము, ఇచ్చట త్రవ్వుము' అని చెప్ప, ఆ ఇసుకను త్రవ్వి, నెత్తురువలె ఎర్రనగు మరకలతో కూడిన ఒక రాతిబెడ్డను పైకి తీసెను. 'ఇదో, రాతిపైనున్న ఎర్రమచ్చలు, ఇవి నీతండ్రి రక్తపుమరకలు. ఇచ్చోటనే అతని తలను నేను నరకితిని అప్పు తీర్చకనే, గడువు నొసగకనే. నేడు సమయము ఆసన్నమాయెను. 'ఒరే పఠాన్, నీ జనకుని సుపుత్రుడవే యైతివేని, కత్తిని ఎత్తి, పితృఘాతకుని వధించి, అతని రక్త ఉపహారమున, తృషాతుర ప్రేతాత్మకు తర్పణల నొసగుము' అని గురువు అతనిని ప్రేరేపించెను. పెద్దపులివలె హుంకరించి, ఎర్రనైన కన్నులతో వీరుడు ఒక్క దుముకు దుమికి గురువుపై పడెను.

కొయ్యబొమ్మవలె స్థిరముగ నుండెను గురువు. తిరుగ తోడనే అస్త్రముల పారవైచి, పఠాను అతని చరణములపై పడి 'గురుదేవా, సైతానుతో ఇట్టి ఆటల ఆడకుము. పిత్సర క్తపాతము విషయము నేను మరచిపోవుట ధర్మము నకే ఎరుక. ఇన్నినాళ్లుగ, తండ్రి గురువు చెలికాడు అన్నియు ఒకేతూరి నీవేనని తలచుచుంటిని. ఆ స్నేహభావమే డెందమున వ్యాపించి యుండుగాత! హింసాస్మృతి అణగిపోయి నశించుగాత, ప్రభూ పదధూళిని ప్రసాదింపుడు' అని కరుణస్వరముల వేడుకొనెను. తోడనే ఒక క్షణమైనను ఆగక, తిరిగి వెనుకకైన చూడక, ఎగరొప్పుచు అడవిబయటికి వడివడిగ పరుగెత్తుకొని పోయెను. రెండు జలబిందువులు గురుగోవిందుని నయనయుగళమును చెమ్మచేసెను.

పఠాను ఆ దినమునుండి దూరదూరముగ ఉండుచుండెను. ఒంటరిగ గురువు శయన గృహమును కాపలా చేయుచు మేల్కొను వాడేగాని, వేకువ నుండి కాన్పించెడువాడు కాడు. అదియు గృహద్వారమున అస్త్రహస్తములతో రాత్రి ఉండెడువాడు కాడు. నదీతీరమునకు గురువుతోడి వేటకై ఒంటరిగ వెడలెడివాడు కాడు. నిర్జనమున గురువు పిలిచినను కాన్పించువాడు కాడు.

కొన్నాళ్లు గడచిన పిదప, ఒకనాడు గురుగోవిందు, పఠాను చదరంగపు ఆటను ఆరంభించిరి. ఎవరికిని ఎరుక లేకయే కాలము గడచిపోవుచుండెను. ఆట ఆటకు ఓడుచు కలత చెందుచుండెను మామూద్. సాయంకాల మాయెను. రాత్రియు పెరిగి పోవుచుండెను. చూచుచుండిన భక్తులు వారి వారి గృహము లకు వెడలిపోయిరి. రేయి చీకట్లును నల్లనేరేడు పండువలె మెరయుచుండెను. వంచిన తలతో, ఏకాగ్ర చిత్తముతో, పఠాను ఆటఎత్తు విషయమై ఆలోచించు చుండెను. ఎప్పుడో తటాలున చదరంగపు కాయనొకదానిని విసరి, మామూద్ శిరమును గాయపరచెను గురువు. పకపక నవ్వుచు 'పిత్సఘాతకునితో ఆడ వచ్చిన ఇట్టి కాపురుషునకు జయము చేకూరునా' అని గురువు పరిహసించెను. వెంటనే మెరపువలె మెరయు వాడియగు కత్తిని ఒరనుండి పైకిలాగి, గురు గోవిందుని వక్షమున పఠాను పొడిచెను. శాంత ముఖమున చిరునవ్వుల

నవ్వుచు 'ఇన్నాళ్లకు అన్యాయమునకు ఎటుల ప్రతీకారము చేసి తీర్చుకొన వలయునో తెలిసికొంటివి. అంత్య శిక్షణను నొసగి వెడలుచున్నాను. ఓ నా పుత్రా, నేడు కడపటిసారి నిన్ను ఆశీర్వాదముల చేయనిమ్ము' అనెను గురు గోవింద్.

అక్టోబరు, 1899. 13-10-43.

24
గురుగోవింద్

నిశి అవసానమగుచుండెను. యమునా తీరమున గభీరమగు వనము. దూరమున గిరి మాలలు తలలెత్తి నదిలోనికి తొంగిచూచుచుండెను. గురు గోవిందు తన ఆరుగురు అనుచరుల పిలిచి 'స్నేహితులారా ! మీరు మరల ఇండ్లకు పొండు, ఇప్పుడును సమయము కాలేదు' అని చెప్పెను.

'రామదాసు పొమ్ము, వేహారి పొమ్ము, సాహు నీవును మరలి పొమ్ము. లోభము చూపి, కర్మసాగరమున గంతులేసి దుముకుటకు నన్ను ఆహ్వానింపకుడు. ఇప్పుడును జీవన రంగభూమి బహుదూరమునందే పడియుండనిండు.'

'మానవుల ప్రాణము, ఆ మానవాలయమునుండి నన్ను పిలుచుచున్నట్లున్నది. అందుననే, సుప్త నిశీధమున 'పోయెద పోయెద' ననుచు ఉలికిపడుచు మేల్కొని లేచుచున్నాను. ప్రబల మానవ స్రోతమున ప్రాణము, మనము, దేహము విసరి పారవేయ కోరుచున్నాను.'

'మిమ్ముల చూచి చిత్తము చంచల మగుచున్నది. చిత్తము ఉద్దామమై పర్వీడుచున్నది. రక్తమనెడి అగ్ని శతశిఖల చాపి, సర్వ సమానముగ క్రీడల సల్పుచున్నది. కోశమున ఝణఝణ శబ్దము చేయుచున్న కృపాణమును నిందల చేయుచున్నట్లున్నది.'

'అయ్యో, అదెట్టి సుఖము ! ఈ వేదన యనెడి అరణ్యమును వదలి, జయతూర్యమును హస్తమున గైకొని, ప్రజలమధ్య పరుగిడుచు పోయి పడుటకు, రాజ్యముల రాజుల కూలత్రోయుటకు, నిర్మించుటకు, అత్యాచారుల వక్షమున పడి తీక్ష్ణమగు ఛురికను గ్రుచ్చుటకు కోరుచున్నాను.'

'తురంగము 'మాడ్క్ అంధనియతియందు, బంధనములచే చూపు అరికట్టి, పగ్గముల నిజహస్తముల గైకొని, విఘ్నముల విపదల దాటించుచు, ప్రతికూల ఘటనలమధ్య నా మార్గమున దానిని పరువెత్తించెదను.'

'సమ్ముఖమున వచ్చునవి కొన్ని తొలగిపోవును. కొన్ని భూమిపై పడిపోవును; బాధలు సందేహములై చెల్లాచెదరై పోవును. చరణ చిహ్నములు వెనుకపడి పోవుచుండును. ప్రళయ వహ్నిధూమమున ఆకాశపు చక్షువులును మ్లానము లగుచుండును.'

'ఒక్కొక్కప్పుడు నీరవ నిబిడమగు అమావాస్య నిశలు, ఒక్కొక్క తూరి తీక్ష్ణపు దివసములు. కొన్నితూరులు పిడుగుల కడుపున దాచి, మేఘములు ఆకసమున నాల్గు దిక్కుల వ్యాపించుచుండును. మరి కొన్ని తూరులు ఝుంఝు అతి నిర్దయతో శిరముపై విరిగి ప్రాలుచుండును.'

'రండు, రండు, రండు, అని అందరిని పిలుచుచున్నాను. అందరును పరుగిడి ఏతెంచుచున్నారు. గృహద్వారము లన్నియు వేగమున తెరవబడు చున్నవి. పరివారములలోని వారందరును తోసుకొని బయటికి వచ్చు చున్నారు సుఖసంపదల మాయా మమతల బంధనములన్నియు విచ్చిపోవు చున్నవి.'

'సింధువున పంచనదుల నీరములు కలిసిపోవుచున్న రీతిని ఆహ్వాన మును విని ఎవరును ఎవరిని ఆపజాలక, భక్తుల హృదయములు నాలో కలియు చున్నవి. పంజాబునంతయు వ్యాపించి చెలరేగుచున్నవి ఉన్మాద కోలా హలములు.

'ఎచ్చటికి వెడలెదరు, భీరువులారా! గహనమున గోపనమున నా కంఠధ్వని చొరబడుచున్నది. ప్రభాతమున రండు! రండు! రండు! అను ఆహ్వానముల విన్నవారై కార్యనిమగ్నులగు ప్రజలు కార్యముల విస్మరించు చున్నారు. రండు, మీరు రండు అని నిశీథమున విని తంద్రాజడత్వములు పటాపంచలగుచున్నవి.'

'ఎంత ముందుకు పోయినను, ప్రజలు హెచ్చుగుచున్నారు. బాటలు రేవులు నిండిపోవుచున్నవి. అందరును జాతి అభిమానముల పురచి, అలక్ష్యమున తమ ప్రాణముల నొసగుచున్నారు. మానావమానములు ఏకము కాగా, బ్రాహ్మణులు శూద్రులు కలిసి పోవుచున్నారు.'

'ఉండనిండు! సోదరులారా! ఉండనిండు! ఏల ఈ స్వప్నములు. అని మేష నయనముల పూర్వగగనమున అరుణోదయమును చూడవలయునన్న, ఇప్పుడును ఒంటరిగ దీర్ఘరజని యంతయు మేల్కొని, క్షణముల లెక్కించుచు ఉండవలయును, అట్టిసమయము ఇంకను రాలేదు.'

ఇప్పుడును అరణ్యమునే రాజధానిగ చేసికొని, కల్పిత జగత్తున విహరింపుడు. ఇప్పుడును కేవలము నీరవ భావనలే, కర్మవిహీనములగు విజన సాధనలే. అహర్నిశలు కూర్చొని నిజ మర్మవాణిని వినుట మాత్రమే జరుగుచున్నది.

అందుననే ఒంటరిగ యమునా తీరమున, దుర్గమ గిరుల మధ్య తిరుగుచున్నాను. పాషాణాంకముల పెరుగుచు మానవుడనగుచున్నాను. నదీ కల స్వనములతో నా గానమును మేళవించుచున్నాను. మనస్సును నా మనస్సుననే నిలుపుకొన కోరుచున్నాను. నా కార్యమునకు యోగ్యుడ నగుటకు కోరుచున్నాను.

ఇటుల ద్వాదశ వర్షములు గడచినవి. ఇంకను ఎన్ని దివసములు పట్టునో! నాలుగు వైపులనుండి అమర జీవితపు బిందువుల సేకరించి నాలో నన్ను ఎన్నడు పూర్ణముగ చూపగలుగుదునో!

ప్రాణమును విప్పి, 'నేను అన్వేషించుచున్న అంత్యమును పొందితిని. నా వెనుక మీరందరును రండు, మీ గురువు మిమ్ములనందరిని పిలుచుచున్నాడు. నా జీవనమున నూత్న జీవమును పొంది, సమస్త దేశమును మేల్కొనును గాక' అని ఎన్నడు నేను చెప్పగలనో!

ఇక భయము వలదు; సంశయములును వలదు. ఇంక ముందు వెనుకలు లేవు, సత్యమును పొందితిని, మార్గమును పట్టితిని. దానికడ సమస్త

జగత్తును ఒదిగి నిలువగలదు, దానివద్ద జీవన మరణములు కాని, మరేమియు కాని లేవు.

హృదయమున దైవవాణినివలె వినగలిగితిని. 'నీ కాంతియందు లేచి నిలువుము, అదో చూడుము, ఎంతెంత దూరమునుండి ఎన్ని వందలమంది జనులు నీ వశమగుటకు ఏతెంచుచున్నారో!'

'అదో వినుము, హృదయధారలు ప్రవహించుచుండ, కల్లోల ధ్వనుల వినుము. నీవు స్థిరముగ నుండుము, ప్రదీపమువలె అలసత్వమును వర్జించి, మేల్కొని యుండుము. నిశీధమునధ్యన నీవు నిద్రించిన, వారు మరలి పోవుదురు' అని వింటిని అని ఎన్నడుచెప్పగలను?

కాన సాహు పొమ్ము, రామదాసు వెడలిపొమ్ము. మిత్రులారా, మరలి పొండు. వెడలు సమయమున అందరును వచ్చి 'గురుజీకి జై'అను నినాదముల నిడుడు. రెండు చేతుల ఎత్తి 'జయ జయ అలఖ నిరంజన్' అని కేకలిడుడు.

జూన్, 1888. 14-10-43.

1వ భాగము

కథలు సమాప్తము.

2వ భాగము

కల్పనలు

1

గాన భంగము

నవయౌవనుడు కాశీనాథుడు తన పాటలచే సభాగృహమును నింపి పాడుచుండినపుడు, ఏడు పెంపుడుపక్షులవలె సప్తస్వరములును కంఠమున ఆడుచుండినట్లుండెను. పదును పెట్టబడిన కత్తివలె దశదిక్కుల క్రుమ్మరి నాట్యమొనర్చి తిరిగి వచ్చుచుండెను కంఠస్వరము. ఎప్పుడు ఏ దిక్కులకు వెడలునో గుర్తుపట్టుటకు వలను కాకుండెను; మెరుపువలె తళతళ లాడుచుండి న్నట్లుండెను. విపద జాలముల తనే సృష్టించుకొని, తనే వానిని త్రెంచుకొని బయట పడుచుండెను. సభయందలి శ్రోతలు విని నివ్వెరపోవుచు, సంతోష మును పట్టజాలక 'వహ్వా, వహ్వా' అని అప్రయత్నముననే అనుచుండిరి.

ముదుసలి రాజాప్రతాపరాయలు మాత్రము కొయ్యబొమ్మవలె కదలక మెదలక కూర్చునియుండెను. అతనికి వ్రజలాలుని సంగీతముతప్ప మరెవ్వరు పాడినను రుచింపదు. బాల్యకాలమునుండి అతని సంగీతములోనే ఇంతకాలము గడుపుచు వచ్చెను. వర్షదివసముల ఎన్ని మేఘరాగిణులు, హోలీదినముల ఎన్ని కాఫీరాగముల వినెనో లెక్కలేదు. శరద్రాత్రముల ఎన్నెన్ని విజయ గానముల పాడి, హృదయము పొంగుచుండ, కన్నీటిచే నయనద్వయమును చెమ్మచేసెనో లెక్కలేదు. స్నేహితజనములు కూడి, సభామండపమును నింపినపుడెల్ల గోకుల గోపాలుని గాథల భూపాలి ముల్తాని రాగములలో పాడి వినిపించుచుండెను. గృహమున మాటిమాటికి ఎన్నో వివాహ ఉత్సవ రాత్రులు రాగా, దాస దాసీ జనములు అరుణవాసములు ధరించియుండ, వందలకొలది దీపములు వెలుగుచుండ, మణిఆభరణముల వహించి, నవవరుడు లజ్జాసహితుడై కూర్చొనియుండ, సమవయస్కులగు ప్రియజనులు కర్ణములకడ పరిహాస వాక్యములు పలుకుచునుండ, వారి ఎదురుగ కూర్చుని వ్రజలాల్ శహానాస్వరముల

పట్టి ఆలాపించుచుండెడివాడు; ఆ సమస్త దినములచే, ఆ సమస్త గానములచే హృదయము పరిపూర్ణమై యుండెను. అతని గానమునుతప్ప మరెవ్వరి గానమును వినినను, అది అతని హృదయమును ప్రవేశింపలేక పోయెడిది. ప్రాణమున, ఒక్కనిముసమున మంత్రజలములవలె తన్మయభరితమగు అతీత ప్రాణమును మేల్కొల్పలేక పోయెడిది. అందుచే ప్రతాపరాయలు కాశీనాథుని వృథాయగు తలడోపుల డూరక చూచుచుండెను. స్వరములపై స్వరములు, రాగములపై రాగములు జరిగి పోవుచుండినవేగాని, హృదయమున వానికి అనువగు సన్మానము లభింపకపోయెను.

పాట ముగియగా కొంతకాలము విరామము కోరెను కాశీనాథుడు, ప్రజలాలునివైపు చూచుచు ప్రతాపరాయలునవ్వి, కన్నుగీటెను. చెవికడ ముఖమును చేర్చి 'వస్తాద్, పాటవంటిపాటను వినివింపుము. దీనిని పాటయని తలచుటకే సిగ్గగుచున్నది. విట్టతో వేటాడుచున్న విల్లి చేయు చెర్లాటములమాడ్కి యున్నదేగాని, సంగీతమువలె లేదు. ఆ దినములలో నిజమగు సంగీతముండెను. ఈ కాలములో, అయ్యో, సంగీతమన్ననే అలక్ష్యము' అని మెల్లగ నుడివెను.

ప్రజలాల్ వృద్ధుడు. నెరసి నిగనిగలాడు వెంట్రుకలతలపై తెల్లని పాగాను ధరించియుండెను. అందరికిని వంగి నమస్కరించి, సభామధ్యకు మెల్లమెల్లగా వచ్చి, ఆసనము గైకొనెను. నరములు వెలువడి సన్నగనున్న చేతితో తంబూరాను ఎత్తి తీసికొనెను. నతశిరమున, నయనముల మూసి, యమునాకళ్యాణి స్వరమును ఆలాపింపసాగెను. ఆ విశాలమగు సభాగృహ కోణములమధ్య, ఆతని క్షీణస్వరము కంపించి అణగిపోవుచుండెను. క్షుద్రపక్షి ఝుంఝూవాతములలో చిక్కి, తన ఇష్టము వచ్చినటుల ఎగురజాలని రీతిని యుండెను. వామపార్శ్వమున కూర్చొని ప్రతాపరాయలు శత ఉత్సాహముల 'ఆహాహా, వహ్వా, వహ్వా, అనుచు గొంతువిప్పి పాడుము' అని మెల్లగ చెవిలో చెప్పెను.

సభలోని వారందరును అన్యమనస్కులైరి. కొందరు గుసగుసలాడ సాగిరి, కొందరు ఆవలించుటకు మొదలిడిరి. కొందరు తూగుచు, ఇటునటు

తలల వ్రేలాడ వేయుచుండిరి. మరికొందరు ఇండ్లకు పోవ లేచుచుండిరి. కొందరు నౌకరుల పిలిచి 'ఒరే, తాంబూలము పొగాకు తీసుకరా' అని బిగ్గరగ అనుచుండ, వినకర్రల ఆడించుచు, మరికొందరు 'నేడు మిక్కిలి వేడిగా నున్నది.' అని లావుగొంతుతో పరస్పరము చెప్పుకొనుచుండిరి. వ్యస్తులగు జనులు వచ్చుచు పోవుచు నుండిరి. ఒక క్షణమైనను ఊరక ఉండలేకపోయిరి. నీరవముగ నుండిన సభలో శతరూపముల శబ్దములు చెలరేగుచుండినవి. తుపానులో చిన్నపడవవలె, ఆ ధ్వనులలో వృద్ధుని సంగీతము మునిగి పోవు చుండెను. తంబూరాయందు వ్రేళ్ళు కదలుచుండుట మాత్రము కనబడుచుండెను. నిజసుఖమున పొంగి, గానస్వరములు హృదయమునుండి బయల్వెడలు చోటును, నీటిచెలమనోట రాతిబండవలె, అలక్ష్యపు కలరవములు అణచి వేయుచుండెను. గానమును శ్రోతల చిత్తములును విడివడి వేరువేరు దిక్కుల పోవు ఇద్దరు జనులవలె, వ్యతిరేక దిశల పర్వీడుచుండినవి. కాని ప్రభుని మర్యాదనుంచుటకై వ్రజలాలు మనస్సువిచ్చి పాడుచుండెను.

మనోభ్రమచే ఎటులనో, గానములోని ఒక పాదమును మరచిపోయెను. దానిని సవరించుటకై, తిరుగ త్వరత్వరగ మొదటినుండి పాడెను. ఇప్పుడును మరచిన పంక్తి జ్ఞప్తికి రాలేదు. సిగ్గున తల ఊగించుచు తిరుగ తొలినుండి పాటను సాగించెను. మరలను మరచిపోగా పాటను వదలివేసెను. తన గురుజీని స్మరించుచుండ, రెండింతలు గజగజ వణికి పోవుచుండెను చేతులు. లజ్జన విహ్వలమై కంఠము బొంగురు పోవుచుండెను. గాలిలోని దీపశిఖవలె కదలి పోవుచుండెను. పాటల వదలి స్వరము ఆలాపన చేయసాగెను. అకారము పలికించపోవ, హఠాత్తుగ క్రందనములోని హాహాకారమువలె మారి పోయినది. స్వరముల విసరులు ఎక్కడికో ఎగిరిపోవ, తాళము మరెచ్చటకో తేలిపోయినది. గానసూత్రము తెగిపోగా, అశ్రు ముత్యరాసులు జలజల రాలి పోయెను. ఒడిలో సఖివలెనున్న తంబూరాపై లజ్జచే భారమగుచున్న శిరమును వంచి వ్రేలాడవేసెను. నేర్చిన పాటల మరచెను, చిన్ననాటి క్రందనగాథలు స్మరణకు వచ్చెను.

కన్నీటి చెమ్మచే కన్నులు తళతళలాడుచుండ, ప్రతాపరాయలు అతని ఒడలిపై చేతితో నిమిరెను. 'రమ్మ, ఇచ్చటనుంచి మనము వెడలదము' అని సకరుణ స్నేహమున పిలిచెను. వందలకొలది దీపపు వెలుగులలో కన్నుల పండువుగనున్న ఆ ఉత్సవసభను వదలి ఒకరినొకరు పట్టుకొని, ఆ ఇద్దరు పురాణమిత్రులును బయటికి వెడలిపోయిరి. ప్రజలాల్ కరముల జోడించి 'ప్రభూ, మన సభ భంగమాయెను. ఇప్పుడు క్రొత్త క్రొత్తవారు క్రొత్త క్రొత్త రంగులతో పుడమిపై ఏతెంచుచున్నారు. జగత్తున మన విజనసభయందు కేవలము నీవును నేనును మిగిలియున్నాము. అచ్చో నూతన శ్రోతల తెప్పింపకుము, ఇదే నీ చరణములకడ నా ప్రార్థన. ఒక్క గాయకునిదే కాదు గానము, ఇద్దరు కూడవలసియున్నది. కంఠము విప్పి ఒకడు పాడును, మరియొకడు మనస్సున పాడుచుండును. తటముయొక్క వక్షముపై తరంగము తాకినపుడే, కలగానము పుట్టును. వాయువులచేతనే వనసభా మండపము కంపించి మర్మరధ్వనుల ప్రసవించును. పృథ్వియందు ఎచ్చటి ఎట్టి మధుర ధ్వని యున్నను, ముందు రెండింటి కూడికయై యున్నది. ప్రేమ లేనిచోట, చెవిటిసభ మిగులును. అచ్చట గానము పుట్టి పెరుగజాలదు' అని జాలి పుట్టునటుల నివేదించెను.

జూలై, 1893. 15-10-43.

2

పురాతన భృత్యుడు

భూతమువంటి ఆకారము, పైపెచ్చు మిక్కుటమగు బుద్ధిహీనత. ఏమి కనబడకపోయినను 'కిష్టడు పెద్ద దొంగ' అని ఇల్లాలు అనుచుండెడిది. కూర్చొనుటకు, లేచుటకు ముత్తాతలు లేచి రావలసి యుండెడిది. వినియు విననట్లు నటించేవాడు. జీతముకన్న ఎక్కువ దెబ్బలు పొందేవాడు; అయినను తెలివిరాదు. 'చాల అవసరమగు పని, కిష్టా' అని కేక లిడుచు ఆతురతతో పిలిచి, ఎంత తొందర పడినను ఎచ్చట కనబడెడివాడు కాడు; ఊరంతా వానిని ముందు వెదకవలసి వచ్చెడిది. ఒకటిచ్చిన నిముసములో మూడు చేసికొని వచ్చెడివాడు. మూడు వాడి చేతి కిచ్చిన ఒకటి మాత్రము మిగిలి యుండేది. కొదమవి ఎచ్చట పోయినవో తెనియదనెడివాడు. ఎచ్చట బట్టిన అచ్చట, ప్రొద్దున, మధ్యాహ్నము, సాయంత్రము నిశ్చింతగా నిద్రపోయెడివాడు. పెద్ద గల్లంతు చేసి, 'వెర్రివాడా, దిక్కుమాలిన వాడా, గాడిదా' అని ఎన్ని చీవాట్లు పెట్టినా, గడప ప్రక్కన నవ్వుచు నిలువబడెడివాడు. అది చూచి మరింత కోపము అధికమయ్యేది. అయినను, అదేమి మాయో, అతనిని పంపివేయుట కఠినమైన కార్యము. వాడు చాల నాళ్లనాటి పురాతన భృత్యుడు.

గృహిణి కాళీస్వరూపిణియై 'ఇక నేను వీడితో ఏగలేను. నీ ఇల్లూ వాకిలితో నీవే నీ కిష్టడితో సుఖముగా ఉండు, చెప్పిన మాట వినడు; బట్టలు, పాత్రలు, ఇంటిలో ఉన్న వస్తువులన్నీ పోతూవుంటే చూస్తూ వుంటాడు. రూకలు మాత్రము నీళ్లమాదిరిగా సెలవగుచున్నవి. బజారుకు పోతే, తిరిగి సాయంత్రములోపల తిరిగి రావడం దుస్తరము. కొంచెము ప్రయత్నిస్తే, కిష్టడు తప్ప మరెవ్వరు నౌకరుగా దొరకరా' అని ఆగాయిత్యం చేసేది. విని నేనును మండిపడి వడివడిగా, పోయి, వాడి జుట్టుపట్టి ఈడ్చుకొని వచ్చి

'బడవా, ఇప్పుడే వెళ్లిపో, నిన్ను నేటినుండే వెళ్లగొట్టి వేసినాను' అని అరచెడి వాడను. నెమ్మదిగ ఆవలికి పోయెడివాడు. భారము తీరింది కదా అని తల చెడివారము. మరుదినము లేచి చూచునప్పటికి, ఇంట్లో ఏదో సర్దుతూ, పెద్ద దెయ్యమువలె ఇటునటు తిరుగుచు కాన్పించేవాడు. వెర్రినవ్వు నవ్వుచుండిన ముఖము; ఎట్టి చింత చీకాకు లేదు. చిత్తమున ఎట్టి విసుగుదలకాని, భయము కాని ఈషన్మాత్రమైన లేదు. ఏమి చేయగలము, వదలినను వదలడు మా పురాతన భృత్యుడు.

ఆ ఏడు, కమీషనువ్యాపారములో కొంత ద్రవ్యము సంపాదించి కుదుటబడ్డాను. శ్రీ బృందావనమునకు పోయి ఒకతూరి సేవించి వచ్చెదనని సంకల్పించితిని. ఇంటిఆవిడయు వెంటరా నుద్దేశించెను. కాని 'పతిపుణ్యము సతిపుణ్యమే గదా' వృథాగా వ్యయపరచుట ఏల, ఖర్చు రెండింతలు కన్న పైగ అగును' అని నెమ్మదిగ నచ్చచెప్పితిని. గాజులు గలగలలాడుచుండ, త్రాళ్లతో లాగి బిగించి, మూటల పడకల సిద్ధపరచి, వలసిన, వస్త్రముల పెట్టెలో నుంచి, కంట నీరుపెట్టుకొనుచు, పరదేశమున కిష్టుతో చాల కష్టముల పడెదవు' అని ఇల్లాలు చెప్ప 'అరే రాం రాం, నివారణ్ నావెంట వచ్చును' అని నేను చెప్పితిని.

రైలుబండి బయలుదేరెను. బర్ద్వానులో దిగి చూచునప్పటికి, కృష్ణ కాంతుడు మిక్కిలి ప్రశాంతముఖముతో పొగాకుకాడల ఏరి తెచ్చుచుండుట కాంచితిని. అతని సాహసము ఇట్టిదై యుండ, నిత్యము ఇక ఎట్లు సహించ గలనో ! ఎంత దూషించినను, అతనిని చూచి నాకు సంతస మగుచుండెడిది. వాడు మా పురాతన భృత్యుడు. శ్రీధామమున దిగగనే, కుడివైపు ఎడమవైపు ముందువెనుకల పండాలు వచ్చి చుట్టుముట్టిరి. నిముసమున ప్రాణమును కంఠగత మొనర్చిరి. ఆరుగురము ఏడుగురము కలిసి ఒకేచోట, పరమ స్నేహితభావమున విడిది చేసితిమి. ఏలాటి తొందరలు లేక సుఖముగ దినములు గడవగలవుగదా అని తలంచితిమి. ఎచ్చట వ్రజబాలికలు, ఎచ్చట పుష్పలావికలు, ఎచ్చట మురళీధరుడు హరి, ఏవి యమునాతీరపు పుష్పిత నికుంజములు ! ఏవి ఆనాటి జ్యోత్స్నాపులకిత వసంత యామినులు !!

నేనుమాత్రము మసూచికముచే బాధపడుచు పడక వదలలేక పోతిని. ఒక్క క్షణములో స్నేహితు లందరును స్వప్నము వలె పటాపంచలై పోయిరి. ఇల్లు వదలి పారిపోయిరి. నేను ఒంటరిగ పడకపై, వ్యాధి వాడి బాణములు ఒడలంతయు గ్రుచ్చుకొనుచుండ పడియుంటిని. రేయింబవలు కరుణాభరితములగు క్షీణస్వరముల 'కిష్టా, దగ్గరకు రారా, ఇన్నాళ్లకు కడపటికి దేశముకాని దేశమునకు వచ్చి ప్రాణముల కోల్పోవ సిద్ధపడుచున్నానే' అని పలుకుచునుండ, అతని ముఖమును చూడగనే, పెన్నిధి లభ్యమైనటుల, హృదయము నిండి పొంగిపోయెడిది. అహర్నిశము తలదగ్గరనే నిలువబడి యుండెను మా పురాతన భృత్యుడు.

ముఖమున నీరు అద్దుచు, నా వ్యాధిస్థితి అడుగుచు నాచేతిని అతని ముఖముపై నుంచుకొని కొంత చల్లదనమును కలిగించుచుండెను. ఇటుల మౌనముగ, కన్నుపై రెప్పవాల్పక, ఒక్క మెతుకైనను తినసహింపక నన్ను చూచుకొనుచుండెను. మాటిమాటికి 'బాబూ, నామాట వినండి మీకేలాటి భయము లేదు, సురక్షితముగ మన దేశమునకు పోవుదము; తిరిగి అమ్మగారిని చూచెదరు' అని ఓదార్చుచు, ధైర్యము చెప్పుచు, శుశ్రూష చేసెను. కొద్ది కాలమునకు నేను ఆరోగ్యమును పొంది లేచితిని. అతనికి పెద్ద జ్వరము కాచెను. నా భయంకర వ్యాధి భారమును అతను అతని దేహముపై తీసికొనెను. రెండునాళ్లు స్పృహతప్పి పడియుండెను. క్రమేణ నాడి క్షీణించి నిలిచిపోయెను. ఎన్నో తూరులు అతనిని వదలివేయబోతిని ; కాని ఇన్నాళ్లకు అతను నన్ను వదలిపోయెను. బహుదివసముల విదప, తీర్థములన్నియు సేవించి, నా భవనము చేరితిని. కాని నేడు వెంట లేడు నా నిత్యఅనుయాయి, ఆ మా పురాతన భృత్యుడు.

ఫిబ్రవరి, 1895. 15-10-43.

3

ఒకటింపాతిక ఎకరా భూమి

కేవలం ఒకటింపాతిక ఎకరా భూమి నాకు మిగిలెను. మిగతదంతయు అప్పులక్రింద పోయెను. దొరబాబు నన్ను పిలిపించి 'ఉపేన్, ఈ భూమిని విక్రయమునకు నేను తీసికొందును, తెలిసిందా' అని చెప్పెను. 'నీవు భూస్వామివి, నీ భూములకు అంతేలేదు. బాగా సాగదీసి కొలతవేసినా, నా భూమి నా చావుకు తగినంతే యున్నది.' అని నేను విన్నవింప, విని దొరబాబు 'ఇదో నేను ఒక తోటను వేయించితిని, నీకు తెలిసియే యుండును. నీ భూమియు నాకు లభ్యమైన నాతోట నిడివి వెడల్పు కూడ సమానము కాగలదు. అందుచే అది ఇచ్చియే తీరవలయును' అని పలికెను. రొమ్ముపై చేతులు చేర్చి, నమస్క-రించి సజల నయనములతో 'రక్షింపుడు నిరుపేద పొలమును. ఏడు తరములుగ మా పూర్వజులు ఏ మట్టిపై పోషింపబడి, పెంపొందిరో, అది బంగారుమట్టితో సమానము. దైన్యపు ఆవశ్యకతలచే ఆ తల్లిని అమ్ముకట్టి దౌర్భాగ్యుడను కాలేను' అని నేను చెప్ప, కండ్లు ఎర్ర గావించి, క్షణకాలము ఊరకయుండి, చివరకు ఒక క్రూరపు నవ్వు నవ్వి 'సరే చూస్తాము లే' అని దొర నుడివెను.

తదుపరి, ఒకటిన్నర మాసములో పొలము వాకిలి వదలి వీథిలో పడితిని. లేనిపోని అప్పుల పుట్టించి, డిక్రీపొంది, నాకు ఉన్నదంతయు అమ్మకమునకు పెట్టించెను. 'అయ్యో! ఈ ధరణిలో ఎవరికి విశేషముగ నున్నదో, వారే ఎక్కువ కోరుచుందురు. నిరుపేదల సొత్తుల హరించి దొరల హస్తములు నిండుచుండును. మోహకూపమున నన్ను ఉంచుటకు ఇష్టపడక కాబోలు, భగవానుడు నా ఒకటింపాతిక ఎకరాకు మారుగ సమస్త ప్రపంచమును నాకు ప్రాసియిచ్చెను 'అని తలచి సన్యాసి వేషమున సాధువుల శిష్యుడనై దేశ

దేశముల క్రుమ్మరితిని. ఎన్నెన్ని మనోహర ధామములు, ఎన్ని రమ్యమగు దృశ్యముల కాంచితినో లెక్క లేదు. పర్వతముల, సముద్రతీరముల, నగరముల విజనముగ ఎచ్చట నేను తిరుగుచున్నను, రేయింబవలు ఆ నా ఒకటింపాతిక ఎకరా పొలమును నేను మరవజాలకపోతిని. సంతల బయళ్ల దారిడొంకల ఈ విధముగనే పదిహేను, పదహారు వత్సరములు గడచెను. కడకు ఒకనాడు దేశమునకు మరలిపోయి చూచుటకు పెద్దకోర్కె పుట్టెను.

నమో నమో నమః సుందరీ మమ జనని వంగభూమి. గంగాతీరమున స్నిగ్ధ సమీరములు క్రీడలు సల్పుచుండ, జీవితమునే ఆవరించుచున్నావు నీవు. విశాలమగు పచ్చని పొలములు, బయళ్లు. గగన లలాటము నీ పదధూళిని ముద్దిడుచున్నది. నిబిడ ఛాయలతో శాంతినీడముల వలె అలరారుచున్నవి చిన్నచిన్న పల్లెటూర్లు. సాంద్రపల్లవ ఆమ్రకాననములు గోపబాలుర కేళిగృహము లగుచున్నవి. లోతగు స్తబ్ధ కాసారముల నీలాంబువులు; సానురాగములును శీతలములును అగు నిశీథములు. మధుభరిత హృదయలగు వంగవధువులు నీరముల గృహములకు కొనిపోవుచుందురు. 'అమ్మా' అని వారిని పిలుచుటకు ప్రాణములు పొంగి పైకి ఉబుకుచుండును; ఆనందాశ్రువులు నయనముల క్రమ్ముచుండును.

రెండు దినములతర్వాత రెండవ జామున మా గ్రామమును ప్రవేశించితిని. కుమ్మరిఇండ్లను దక్షిణమున వదలి, రథమున్న స్థలమును ఎడమవైపు విడిచి, సంతబయలును నందిబాబు ధాన్యపుకొట్లను దాటి, మందిరమునకు ప్రక్కగా పోయి, కడకు మెండగు శ్రద్ధతో కలతవడుచు నా ఇంటిదగ్గర చేరితిని. ప్రక్కలైన హృదయముతో, తిరిగి తిరిగి నాలుగువైపుల తీరా పార చూచితిని. గోడప్రక్క గుబురుగా పెరిగియున్న మామిడిచెట్టు, అవును అదే, అప్పటిదే. కన్నీటి చెమ్మతో దానినీడల కూర్చొనగా, మనస్సులోని విచారము కొంత ఉపశమించెను. చిన్ననాటి మాటలు ఒకటొకటిగ మనస్సునకు తోచి స్మరణకు వచ్చుచుండెను.

జ్యేష్ఠమాసపు పోరుగాలులలో, రాత్రి అంతయు జాగరణ చేసి, చాల వేకువనే లేచి, రాలిన మామిడిపిందెల ఏరి తెచ్చుటకై వడివడిగ పరుగెత్తుట

మనస్సునకు వచ్చెను.' ఆ ప్రశాంత నిశ్చల మధ్యాహ్నవేళలు, ఆ పాఠశాలా పలాయనములు కండ్లకు గోచరమైనటుల స్మృతిపథమునకు వచ్చుచుండెను. 'అయ్యో, మరెప్పుడు ఆ జీవితమును, ఆ ఆనందదినములను పొందగలను?' అని క్రుంగిన డెందమున కుములుచు దుఃఖించుచుంటిని. గాలియు హఠాత్తుగ పెద్ద నిట్టూర్పు విడచినటుల, రివ్వున వీచి, చెట్లకొమ్మల ఊపిపోయెను. రెండు పండినపండ్లు నా ఒడిప్రక్కనే నేల రాలెను. తల్లి ఇప్పటికి నన్ను గుర్తించినది కాబోలు అని తలచి వాత్సల్యపు ఆదానమును బహుఆదరమున కండ్లకు అద్దుకొంటిని.

ఇంతలో, అబ్బో ఎచ్చటనుండియో, యమదూతవలె తోటమాలి అచ్చటికి వచ్చెను. కట్టిన తలసిగ వీడి ఎగురుచుండ, సప్తమ స్వరమున దూషింపసాగెను. అప్పుడు నేను 'ఉన్నదంతయు ఊరకనే ఇచ్చివేసితిని. దానిలోని, రెండుపండ్లు నాకు లభ్యమైనందులకా, ఇంత కలవరము?' అని మెల్లగ నుడివితిని. నన్ను అతను గుర్తించక, భుజముపై నున్న దోటిని ఒక చేతితో పట్టి, నా చేతిని వేరొక చేతితో లాగి తీసుకపోయెను. తోడి స్నేహితులతో కూర్చొని, చేత గాలమునిడుకొని చేపలు పట్టుచుండిన దొర వివరములన్నియు మాలి చెప్ప విని, మండిపడి 'నరికి నెత్తురు తాగుతా, బడవా' అని దొర తిట్టగా. తోడి స్నేహితులు అంతకన్న నూరింతలు తిట్టసాగిరి. 'రెండు మామిడిపండ్లను మాత్రము బిచ్చమడుగుచున్నాను, స్వామీ' అంటిని నేను. దొర పకపక ఎగతాళిగ నవ్వి 'సాధువేషమున నికరమైన దొంగగా ఉన్నావే' అనెను. ఆ మాటల వినగా, ఒకవైపున నవ్వు, మరొక ప్రక్క కన్నీరు దొరలి ఉబుకుచుండ 'నా నొసటివ్రాత ఇదే కాబోలు. పెద్ద దొరబాబువైన నీవు నేడు సాధువు అయితివి. నేను నేడు అచ్చమైన దొంగనే అయితిని' అని నేను అనుకొంటిని.

జూన్, 1895. 16-10-43.

4

దేవతకు తిండి

మైత్ర మహాశయులు సాగర సంగమమునకు తీర్థస్నాన నిమిత్తమై వెడలనున్నారను వార్త క్రమక్రమముగ గ్రామగ్రామముల తెలిసిపోయెను. వెంట పోదలచిన వృద్ధులు బాలురు, స్త్రీ పురుషులందరును స్థిరము కాగా, రేపున రెండు పడవల సిద్ధపరచిరి.

పుణ్యకాంక్షచే ఆతురయైన మోక్షద వచ్చి 'అన్నగారూ, నేనును మీ వెంట వచ్చెదను' అనెను. ఆమె విధవాయువతి. యుక్తి విలాసములు తెలియని రెండు కరుణ నయనములుగలామె. మాటిమాటికి ప్రార్థనలు చేయుచుండ, ఆమె అనురోధముల తప్పించుకొనుట కష్టతరముగ నుండెను. 'మరి పడవలలో స్థానమేది'? అని మైత్ర చెప్ప, 'నీ కాళ్లపై బడెదను, ఏదో ఒక అంచులో ఒక మూల కొంత ఎడము ఏదో ఒక విధముగ చేసికొంటాను' అని ఏడ్చుచు చెప్పెను విధవ. మనస్సు కరిగిపోయినది; అయినను సందేహ భరితుడై బ్రాహ్మణుడు 'అటులైన చిన్న కుర్రవానిని ఏమి చేసెదవు?' అని ఆమెను అడిగెను. 'రాఖాలుడా? వాడు తన పినతల్లివద్ద ఉండును. వాడి పుట్టుకతర్వాత సూతికా జ్వరముచే పెక్కునాళ్లు కష్టపడితిని. బ్రతికెదనను ఆశయులేదు. అన్నద అప్పుడు అతనికి పాలిచ్చి తన బిడ్డలతో కూడ ప్రేమతో పెంచెను. అప్పటి నుండి తల్లి ఒడిని వదలి, పినతల్లి ఆదరమునందే ఉన్నాడు. చాల తుంటరి పిల్లవాడు, ఎవరు చెప్పినను వినడు. కొట్టిన వాని పినతల్లి వచ్చి, ఏడ్చుచు వానిని ఎత్తుకొని పోవును. తల్లివద్ద కన్న పినతల్లి వక్షమునందే వాడు సుఖముగ నుండగలడు' అని ఆమె ప్రత్యుత్తర మొసగెను.

విప్రుడు సమ్మతించెను. మోక్షద త్వరత్వరగా మూట ముల్లె కట్టి తయారాయెను. గురుజనులకు ప్రణమిల్లెను. సఖీదళముల వీడ్కోలు ఆమెను

శోకాశ్రుజలముల తేలేచ్చను. రేవుకు వచ్చి చూడగా, అచ్చటికి ముందుగనే పరుగెత్తుకొని వచ్చి, రాఖాలుడు పడవపై ఎక్కి నిశ్చింతగ, మౌనముగ కూర్చొనియుండెను. 'ఒరే నీవెందుకురా ఇచ్చట' అని తల్లి అడుగ 'సాగరమునకు పోయెదను' అని బాలకుడు చెప్పెను. 'సాగరమునకు పోయెదవా, రా, దొంగపిల్లవాడా, రా దిగిరా' అని తల్లి కోపమున పలికెను. నిలకడైన కళ్లతో చూచుచు 'సాగరమునకు పోయెదను' అను రెండుమాటల చెప్పెను. అతని చేతుల పట్టి ఎంత లాగినను, పడవను వదలక, గట్టిగ పట్టుకొని కూర్చుండెను. కట్టకడపటికి బ్రాహ్మణుడు కరుణయుక్తమగు ప్రేమతో నవ్వుచు 'ఉండనీ, ఉండనీ, మనతోడనే ఉండనీ' అనెను. తల్లి కోపమున మండుచు 'పద, సాగరజలముల నిన్ను ఇచ్చివచ్చెదను' అనెను. ఆ మాటలు చెవుల పడినంతనే, తల్లివక్షము అనుతాప బాణములచే గ్రుచ్చబడి, వేదనచే ఏడ్చుచున్నట్లాయెను. నయనముల మూసికొని, 'నారాయణ, నారాయణ' అని స్మరించెను. పుత్రుని ఒడిలోనికి తీసికొని, అతని దేహమంతయు తన కరుణకళ్యాణ కరములతో ప్రేమపూర్వకముగ నిమిరెను. మైత్ర ఆమెను పిలిచి 'ఛీ ఛీ, అట్టి మాటల అనరాదు' అని మెల్లమెల్లగ చెవిలో అనెను.

రాఖాలుడు వారివెంట పోవుట స్థిరమాయె నను వార్తను లోకుల ముఖమున విని, అన్నద వేగముగ వచ్చి. 'బిడ్డా, ఎక్కడికి పోయెదవురా' అని అడుగ రాఖాలుడు నవ్వుచు 'సాగరమునకు బయలుదేరితిని, పిన్నమ్మా, మరల తిరిగివచ్చెదను' అనెను. పిచ్చిదానివలె, అన్నద బిగ్గరగ అరచుచు 'అయ్యా, స్వామి, నా రాఖాలుడు చాల తుంటరివాడు, వానిని ఎవరు సమాళించ చెదరు ? పుట్టిందిమొదలు పినతల్లిని వదలి ఎచ్చటను చాల దినములు ఉండలేదు. వీడిని ఎక్కడ తీసికొని పోగలరు ? దింపించి నాకు ఒప్పచెప్పుడు' అనెను. 'పిన్నమ్మా, సాగరమునకు బయలుదేరితిని, మరల తిరిగి వచ్చెదను' అని రాఖాలుడు తిరుగచెప్పెను. ప్రేమభరితుడై విప్రుడు నేను ఉన్నంతకాలము, నీ రాఖాలునికి ఎట్టి భయమును లేదు. వర్షాకాలము దాటినది. శీతాకాలము వచ్చివేసినది. నదీనదములన్నియు శాంతముగనే ఉండగలవు. వేల కొలది

మంది చేరు తిరునాళ్ల. మార్గమున ఎట్టి విపదలను ఉండవు. పోయివచ్చుటకు రెండు మాసములే పట్టును. నీ రాఖాలుని నీకు మరల క్షేమముగ ఒప్పగించ గలను' అని చెప్పి పంపెను. శుభముహూర్తమున, శ్రీదుర్గను సంస్మరించి, పడవల విప్పి ప్రయాణము సాగించిరి. రేవునందు నిలిచియున్న కులాంగన లందరును కన్నీరు ఒలుకుచుండ, చూచుచు నిలిచియుండిరి. హేమంతపు ప్రభాత శిశిరమున, చూర్ణినదీ తీరమున గ్రామము చెమ్మగా కాన్పించుచుండెను.

తిరునాళ్ల పూర్తికాగా, యాత్రికులు తిరిగి వచ్చుచుండిరి. మధ్యాహ్నపు వేళ పోటుకై ఎదురుచూచుచు ఒడ్డున పడవ కట్టబడి యుండెను. కుతూహలము తగ్గిపోగా, రాఖాలుని ఇంటికై మరలిన ప్రాణము వినతల్లిఒడికై ఏడ్వసాగెను. జలము, నాలుగు వైపుల జలముల చూచి చూచి, అతని చిత్తము వికలమాయెను. మెత్తగ నున్నగ నల్లగ తళతళలాడుచు, వంకరటింకరగ నడచుచు, తుంటరు లగు జలములు, ఆసక్తితో నాకివేయనెంచు నాలుకలతో కూడిన క్రూర సర్పములమాడ్క్, వివిధ భంగిమలతో లక్షలకొలది పడగల ఎత్తి, బుసలు కొట్టుచు, కేకలిడుచు, మట్టి యను శిశుముఖమును ఆతురతతో సదా కోరుచున్న ట్లుండెను. మృత్తికా ; స్నేహమయీ ; మౌనమున మూగయైనదానా ; స్థిరమై, ధ్రువమై, పురాతనమై సర్వ ఉపద్రవముల సహించుచుండు ఆనందభవనమా! శ్యామల కోమలమైనదానా! ఎచ్చట ఏది ఉన్నను అదృశ్యమగు బాహుయుగళ మును చావి, అహరహము ఆకర్షించుచున్నదానా! మనోహరమైనదానా! నీ శాంతవక్షము వైపులకు విశాల దిగంతములే తెలియరాని విపుల ఆకర్షణచే వచ్చి చేరుచున్నవే!

చంచల బాలకుడు ప్రతిక్షణము వచ్చి అధీర ఉత్సుక కంఠమున 'స్వామీ, నేడు పోటు ఎప్పుడు వచ్చును?' అని విప్రుని అడుగుచుండెను. హఠాత్తుగ నిలుకడగ నుండిన నీళ్లలో, ఆవేగ సంచారము తన ఆగమన సంవాదమును రెండు కూలముల ప్రకటింపసాగెను. పడవమోము మరలెను. మృదు ఆర్తనాదమున జలములు కదలుచు మెల్లమెల్లగ ఉబుకసాగెను. కలశబ్ద గీతములతో, సింధు విజయరథము నదిలో ప్రవేశించెను. పోటు బాగుగ

పొంగుచుండెను. నావికుడు దేవతను సంస్మరించి, త్వరితముగ ఉత్తర ముఖమునకు పడవను సాగించెను. రాఖాలుడు బ్రాహ్మణునికడకు వచ్చి 'దేశము చేరుటకు ఇక ఎన్నినాళ్లు పట్టును' అని అడిగెను.

రెండు కోసులును పోలేదు. సూర్యుడు అస్తమించకమునుపే, ఉత్తర వాయువుల వేగము క్రమముగ పెరిగిపోవుచుండెను. నదీముఖమున ఇసుకను తెచ్చి వెదచల్లుచున్నట్లుండెను. క్షోభితమగు నదీపథమున, పోటుచే పొంగుచున్న ప్రవాహమునకును, గర్జించుచు భీషణమై ఉద్దామమై వీచు ఉత్తర ప్రభంజనములకును సమరము ఆరంభ మాయెను. 'పడవను ఒడ్డునకు చేర్చుడు' అని ఉచ్చకంఠమున సారెసారెకు యాత్రికులు అరచుచుండిరి. ఒడ్డు ఏది? నాలుగువైపుల వెర్రిపట్టిన ఉన్మత్త జలములు తమ రుద్రతాండవమున, లక్షహస్తములతో కరతాళ ధ్వనుల చేయుచున్నట్లున్నవి. నురుగుల గ్రక్కుచు ఆక్రోశమున ఆకసమును దూషించుచుండి నట్లుండెను. ఒకవైపున అతి దూరమున తీరప్రాంతపు నీల వనరేఖ కాన్పించుచుండెను. మరియొక వైపున కలతబడి, తెగబడి పైకి దుముకుచున్న జలరాసులు, ప్రళాంత సూర్యునివైపు పొంగుచు, చేతుల ఊపుచు, పెరుగుచున్న తిరుగుబాటును కావించుచుండెను. చుక్కాని పట్టసాధ్యము కాకుండెను. కైపు ఎక్కి, విర్రవీగుచు తూలుచున్న తాగుబోతువాని వలె, పడవ ఇటునటు కదలి పోవుచుండెను. మెండగు చలిగాలులతోడి, భయమను మంచును చేరి స్త్రీపురుషుల గజగజ వణకించుచుండెను. కొందరు నిర్విణ్ణులై పోయిరి. కొందరు చుట్టముల పేర్లతో పిలుచుచు పెద్ద గొంతులతో ఏడవసాగిరి. మైత్ర వాడి తెల్లపారిన ముఖముతో కన్నుల మూసి జపము చేయసాగెను. తల్లిరొమ్మున ముఖమును దాచుకొని రాఖాలుడు నిశ్శబ్దముగ వణకిపోవుచుండెను.

అప్పుడు భీతిల్లిన నావికుడు అందరి నుద్దేశించి 'అయ్యలారా, అమ్మలారా, మీలో ఎవరో మ్రొక్కుకొన్నది చెల్లింపకనే మోసగించి వచ్చుచున్నారు. అందుననే తలవని వేళ ఈ తుపాను' అని అరచి చెప్పెను. 'ఇప్పటికైనా నా మాట వినుడు, మ్రొక్కుబడి చెల్లింపుడు. కోపగించియున్న

దేవతతో చెర్లాటములు ఆడవద్దు' అనెను. ముందు వెనుకలు చూడకనే తమ తమ వద్దనున్న డబ్బును, గుడ్డలను నీళ్లలో పారవేసిరి. అయినను, అప్పుడే ఎగురుచు దుముకుచు అలలు పడవలోనికి చొరబడసాగెను. మరల పడవ వాడు 'దేవతకు ముట్టవలసిన సొత్తును తిరిగి తీసుక పోవుచున్నారు. ఈపూట నామాట విని, ఇచ్చివేయుడు' ఆని జాలి రేకెత్తునటుల విన్నవించెను.

అప్పుడు తటాలున బ్రాహ్మణుడు లేచి మోక్షదను చూచుచు 'ఇదో ఈమెయే దేవతకు తన బిడ్డను ఇచ్చెదనని చెప్పి, మోసమున బిడ్డను తీసుక పోవుచున్నది' అని చెప్పెను. 'అతనిని పారవేయుడు' అని భీతిచే క్రూరులైన యాత్రికులందరును ఏక కంఠమున పలికిరి. 'స్వామీ, అన్నగారూ, రక్షించండి, రక్షించండి' అని నాని మొరపెట్టుకొనెను. ఆదరమున రెండు హస్తములతో దృఢముగ రాఖాలుని వక్షమునకు అదిమి పట్టుకొనియుండెను. తిట్టుచు, చిందులు తొక్కుచు బ్రాహ్మణుడు లేచి 'నేనా నిన్ను రక్షించువాడను! తెలివి తక్కువగ తల్లివైయుండి కోపమున బిడ్డను దేవతకు అర్పించెదనని చెప్పితివి. చివరకు నేనా అతనిని రక్షింపగలవాడను. దేవత అప్పును తీర్చివేయుము. వాగ్దానము భంగమొనర్చి, ఇంతమంది ప్రాణుల సముద్రమున ముంచ దలచితివా?' అని గద్దరించెను.

మోక్షద విలపించుచు 'అయ్యో, నేను మిగుల బుద్ధిహీనురాలను. అంతర్యామీ, కోపావేశమున పల్కినదే నిజమాయెనా? స్వామీ, అది సర్వ అసత్యమని విన్నతోడనే నీవు తెలిసికొనజాలక పోయితివా? కేవలము నోటి నుండి వెలువడిన మాటలనే దేవత వినుచున్నదా? జనని అనురాగపు హృదయ మున మాటుపడియున్న మాటను వినలేదా?' అని ఇంకను ఏదేదో పలుకుచు, పలుకుచుండగనే అందరును చేరి తల్లిని పట్టుకొనగా, పడవవాడు బలముతో రాఖాలుని తల్లి వక్షమునుండి లాగి, పెరుకుకొని చేతులలోనికి తీసికొనెను. మైత్ర రెండుకన్నులు మూసుకొని ముఖమును త్రిప్పి, పండ్లు బిగించి, చెవులపై చేతులు గట్టిగ అదుముకొని కూర్చొని యుండెను. ఎవరో అతనిని, హఠాత్తుగ మెరుపు కొరడాలతో అంగఅంగమునందును కొట్టుచున్నట్లుండెను. వేయి

తేళ్లు ఒక్కసారిగ కుట్టుచున్నట్లుండెను. 'పిన్నమ్మా, పిన్నమ్మా, పిన్నమ్మా' అను ఆ నిరుపాయ అనాథుని అంతిమ కేకలు అగ్ని శలాకల వలె వచ్చి మూయబడిన చెవులలో పొడుచుచుండెను.

ఒక్క కేక వేసి విప్రుడును లేచి 'ఆపుడు, ఆగుడు' అని అనుచున్నంతలో, మోక్షద మూర్ఛపడి తన చరణములకడ పడియుండుట కాంచెను. పొంగుచున్న తరంగముల మధ్య ఒక్క క్షణకాలముననె తన ఆర్త చక్షువులు తెరచి, కడపటి తూరి 'పిన్నమ్మా' అని కేకవేసి బాలకుడు అనంత తిమిర రాసులలో చేరిపోయెను. కేవలము ఒకసారి చిన్న పిడికిళ్లను, వ్యాకులముగ బలముగ పైకి ఎత్తి ఆకసమునన్నైనను ఆశ్రయము దొరక గలదా అని వెదకుచున్నట్లుండ, హతాశుడై మునిగిపోయెను. 'మరల్చి నిన్ను తెచ్చెదను' అని ఎగరొప్పుచు పలికి బ్రాహ్మణుడు ఒక్క ముహూర్తములో జలములలోనికి ఎగిరి దుమికెను. తిరిగి పైకి రాలేదు. అస్తాచలమున సూర్యుడును క్రుంకిపోయెను.

అక్టోబరు, 1897. 17-10-43.

5
నిష్ఫల ఉపహారము

క్రింద సుడులు తిరుగుచు పరుగిడుచుండెను యమునా నది నీరములు. రెండు తీరముల గిరితటముల పెద్ద రాతిబండలు పడియుండెను. సంకీర్ణ గుహాపథముల జలధారలు ఢీకొనుచు ఉన్మత్త ప్రలాపముల నిరంతరము గర్జించుచుండెను.

జటిలము వక్రమగు నిర్ఝరపు వేణిని విప్పి, నీలవర్ణ దిగంతములకు పరువెత్తుచుండెను నీలగిరి శ్రేణులు. నది స్థిరముగ నుండెను, అయినను రేయింబవలును పారుచునే ఉండెను; ప్రవహించుచునే ఉండెను. కాని అచల శృంఖలములచే బంధింపబడి నట్లుండెను.

అచ్చటచ్చట సాల తాళవృక్షములు నిలిచియుండ గిరులు సైగలు చేసి మబ్బుల పిలుచుచున్నట్లుండెను. గడ్డియు లేక కఠినమై, బీటలువారిన భూమి అడవిపువ్వుల ముండ్లచెట్లతో నిండియుండెను.

దివసపు తాపమును భూమి వ్రేళ్ళగ్రక్కు చుండెను. దారిడొంకలు లేక, జనులు లేక, ఎట్టి చప్పుడులును లేక పర్వతములు తమ నీడలయందు నిలిచి యుండెను. ప్రతిదినము క్రుంకువిధముననే సూర్యుడు క్రుంకుచుండెను.

రఘునాథరావు అచ్చటికి వచ్చి దిగినపుడు, శిక్కులగురువు భగవల్లీలల పఠించుచుండెను. రఘు అతని పదముల నమస్కరించి 'ప్రభూ, దీనుడు తెచ్చియున్నాడు స్వల్పమగు ఉపహారమును' అనెను.

చేతుల చాపి, గురువు కుశలముల ప్రశ్నించి, శిరమున కరతలముంచి, ఆశీర్వదించెను. మాణిక్య ఖచితములగు రెండు స్వర్ణ వలయములను, రెండు చేతుల జోడించి, రఘు గురుపదముల అర్పించెను.

నేలనుండి ఒక వలయమును ఎత్తి తీసికొని, గురువు వ్రేలిపై గుండ్రముగ త్రిప్పుచు చూడసాగెను. మాణిక్యపు సూచీముఖములు రివ్వున తిరుగుచుండ వివిధ వర్ణముల సన్నని చిన్న వెలుగు, కత్తులతో కొట్ట యత్నించుచున్నదా యన్నట్లుండెను.

చిరునవ్వు నవ్వి, దానిని ప్రక్కన ఉంచి తిరిగి గురువు గ్రంథముపై నయనములు నిగుడ్చెను. తటాలున రాతిబండపైనుండి దొరలి ఒక వలయము యమునాస్రోతమున పడిపోయెను.

'అయ్యో, అయ్యో' అవి అరచుచు రఘునాథుడు రెండు చేతుల చాచి జలములలో ఎగిరి దుమికెను. దానిని వెదకి తీయవలెననెడి మెండగు ఆసక్తియందు అతని సమస్త ప్రాణ మనఃకాయములు ఒకే బాహువై పోయెనా అనిపించెను.

ఒక్కసారియైనను గురువు తలఎత్తి కాంచలేదు. తన ఏకాంత హృదయమున, పాఠసుఖమును అనుభవించుచుండెను. టక్కరితనమున పెద్ద దొంగతనము చేసిన సంతసమున కాబోలు, నల్లని నీళ్లు తిరుగుచు తిరుగుచు క్రీగంటి చూపుల చూచుచు వెడలుచుండెను.

దివసాంతమున మసక వెలుగులును మాయమాయెను. అన్వేషణమున యమున సంక్షుభిత మైపోయెనేకాని, వలయము సంప్రాప్తము కాలేదు. సిక్త వస్త్రములతో, రిక్త హస్తములతో, శ్రాంత నత శిరముతో మరలి వచ్చి, రఘునాథుడు గురువు వద్ద నిలిచెను.

'ఇప్పుడైనను వెదకి తేగలను, అది పడినచోటును చూపితిరేని' అని కరములు జోడించి ప్రార్థింప, ద్వితీయ కంకణమును జలములలో పారవేసి 'అదో అచ్చట' అనెను గురువు.

జూన్, 1888. 17-10-43.

6

దీన దానము

రాజభృత్యులు ఏతెంచి 'మహారాజా, బహు అనునయముల చేసినను, సాధుశ్రేష్ఠుడు నరోత్తముడు, నీ స్వర్ణదేవాలయమున ఆశ్రయము గైకొనక, నేడు పథప్రాంతమున తరుచ్ఛాయల నామ సంకీర్తన ఒనర్చుచున్నాడు. భక్త బృందములు గుంపులు గుంపులుగ అతని చుట్టుచేరి, బుసబుస పొంగి ఒలికి పడుచున్న ఆనందధారచే ధరణీధూళిని ధౌతము ధన్య మొనర్చు చున్నారు. మందిర ప్రాంగణము శూన్యమాయెను. భృంగము మధుభాండ మును వదలి, హఠాత్తుగ కమల పరిమళముల మత్తిల్లి ద్రుతపక్షముల విప్పి, వెరుగుచున్న ఆకలి దప్పికలతో, వికసించు పద్మ కాసారము వైపులకు పరుగిడు చందమున స్త్రీ పురుషులందరును బంగారు దేవాలయమును కన్నెత్తి యైన కాంచకనే, దారిప్రక్కన భక్త హృదయ పద్మము విచ్చి, స్వర్గసౌరభముల వెదజల్లుచున్న స్థలమునకు వెడలుచున్నారు. రిక్త దేవాలయమున, రత్న వేదికపై దేవుడొక్కడే ఉపవిష్టుడై యున్నాడు.

రాజు విని, క్షోభిల్లి, సింహాసనమునుండి దిగి తరుచ్ఛాయన తృణా సనమున సాధువు కూర్చొనియున్న చోటునకు చనెను. అతని చరణముల ప్రణమిల్లి 'ప్రభూ : చూడుడు. నృపతి నిర్మిత నికేతనము స్వర్ణశీర్షమై వెలయుచుండ, అభ్రభేదియగు గోపురముతో దేవాలయము అలరారుచుండ, దానిని వదలి పథప్రాంతమున కూర్చొని, దేవతాస్తవ గానముల సంకీర్తన మొనర్చుచున్నారే' అని అడుగ 'ఆ మందిరమున దేవుడు లేడు' అని సాధువు నుడివెను. రోషమున రాజు 'దేవుడు లేడా ? ఓ సన్యాసీ, నాస్తికునివలె మాటలాడుచున్నావే : రత్నసింహాసనముపై రత్నవిగ్రహము దేదీప్యమానముగ ప్రకాశించుచున్నదే : అది శూన్యమా ?' అని అడిగెను.

'శూన్యము కాదు, రాజదంభమున పూర్ణముగ నున్నది. నిన్ను నీవే అచ్చో స్థాపించుకొంటివి. ఆర్తత్రాణ పరాయణుడగు నారాయణుని కాదు'

అని సాధువు ప్రత్యుత్తర మొసగెను. కనుబొమల ముడిచి, రాజు 'ఇరువది లక్షల స్వర్ణముద్రల వెచ్చించి, ఈ అనిందిత మందిరమును నిర్మించితిని. అంబరచుంబితముగ ఒప్పుచున్నది. పూజామంత్రముల నివేదించి, శుభ ముహూర్తమున దేవతకు అర్పించితిని. అట్టి ఆ మందిరమున దేవతకు స్థానము లేదనుచున్నావే.' అని మరల అడిగెను. శాంతముఖమున సాధువు "ఏ వత్సరము అగ్నిప్రమాదమున దీనులగు ఇరువది వేల ప్రజలు గృహహీనులై, అన్న వస్త్ర రహితులై, నీ ద్వారముకడకు వచ్చి నిలిచి, వ్యర్థప్రార్థనల కావించి ఏడ్చుచు, అరణ్యములకు, గుహాగర్భములకు, పథప్రాంత తరుచ్ఛాయలకు, అశ్వత్థ విదీర్ణ జీర్ణమందిర ప్రాంగణములకు వెడలిపోయిరో, ఆ సంవత్సరము ఇరువది లక్షల స్వర్ణముద్రల వెచ్చించి, నీ స్వర్ణదర్పితమగు గృహమును నిర్మించి దేవతకు సమర్పించితివి. ఆనాడు భగవానుడు 'నా ఆనాదిగృహమున అనంత నీల వర్ణములమధ్య అగణ్య జ్యోతులు వెలుగుచున్నవి నా గృహమున సత్యము శాంతి దయా ప్రేమ, యను నాలుగు శాశ్వతభిత్తికలై యున్నవి. ఎవడు క్షుద్ర కృపణత్వమున శక్తిహీనులు, గృహరహితులగు నిజ ప్రజా గణములకు గృహముల ఇయ్యజాలక పోయెనో, అతను నాకు గృహమును నిర్మించి దానమొసగుచున్నాడే' అని తలచుచు, ఆక్షణమునసే దీనుల ఆశ్రయుడు, దీనులతోడి, పథప్రాంతములకు తరుచ్ఛాయలకు వెడలిపోయెను. అగాధ సముద్రముమధ్య పొంగుచున్న నురుగు ఎటుల శూన్యమో, అటులనే ఈ ధరణిపై నీ మందిరమును పరమశూన్యము; కేవలము స్వర్ణము, దర్పముల బుద్బుదములు తప్ప మరేమియు లేవు" అనెను.

రోషానలమున మండుచు రాజు 'ఒరే దొంగసన్యాసి, ఈ క్షణమునసే నా రాజ్యమును వదలి వెళ్లుము' అని ఉత్తరువు ఇచ్చెను.

శాంతస్వరముల సన్యాసి 'భక్తవత్సలుని నిర్వాసనమున ఎచటికి వెడలగొట్టితివో, అచ్చటికి భక్తజనులను, మహారాజా, పంపివేయుము' అసి చెప్పి వెడలిపోయెను.

1900 18-10-43.

7

విసర్జన

ఒడిలోని ఇద్దరు బిడ్డలు, పూర్తిగా రెండు సంవత్సరములు నిండక మునుపే వరుసగ చనిపోయిరి. ఈతూరి బిడ్డపుట్టినపుడు, మల్లిక భర్తను కోల్పోయెను. చుట్టములందరును చేరి 'పూర్వజన్మమున చేసిన బహుపాపములకు మారుగ ఈ జన్మమున ఇట్టి దారుణ సంతాపముల అనుభవించు చున్నావని తెలియచెప్పిరి శోకానలమున దహించుక పోవుచున్న స్త్రీ అత్యంతవినయమున, అజ్ఞాత జన్మపు పాపముల శిరమున వహించి, ప్రాయశ్చిత్తములకై ఆమె చిత్తము పూనుకొనెను. ఇచ్చట అచ్చట గ్రామగ్రామమున ఉన్న మందిరముల సేవించుచు క్రుమ్మరుచు వ్రతముల ధ్యానముల ఉపవాసముల ఆహ్నిక తర్పణముల కావించుచు, ధూప దీప నైవేద్య చందన పూజా గృహముల మధ్య దినముల గడపుచుండెను. శతబ్రాహ్మణుల పదధూళిని గైకొని, సంగ్రహించిన తాయెత్తులను అతి జాగ్రత్తతో కేశములలో కట్టి ఉంచు కొనెడిది. రామాయణ కాలక్షేపములను వినుచుండెడిది. సాధు సన్యాసుల ఇంటికి రావించి వారిచే శిశువును ఆశీర్వాదముల పొందించెడిది. పుడమిలో అందరికన్న తక్కువగ తన్ను ఉంచుకొని, అందరి ప్రసన్న దృష్టుల ఆ అభాగ్యురాలు తన బిడ్డకై కోరుకొనుచుండెడిది. సూర్యచంద్రులు మొదలు పశు పక్షి కీటకములవరకు దేనిచేతనైన ఎవరేని మనమున తప్పుపట్టెద రేమోనని, ఎవరైన విసిగిపోయెద రేమోనని, ఏదేని తెలియరాని కారణమున ఎవరికైన వ్యథ కలుగు నేమోనని, అందరి వద్ద ఆకుల వేదనా భరితయై దీనయై యుండెడిది.

బిడ్డకు పదునెనిమిది మాసములు పూర్తికాగా, బిడ్డకు కడుపులో బల్ల జబ్బు తగిలి, దాని సహజ లక్షణములు వికారములన్నియు కాన్పింపతొడగెను.

కాగుచున్న జ్వరముచే దేహము కృశించుచుండెను. దేవాలయమున తల్లి మ్రొక్కుబడులు మ్రొక్కుకొనెను. సాధుసన్యాసుల పదామృతమును తెచ్చి బిడ్డచే త్రాపించెను. తన ఆవరణయంతయు హరినామ సంకీర్తన గానములచే అదరిపోవుచుండెడిది. వ్యాధి కొంచెమైనను తగ్గుముఖము చూపలేదు. ఏడ్చుచు తల్లి 'అయ్యో, స్వామీ, విప్రుడా. ఇంత దుఃఖము ననుభవించినను, పాపము దూరము కాలేదా ? దినరాత్రములు దేవుని శరణ్యమును కోరుచు మ్రొక్కుచున్నానే, ఇన్ని పూజల కావించితినే, అయినను రక్షణ లేదా? ఆ ధర్మ ప్రభువు నా బిడ్డను తీసికొనియే తీరునా ? దేవునికి ఇంతటి ఆకలియా ? నా నగలన్నిటిని అమ్మి, తినుటకు భారములగు నైవేద్యముల నొసగితినే, నా సర్వస్వమును ధారవోసి, తళియల వేయించి సమర్పించితినే, అయినను ఆకలి తీరలేదా ?' అని విన్నవించుకొనెను.

"బిడ్డా, ఇది చెడ్డ కలికాలము కదా ! నీవు అనేకములు కావించితివి. నిజమే, కాని ఇదియు నేను చెప్పవలసియున్నది. ఈ దినములలో నిజమగు భక్తి ఎవరికైన గలదా ? సత్యయుగమున చేయ గలిగిన పనులు, నేడు చేయ గలరా ? దానవీరుడగు కర్ణుని వద్దకు, బ్రాహ్మణ వేషమున యముడు వచ్చి, తినుటకు అతని బిడ్డను కోరగా, వెంటనే నిజహస్తములతో బిడ్డను కోసి పెట్టెను. అప్పుడే నయననిమేష కాలమున, ఆ బిడ్డను అతను తిరిగి పొంద లేదా! శిబిచక్రవర్తి శ్యేనరూపమున నున్న దేవేంద్రునికి తన వక్షపు మాంసమును తినుటకు కోసి ఇచ్చి, అక్షయ దేహమును తిరిగి పొందెను. దీనినే నిష్ఠ అనెదరు. భూమండలమున ఈ కాలమున అట్టిది కలదా ? చిన్నతనమున తల్లి వద్దనుండి విన్న కథ జ్ఞప్తికి వచ్చుచున్నది. వారి గ్రామమునకు దగ్గరగనే ఒక వంధ్య స్త్రీ యుండెను. తన స్థితికి చింతించి, వేరు ఉపాయము కానక, సంతానము కలిగిన, ప్రథమ గర్భపు బిడ్డను గంగామాతకు అర్పించెదనని మ్రొక్కుకొనెనట. కడకు పుత్త్రుడు జన్మించెను. కాని తోడనే భర్త చని పోయి విధవ యాయెను. గంగానది వద్దకు వెళ్ళి, నిష్ఠాభరితయై, గంగా మాతను విలిచి 'తల్లీ, నీ ఒడిలో ఈ బిడ్డను ఉంచుచున్నాను. ఇదే నా మొదటి

బిడ్డయు, కడపటి బిడ్డయు కూడ. ఇక ఈ జన్మమునే నాకు పుత్రుని ఆశ లేదు.' అనుచు నీటిలో వేయగనే మాత భాగీరథి మకరవాహిని రూపమున ప్రత్యక్షమై తన కరపద్మములలో బిడ్డను ఎత్తుకొని, తిరుగ తల్లి ఒడిలోనికి సమర్పించెను. దీనిని నిష్ఠ అనెదరు" అని బ్రాహ్మణుడు తెలియచెప్పెను. మల్లిక నతశిరమున తిరిగివచ్చి, తన్ను తానే నిందించుకొనెను. 'ఇన్నాళ్లుగ వ్యర్థముగ వ్రతముల చేసితిని, దేవార్చనల కావించితిని. నిష్ఠలేని పాపిష్ఠకు ఫలితము దొరకలేదు.' అని చింతించెను.

ఇంటికి వచ్చిచూడగా, బిడ్డ జ్వరావేశమున అచేతనముగ పడియుండెను. డలంతయు నిప్పువలె కాగుచుండెను. నోట ఎన్నిమారులు ఔషధము ినను, క్రిందపడి పోవుచున్నదేకాని గొంతుక్రింద దిగి ద్రిమ్గుడుపడుటలేదు. ులు అతుకుకొని పోయినట్లుండెను. వైద్యులు తలల పంకించి, ల్లగ రోగిగృహమును వదలి వెళ్లుచుండిరి. క్రమ్ముచున్న సాయంకాలపు ట్లలో, శూన్య విధవా గృహమున ఒక మలిన దీపము బిడ్డ పడియుండిన గదిలో మినుకు మినుకుమనుచుండెను. శోకాతుర జననియు ఒంటరిగ నుండెను. శిశువు ఒకతూరి పాలిపోయిన కండ్లను తెరచి నల్గడల ఎవరినో వెదకుచున్నట్లు చూచెను. జనని భయపడి 'ఓ నా మాణిక్యమా ! ఓ నా బంగారూ ! ఇదో చూడు ! నీ తల్లిని నేనుండ నీకు భయమేల ? నాయనా !' అని ఏడువసాగెను. ఎత్తి వక్షమునకు గట్టిగ అదుముకొని, అతని జ్వరతాపమును తన దేహము లోనికి తీసికొన అనురాగ పూర్వకముగ కోరుకొనుచుండెను.

తటాలున గాలిచే ఇంటివాకిలి తెరువబడెను. తోడనే ఆ క్షీణదీపమును ఆరిపోయెను. బయటినుండి ఏదో గలగలశబ్దము గృహములోనికి ప్రవేశించి నట్లుండెను. ఉలికిపడి పడకను వదలి వేగముగ లేచి నిలువబడి 'అదో తల్లిపిలుపు వినబడుచున్నది. నొప్పిచే కష్టపడుచున్న నా బంగారుకు ఒక ఉపాయము దొరికినది. ఓ నా బిడ్డా, నీ తల్లిఒడికన్న శీతలమగు అంకము కలదు, నాయనా' అని తనలో తాను అనుకొనెను. అనతిదూరమున జాహ్నవీ జలముల కలరవములు వినవచ్చుచుండెను. పూర్ణిమయందు సముద్రపు

పోటుచే నీరములు కొద్దిగ పొంగుచుండెను. శిశువు తప్తశరీరమును వక్షమున తీసికొని, జనని శూన్యమగు రేవువైపులకు వెడలెను. 'తల్లీ: తల్లివ్యథ నీ డెందమున తగిలియుండిన, ఈ బిడ్డయొక్క జ్వరమును తగ్గించి నిమ్మళము చేయుము. ఈ నా ఏకమాత్రమగు సర్వస్వమును నీ పాదములకడ హృదయ పూర్వకముగ అర్పించుచున్నాను' అని పలికి అచేతనముగనున్న శిశువును చేతిలోనికి తీసికొని, కన్నుల మూసికొని, నీళ్లలో పెట్టి అర్పించెను. చాలసేపువరకు కన్నుల తెరవలేదు. ధ్యానమున కూర్చొని మకరవాహిని, మూర్తిభవించిన జ్యోతిర్మయియై చిన్నశిశువును అంకమున చేర్చి, అతని శిరముపై ఒక పద్మదళమునుంచి వచ్చుచునట్లు, హాసముఖమున ఆనందకాంతి తళతళలాడుచుండ, దేవి అంకమును వదలి, జననిఅంకమునకు వచ్చుట కరముల చాచుచున్నట్లు, 'ఓ దుఃఖపడుచున్నదానా: ఇదో తీసికొ నీ ధనమును నీకు మరల్చుచున్నాను.' అని దేవి చెప్పుచున్నట్లు తియ్యని కాంచెను. రోమాంచిత కాయముతో నయనముల తెరచి 'ఏది తల్లీ, ఎచ్చ అని అరచెను

పరిపూర్ణమగు చంద్రకాంతిచే విహ్వలమై పోవుచుండెను రజని. కల ధ్వనుల కావించుచు గంగానది ప్రవహించి పోవుచుండెను. 'తిరిగి ఇయ్యవా?' అని ఒక్కటే కేకవేసి, నారి మూర్ఛపోయెను. దక్షిణ సమీరముల వనభూమి మర్మరధ్వనుల కావించుచుండెను.

అక్టోబరు, 1899. 18-10-43.

8

పాదరక్షలకనిపెట్టుట

హబూరాజా 'వినుము గోబరాయా, నిన్నటి రాత్రి అంతయు దీని విషయమై ఆలోచించుచుంటిని; ధరణిపై చరణముల పెట్టినతోడనే, మలినమగు ధూళి కాళ్లకు ఏల తగులవలయును ? మీరందరును జీతముల పంచి తీసికొను టయే తప్ప, రాజుపనులమీద మీకు దృష్టియే లేదు. నా మట్టి నాకు మట్టి వ్రాయుటయా ? నా రాజ్యమున ఇవెట్టి వైచిత్ర్యము ! దీనికి ఏదో ప్రతీ కారము వేగముగ మీరు చేయవలయును, లేకున్న ఇక మీకు రక్షణ లేదు' అని మంత్రిని పిలిపించి చెప్పెను.

గోబురాయలు విని, ఒక క్షణకాలము ఆలోచించి నివ్వెరపోయెను. తీవ్రమైన భీతిచే ఒడలంతయు చెమటలు పోసెను. పండితుల ముఖములు వెలవెలపోయెను. ఉద్యోగస్థుల కందరికిని రాత్రులు నిద్రలేదు. వంటఇండ్లలో పాత్రలు పొయ్యిమీదికి ఎక్కుటలేదు. గృహములలో ఏడ్పులు మెండాయెను. నెరసిన గడ్డమును కన్నీటిలో తేల్చుచు 'మీ పాదములకు ధూళి అంటకపోయిన, ఏ ఉపాయమున మాకు మీ చరణధూళి దొరకగలదు ?' అని హబూపాద పద్మములకడ గోబు విన్నవించెను.

రాజు విని, ఇటునటు తల ఊపుచు ఆలోచించి, చివరకు 'ఈ మాట మాత్రము నిజమే' కాని తొలుత ధూళిని పాత్రోలుడు, తదుపరి పదధూళితత్వ విషయమై ఆలోచించెదము. ధూళిరాహిత్యముచే పదధూళిని మీరు పొంద శాలనిచో, మీరు మీమీ మాసవేతనములను వృథాగా తినుచున్నారని శలచెదను. నేనేల ఇంతమంది పెద్దపెద్ద బిరుదముల కలిగిన వైజ్ఞానిక కృత్యులను పోషించుచున్నానో తెలియకున్నది. మొదటి విషయము మీరు ముదట నెరవేర్పుడు, తర్వాత విషయములను తర్వాత ఆలోచింపుడు' అని డివెను.

రాజుమాటల విని, చీకటిపడగనే చూచి శాస్త్రజ్ఞుల, విజ్ఞానుల, దేశ విదేశములనుండి ఆరితేరివచ్చిన యంత్రజ్ఞుల మంత్రి రావించెను. కండ్లకు సులోచనముల తొడిగి, అందరును కూర్చుండిరి. ఎన్ని ముక్కు-పొడిడబ్బీలు ఖాళీలాయెనో లెక్క-లేదు ! దీర్ఘముగ సమాలోచించి 'మట్టిపోయిన, ఇలలో మరి పంటలు పండుట ఎట్లు ?' అని చెప్ప 'పంటలు పండకున్న, మరి మీరు ఉన్నదెందులకు?' అని రాజు అడిగెను.

అందరును కలసి, కడకు యుక్తిని పన్ని, కొన్ని లక్షల చీపురులను కొనిరి. ఈ చీపురుల ఊడ్పులకు వీథులలోని ధూళి ఎగురుచువచ్చి, రాజు ముక్కు-, గుండెను నింపివేసెను. దుమ్ములలో ఎవరును కన్నుల తెరవలేక పోయెరి. ఈ దుమ్ముమబ్బులచే సూర్యుడును మరుగు పడిపోయెను. ధూళి వేగములచే ప్రజలు దగ్గుచే చచ్చుచుండిరి. ధూళులమధ్య నగరము చిందర వందర యాయెను. ఇదిచూచి రాజు 'ధూళిని దూరము చేయనెంచి, జగత్తును ధూళిభరితము చేసిరే' అనెను.

అప్పుడే గబగబ గుంపులు గుంపులుగ తోలుసంచుల భుజములకు తగిలించుకొని కొన్ని లక్షలమంది బయలుదేరిరి. నీళ్లు తోడితోడి సంచులనింప, మడుగులలో బురద మాత్రము మిగిలెను. నదులలో రాకపోకలు నిలిచి పోయెను. నీళ్లు లేకపోవుటచే, నీళ్లజీవములు చచ్చిపోవుచుండెను. మెట్ట జంతువులు బురదలో దిగబడి పోవుచుండెను. పంకముయొక్క మాహాత్మ్యము వలన దేశములో అమ్మకాలు కొనుగోళ్లు నిలిచిపోయినవి. శీతజ్వరములచే దేశము నాశనమై పోయెను. రాజు 'ఈ గాడిదెలు దుమ్మును అణచి బురదను సృష్టించిరే' అనెను.

తిరుగ సంప్రతింపులకై అందరిని పిలిచిరి. తిరుగ పండితులందరును కూర్చొనిరి. తలల ఆడించి, గుడ్లు మిటకరించి చూచుచు ధూళియొక్క అంతమును కనిపెట్ట చూచుచున్నారు. 'తివాచీ కంబళ్లతో నేలను కప్పి వేసెదము. మెత్తలతో ధూళిని బంధించెదము' అనిచెప్ప మరికొందరు రాజును


'గదిలోనే ఉంచుడు, ఎచ్చట ఎట్టిరంధ్రమైన లేకుండునటుల చేయుడు. ధూళిపై కాలు మోపకున్న, కాళ్లకు ధూళి ఎటుల తగులగలదు' అనిరి.

'అది మిగుల సత్యమగు సంగతియే. కాని నామనమున ఇదే సందేహము ఒడముచున్నది. మట్టి భయముచే నేను రేయింబవలు గదిలోనే బంధింపబడిన, రాజ్యము మట్టియై పోగలదు' అని రాజుపలుక, అందరును 'అటులైన మాదిగ వారిని పిలిపించి, పృథ్వినంతయు చర్మములతో కప్పివేయుడు. ధూళితో కూడిన ధరణిని తోళ్లతో కప్పించిన మహాకీర్తి మన మహీపతికి దక్కగలదు' అని నుడువ, ఇతరులందరును 'అది సులభముగ నెరవేరగలదు. దక్షులగు చర్మకారులు దొరకినచో' అని సంతసమున చెప్పసాగిరి.

రాజు సేవకులందరును ఇటునటు పరుగెత్తిరి. ఇతర కార్యములన్నియు విడిచి, ఇదే పనిలో నిమగ్నులైరి. దక్షులగు మాదిగలును ఎచ్చట దొరకరైరి. అంతకన్న వలసినంత చర్మమును లభింపలేదు. అప్పుడు మాదిగల కులపతి వృద్ధుడు వచ్చి, కొద్దిగ నవ్వి 'అనుమతించిన సులభముగ మీ సంకల్పము నెరవేరుటకు గల ఉపాయమును చెప్పగలను. తమ రెండు కాళ్లను కప్పుకొనిన, మరి నేలను కప్ప నక్కరలేదు' అని వక్కాణించెను.

'ఇది అంత చక్కగ నుండగలదా? ఆలోచించిచూడుడు. ఈ ఉప ద్రవమును తొలగించి, దేశమును కాపాడుడు' అని రాజు చెప్పెను. మంత్రియు కోపగించి 'ఈ నా బడవను శూలమునకు తగిలించి బంధిఖానాలో పడవేయుడు' అనెను. ఆ ముదుసలి, చరణముల కడ కూర్చొని, రాజు పదముల చర్మములతో చుట్టి కప్పివేసెను. 'ఇది నా మనస్సున కూడ ఉండి నదిः ఈ నాకొడుకు ఎటుల తెలిసికొన గలిగెనో!' అని మంత్రి అను చుండెను. ఆ దినమునుండి చెప్పులువేయుట మొదలిడెను. గోబు బ్రతికి పోయెను. ధరణియు రక్షింపబడెను.

1897 19-10-1943



100

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	PJSA115B162
పుస్తకం పేరు	కథలు కల్పనలు
తారీఖు	27 March 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	121
పెద్ద సైజు పేజీలు	20
ఖాళీ పేజీలు	16, 14, 12, ,72 100,CI
లేవి పేజీలు	no
తయారు చేసినది	K. Kalyani
పేజీలు విడదీసినది	Saramya
స్కాన్ చేసినది	K David
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపైది	good.